తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 16.09.2024 | సంపుటి : 11 సంచిక : 67 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






# రాహుల్‌ను ప్రధాని చేస్తాం

## తెలంగాణలో పదేళ్లు మేమే అధికారంలో ఉంటాం

### హరీశ్.. రాజీనామా ఎప్పుడు?.. ప్రశ్నించిన సీఎం రేవంత్

- త్వరలో మరో 35 వేల ఉద్యోగాల భర్తీ
- కాంగ్రెస్ కార్యకర్తల జోలికొస్తే ఉపేక్షించేది లేదు
- సంపద సృష్టిస్తున్నాం.. ప్రజలకు పంచుతున్నాం :డిప్యూటీ సీఎం భట్టి
- కష్టపడ్డవారిని పార్టీ గుర్తుపెట్టుకుంటుంది :మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- రాజకీయాల్లో కష్టంతోపాటు అదృష్టమూ ఉండాలి :టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్

హైదరాబాద్(జనంసాక్షి): కాంగ్రెస్ మాట ఇస్తే, తప్పక జరిగి తీరుతుందని నిరూపించామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో రూ. 2లక్షల రుణమాఫీ చేసి చూపించామని పునరుద్ఘాటించారు. ముందుగా తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్ష పదవి బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అభినందలు తెలిపారు. ప్రభుత్వం, పార్టీ జోడెద్దులుగా సాగాలనే ఉద్దేశంతో అధిష్ఠానం బలహీన వర్గాలకు చెందిన మహేశ్‌కుమార్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షునిగా ఎంపిక చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నూతన పీసీసీ అధ్యక్షుని ఆధ్వర్యంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని జనంలోకి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ బాధ్యతల స్వీకరణ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ హామీలపై స్పష్టమైన ప్రకటనలు చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పంద్రాగస్టులోపే రూ. 2 లక్షల రుణమాఫీ చేసి చూపించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయ రుణం రూ. 2 లక్షలకు పైగా ఉన్న రైతులు భయపడొద్దని, అందరికి న్యాయం చేస్తామని తెలిపారు. రుణమాఫీ చేస్తే రాజీనామాకు సిద్ధమన్న హరీశ్‌రావు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఇప్పటికే 30వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్న రేవంత్‌రెడ్డి, ఈ ఏడాది చివరి

మిగతా 2లో..



అవినీతి ఆరోపణలున్న అధికారులపై

## చట్టప్రకారం దర్యాప్తు చేయాలి

పోలీసులకు హైకోర్టు ఆదేశాలు



హైదరాబాద్(జనంసాక్షి): చెరువుల ఆక్రమణలకు సహకరించారంటూ ప్రభుత్వ ఉద్యోగులపై హైడ్రా ఆగస్టు 30న పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో చట్ట ప్రకారం దర్యాప్తు చేయాలని హైకోర్టు సైబరాబాద్ పోలీసులను ఆదేశించింది. నిందితులకు నోటీసులు జారీ చేసి,

మిగతా 2లో..



మరోసారి తెరపైకి

## జమిలి

దిల్లీ(జనంసాక్షి): 'ఒక దేశం.. ఒకే ఎన్నిక' అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. ప్రస్తుత ఎన్డీయే పాలనలోనే జమిలి ఎన్నికల నిర్వహణ మొదలవుతుందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వివిధ రాజకీయ పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశాయి.

మిగతా 2లో..



గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం, వీహెచ్ తదితరులు

### టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్

## బాధ్యతల స్వీకరణ

హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి,భట్టి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. గాంధీభవన్‌లో పలువురు కాంగ్రెస్ నేతల సమక్షంలో పీసీసీ పగ్గాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు మంత్రులు, ఏఐసీసీ నేతలు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ నూతన పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన పీసీసీ పగ్గాలు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి పీసీసీ అధ్యక్ష బాధ్యతలను మహేశ్‌కుమార్ గౌడ్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గాంధీభవన్‌లో సందడి నెలకొంది.సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ పలువురు ఏఐసీసీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మహేశ్‌కుమార్ గౌడ్ గన్‌పార్కు నుంచి ర్యాలీగా గాంధీభవన్‌కు వచ్చారు. ర్యాలీ పెద్దఎత్తున వాహనాలు,

మిగతా 2లో..

### ప్రవక్త బోధనలు ప్రపంచానికి దిక్సూచి

ముస్లిం సోదరులకు సీఎం రేవంత్ 'మిలాద్ ఉన్ నబీ' పండుగ శుభాకాంక్షలు

హైదరాబాద్(జనంసాక్షి):'మిలాద్ ఉన్ నబీ' పండుగను పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లింలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

మిగతా 2లో..

### రెండు రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి

## రాజీనామా చేస్తా

సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన

నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేవరకు పదవి వద్దని వెల్లడి

త్వరలో కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేస్తామని ప్రకటన



దిల్లీ(జనంసాక్షి):దిల్లీముఖ్యమంత్రిఅరవింద్ కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండ్రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. తాను నిర్దోషిగా నిరూపించుకునేంత వరకూ సీఎం పదవిలో ఉండనని ప్రతిజ్ఞ చేశారు.దిల్లీలోని ఆప్ కార్యాలయంలో ఆదివారం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ ప్రసంగించారు.ఆప్ కష్టాల్లో ఉన్నప్పుడు సాక్షాత్తు భగవంతుడే తమతో ఉండి ముందుకు నడిపించాడని కేజ్రీవాల్ అన్నారు. దేవుడిచ్చిన ధైర్యంతో శత్రువులతో పోరాడతామన్నారు. ఆప్ నాయకులు సత్యేందర్ జైన్, అమానతుల్లా ఖాన్ ఇంకా జైల్లోనే ఉన్నారని.. త్వరలోనే వారు బయటకు వస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆప్ నుంచి

మిగతా 2లో..

## హామీలు నెరవేరలేదు.. అందుకే రాజీనామా చేయలేదు

హరీశ్‌రావు



హైదరాబాద్ (జనంసాక్షి): నోరు పారేసుకున్న సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. రాజీనామా చేస్తానన్న సన్నాసి.. ఎక్కడ దాక్కున్నవ్.. అని రేవంత్ రెడ్డి అంటున్నారు. నేను ఎక్కడ దాక్కోలేదు.. నేను గుండెల్లో దాక్కున్నా.. నీ గుండెల్లో నిద్రపోతున్నా.. రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు సింహంలా గర్జించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.రాజీనామా చేస్తా అన్న సన్నాసి ఎక్కడ దాక్కున్నావ్.. అని రేవంత్ రెడ్డి మాట్లాడుతుండు.. నేను ఎక్కడ దాక్కున్నా.. నేను నీ గుండెల్లో దాక్కున్నా.. నీ గుండెల్లో నిద్ర పోతున్నా.. నీకు నిద్ర పట్టనివ్వకుండా అనుక్షణం రుణమాఫీ గురించి గుర్తు చేస్తూ.. నీ మెడలు వంచి సగం రుణమాఫీ చేయించాను రేవంత్ రెడ్డి. మిగతా సగం రుణమాఫీ చేసేంత వరకు నీ వెంట పడుతూనే

మిగతా 2లో..

### హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందుకు

## విపక్షాల కుట్రలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు : మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ (జనంసాక్షి): హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. కానీ ప్రతిపక్షాలు దానికి భిన్నంగా వ్యవహరిస్తూ హైదరాబాద్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కాంగ్రెస్‌పై బీఆర్ ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలపై మంత్రి శ్రీధర్‌బాబు ఘాటుగా స్పందించారు. హైదరా బాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రతిపక్షనాయకులు ప్రయత్నిస్తున్నారని మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. పరిపాలన కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు.శాంతి భద్రతల విషయంలో ఎవరినీ ఉపేక్షించబోమని మంత్రులు స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని రావుల చెరువుకట్ట గజానన సంస్థ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గణపతి నవరాత్రి ఉత్సవాల కార్యక్రమంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలు పరిశీలిస్తే ఎవరు తెలివితేటలు చూపిస్తున్నారో కనిపిస్తోందని శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన శాసనసభ్యుడైన గాంధీ తాను కారు పార్టీ ఎమ్మెల్యేనని వ్యాఖ్యానించారన్నారు. బీఆర్ఎస్ అంతర్గత విషయాల్లో తాము కలుగజేసుకోమని,

మిగతా 2లో..



## భట్టికి అపూర్వ ఆహ్వానం

ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరుకావాలని పిలుపు

హైదరాబాద్ (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అరుదైన గౌరవం లభించింది. నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానం అందింది. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు..మెక్సికో దేశంలో న్యూవోలియోన్‌లోని మోంటిగ్రో నగరంలో జరగనున్న 19వ ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాల్సిందిగా భట్టి విక్రమార్కకు నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందింది. ప్రగతి కోసం శాంతి అనే ప్రధాన అజెండాతో ఈ

మిగతా 2లో..

## ఉత్తర్‌ప్రదేశ్‌లో విషాదం

కుప్పకూలిన మూడంతస్తుల భవనం

10 మంది దుర్మరణం

శిథిలాల కింద చిక్కుకున్న పలువురు.. కొనసాగుతున్న సహాయక చర్యలు

మేరఠ్(జనంసాక్షి): ఉత్తర్‌ప్రదేశ్ మేరఠ్‌లోని జాకీర్ కాలనీలో మూడంతస్తుల భవనం కూలి 10 మంది మృతి చెందారు. శిథిలాల కింద మరి కొంత మంది చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.ఎన్డీఆర్ఎఫ్ బృందాలు శిథిలాలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో మూడంతస్తుల భవనం కూలి 10

మిగతా 2లో..



### మహిళా న్యాయమూర్తులకు సైతం

## ఎన్నో ఇబ్బందులు

వారు మరింత కఠినంగా వ్యవహరించాలి :జస్టిస్ హిమా కోహ్లీ



దిల్లీ(జనంసాక్షి): మహిళా న్యాయమూర్తులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఇటీవల పదవీ విరమణ చేసిన జస్టిస్ హిమా కోహ్లీ అభిప్రాయపడ్డారు.మహిళా న్యాయమూర్తులు సైతం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ మేరకు వ్యాఖ్యానించారు. కుటుంబ న్యాయస్థానాలకు, శిశు సంక్షేమం మొదలైన వాటిని మహిళా న్యాయమూర్తులే ఎందుకు నడపాలని ఆమె ప్రశ్నించారు. అన్ని విభాగాల్లో వారు తమ ఉనికి ఉండేట్లు చూసుకోవాలన్నారు. బెంచ్ ఏర్పాటులో లింగవివక్ష హేయమైనదిగా ఆమె అభివర్ణించారు. తొలితరం న్యాయమూర్తులకు కార్యాలయాలు, వనరులు, మౌలిక వసతులు సైతం లేక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కున్నారన్నారు.ఓ మహిళ న్యాయవాద వృత్తిని ఎంచుకోవడమే సవాళ్లతో కూడిన పనిగా జస్టిస్ హిమా కోహ్లీ అభిప్రాయపడ్డారు. జ్యుడిషియల్ ఆఫీసర్‌గా బెంచ్‌కు వెళ్లడం సులభమేనని, కానీ.. బార్ నుంచి బెంచ్‌కి వెళ్లడం కష్టమన్నారు. తన న్యాయవాద వృత్తిలో తోటి ఉద్యోగులతో ఎప్పుడూ ఇబ్బంది పడలేదన్నారు. న్యాయమూర్తులు మనస్సాక్షిని మాత్రమే వింటారని.. ప్రజలు సర్వోన్నత న్యాయస్థానంపై నమ్మకం ఉంచాలని కోరారు. వర్చువల్ హియరింగ్ ద్వారా

మిగతా 2లో..

అధికారమిస్తే..

## మద్య నిషేధాన్ని ఎత్తేస్తాం

జన్ సురాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ హామీ

పట్నా(జనంసాక్షి): బిహార్‌లో తమ పార్టీ అధికారంలోకి వస్తే మద్య నిషేధాన్ని రద్దు చేస్తామని జన్ సురాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ హామీ ఇచ్చారు. అక్టోబరు 2న తమ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఏర్పాట్లను వివరిస్తూ ఈ విషయాన్ని చెప్పారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ

మిగతా 2లో..



### వందే భారత్ రైళ్లను

## మళ్లీ ప్రారంభించిన మోదీ



ఝార్ఖండ్(జనంసాక్షి): వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైళ్లు టాటానగర్-పాట్నా, బ్రహ్మపూర్-టాటానగర్, రూర్కెలా-హౌరా, డియోఘర్-వారణాసి, భాగల్పూర్-హౌరా, గయా-హౌరా వంటి ఆరు కొత్త మార్గాలలో ప్రయాణికులకు సేవలు అందించనున్నాయి.ఈ వందే భారత్ రైళ్లు గంటకు 160 కి.మీల వేగంతో ప్రయాణిస్తాయని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. 24 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిత్యం 120 ట్రిప్పులతో ఇవి ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయని తెలిపింది.ఈ నేపథ్యంలో వివిధ రైల్వే ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేశారు.

మిగతా 2లో..

ప్రజలను కలుసుకునేందుకు

## నన్ను ఏశక్తీ ఆపలేదు

ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

జెంషెడ్‌పుర్(జనంసాక్షి): తాను ప్రజల వద్దకు చేరుకోవడాన్ని భారీ వర్షమే కాదు.. ఏదీ ఆపలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దిల్లీ నుంచి రాంచీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన..ప్రతికూల వాతావరణం నేపథ్యంలో అక్కడి నుంచి దాదాపు 126కి.మీల మేర రోడ్డు మార్గంలో జెంషెడ్‌పుర్ చేరుకున్నారు. ఈ ఏడాది చివరిలో ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ

మిగతా 2లో..

## హైతీలో ఘోర ప్రమాదం

ఇంధన ట్యాంకర్ పేలి 25 మంది మృతి 2లో



## మణి ద్విపవర్ణన కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

హైదరాబాద్(జనంసాక్షి):కొత్తపేట అష్ట లక్ష్మి దేవాలయనీ ఆధ్యాత్మిక కేంద్రలో శివ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మణి ద్వీప వర్ణన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఆ అమ్మవారి ఆశీస్సులు అందరి మీద వుండాలి అని ఆయన అన్నారు.సమూహిక ఓం శ్రీమాత్రే నమః మహిళా సంఘం పారాయణం గ్రూపు ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు .సామూహికంగా మణిద్వీప వర్ణన పూజ, 108 దజన్ల గాజులతో చీరలలో అష్టోత్తరాలు జరిపిస్తున్నామన్నారు. మాదురీ శ్రీనివాస్ గుప్త ఆర్య వైశ్య కొత్త పేట అధ్యక్షుడు, కోటేశ్వర రావు శ్రీ శైవ క్షేత్రం మేనేజర్ వాసవి ఇంటర్నేషనల్ పరివార్ మహిళ విభాగం అధ్యక్షురాలు అయిత హేమ కుమార్ ,ఎల్వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు .

## ప్రవక్త బోధనలు యావత్ ప్రపంచానికి దిక్సూచి

మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రోజని అన్నారు. శాంతి, సోదరభావం, కరుణ, ధర్మబద్ధ జీవనాన్ని చాటి చెప్పే ముహమ్మద్ ప్రవక్త బోధనలు యావత్ ప్రపంచానికి దిక్సూచి లాంటివని ముఖ్యమంత్రి అన్నారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధికి ప్రజా పాలనలో సముచిత ప్రాధాన్యం ఉంటుందని, ముస్లింల సామాజిక ఆర్థిక అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు.

## హైతీలో ఘోర ప్రమాదం

(జనంసాక్షి):హైతీలో ఇంధన ట్యాంకర్ పేలడంతో 25 మంది మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఉదయం ఈ ఘటన జరిగినట్లు స్థానిక మాడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.పెట్రోల్ ట్యాంకర్ అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. హైతీ తాత్కాలిక ప్రధాని గ్యారీ కొనిల్ ఘటనాస్థలిని సందర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. 'ఇది భయంకరమైన ఘటన. ఘటనలో తీవ్రంగా గాయపడిన వారి ప్రాణాలను రక్షించడానికి అత్యవసర బృందాలు పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు.హైతీ రాజధాని పోర్ట్ ఒ ప్రిన్స్ ప్రస్తుతం క్రిమినల్ గ్యాంగుల అదుపులో ఉన్న విషయం తెలిసిందే. ముఠాల వ్యాప్తితో దేశంలో స్థానికులు ఇళ్లను వదిలి వెళ్లిపోవడంతో పాటు ఆకలి సంక్షభం, లైంగిక హింస వంటివి పెరిగిపోయాయి. దేశంలో ప్రస్తుతం అత్యవసర పరిస్థితి అమలులో ఉంది.

# రాహుల్‌ను ప్రధాని చేస్తాం



నాటికి మరో 35వేల ఉద్యోగ ప్రకటనలు చేస్తామని హామీ ఇచ్చారు. ఒక్క ఏడాదిలోనే 65వేల నింపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. 'రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పార్లమెంట్ ఎన్నికల్లో ఓ పార్టీ నేత రుణమాఫీ చేస్తే రాజీనామాకు సిద్ధమన్నారు. ఆనాడే దైవం సాక్షిగా చెప్పినా, పంద్రాగస్ట్ లోపల రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతానని మాట ఇచ్చాను. పార్లమెంట్ లో 42 శాతం ఓట్లు, 8 ఎంపీ సీట్లు మీరు గెలిపించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 నాటికి 23 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. ఇప్పుడు రాజీనామా చేస్తానన్న ఆ వ్యక్తి ఎక్కడ దాక్కున్నాడు."అని సీఎం అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల జోలికి ఎవరైనా వస్తే ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. అరెకపూడిగాంధీ, కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై పరోక్షంగా స్పందించిన రేవంత్, మా ఇంటికి వస్తామని బెదిరిస్తే, మావారే వెళ్లి వారి పనిపట్టారన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ సౌమ్యుడు అని ఎవరైనా తోకజాడిస్తే, ఆయన వెనుక నేనున్నానన్న విషయం మరచిపోవద్దని స్పష్టం చేశారు.ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు, విజయాలు సెమీఫైనల్స్ మాత్రమేనని రేవంత్ స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసినప్పుడే మనం ఫైనల్స్‌లో విజయం సాధించినట్లు అప్పటివరకు విశ్రమించవద్దని పిలుపునిచ్చారు. 1994 నుంచి రాష్ట్రంలో ప్రతిపార్టీ రెండుసార్లు చొప్పున గెలిచిందని, కాంగ్రెస్ కూడా కచ్చితంగా వరసగా రెండుసార్లు అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**సంపద సృష్టిస్తున్నాం- ప్రజలకు పంచుతున్నాం : భట్టి**

కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన ప్రతి ఒక్కరికి సముచిత పదవులు, ప్రాధాన్యం ఇచ్చి గౌరవిస్తుందని ఇందుకు పీసీసీ అధ్యక్షునిగా మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకమే నిదర్శమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు నుంచే హామీలు అమలు ప్రారంభించామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ప్రతి నెలా రూ.400 కోట్లు చెల్లిస్తున్నామన్న భట్టి, ఒకే విడతలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపించామని తెలిపారు.ప్రజల కోసం సంపద సృష్టిస్తున్నామన్న డిప్యూటీ సీఎం, మళ్లీ ప్రజలకు పంచుతున్నామని వివరించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు ఎంతో కీలకమని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్? మున్షీ అన్నారు. త్వరలో జరిగే స్థానికసంస్థల ఎన్నికలు పార్టీకి, నేతలకు సవాలు వంటివని వ్యాఖ్యానించారు. బీజేపీ మతతత్వ రాజకీయాలపై పోరాడాలని అందరం సంకల్పం తీసుకుందామన్న ఆమె, పార్టీ క్రమశిక్షణ విషయంలో తాను కఠినంగానే ఉంటానని స్పష్టం చేశారు.

**కష్టపడ్డవారిని పార్టీ గుర్తుపెట్టుకుంటుంది: ఉత్తమ్**

"సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని మరోసారి రుజువైంది. వెనుకబడిన కులాలకు కాంగ్రెస్ ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. కార్యకర్తల శ్రమ, త్యాగం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కష్టపడి పనిచేసిన వారిని పార్టీ ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుందని మరోసారి రుజువైంది. 2029లో రాహుల్ గాంధీ కచ్చితంగా ప్రధాన మంత్రి అవుతారు" అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

**రాజకీయాల్లో కష్టంతోపాటు కొంచెం అదృష్టం ఉండాలి : మహేశ్ కుమార్‌గౌడ్**

తాను వెలుగులోకి రానప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సభలో మాట్లాడారు. "మనం ఎంత పనిమంతులం అయినా.. చేసేందుకు పని ఇచ్చేవారు కూడా ఉండాలి. నమ్మి పని ఇచ్చేవారు లేకపోతే మన ప్రతిభ బయటకు రాదు. రాజకీయాల్లో కష్టంతోపాటు కొంచెం అదృష్టం ఉండాలి. సీఎం రేవంత్‌రెడ్డి చదువు, వైద్యం, క్రీడల విషయంలో దూరదృష్టితో ఆలోచిస్తున్నారు. వారంలో ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌కు వస్తే మంచిది. గాంధీభవన్ మీద ఆశ, నమ్మకంతో వచ్చిన కార్యకర్తలకు న్యాయం చేయాలి. ఇవాళ చిన్న ప్రాంతీయ పార్టీలకు కూడా జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ కూడా జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకోవాల్సి ఉంది" అని మహేశ్ కుమార్‌గౌడ్ తెలిపారు.

## పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతల స్వీకరణ

గుర్రాలు, బగ్గీ వాహనాలు, ఆదివాసీల నృ త్యాలు, బోనాలు, శివ సత్తుల ప్రదర్శ నలతో జరిగింది. ఆ తర్వాత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ దమ్ము, ధైర్యంతో కూడిన పోరాటం వల్లే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని నూతన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. రానున్న రోజుల్లోనూ మరింత దమ్ము, ధైర్యం చూపించాల్సి ఉం దని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా తన ని యామకం కార్యకర్తలకు గుర్తుండిపోతుం దని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం చేయ టంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందనినిరూపితమైందని వెల్లడించారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారు. కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్య స్వేచ్ఛ ఎక్కువ. నేతలు బహిరంగంగానే విమర్శలు చేసుకుంటారు. కానీ సమయం వచ్చినప్పుడు పార్టీ కోసం, కార్యకర్తల కోసం ఏకమవుతారు. అందరం ఏకతాటిమీదకు రావటం చూసినందునే ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారన్నారుగాంధీభవన్‌తో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందని, కాంగ్రెస్‌లో 1985లో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా తన ప్రస్థానం ప్రారంభమైందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కౌశిక్‌రెడ్డి వాడిన భాష వల్లే అరెకపూడి గాంధీ అనుచరులు నొచ్చుకున్నారని, బూతులు తిట్టుకోవటం తెలంగాణ రాజకీయాల్లో గతంలో లేదని ఆయన పేర్కొన్నారు. 2014లో కేసీఆర్ సీఎం అయ్యాకే, తెలంగాణ రాజకీయాల్లో భాష మారిపోయిందని, కేసీఆర్‌కు దీటుగా సమాధానం చెప్పేందుకే రేవంత్‌రెడ్డి కూడా కాస్త గట్టిగా మాట్లాడారని గుర్తుచేశారు. పార్టీని నమ్ముకుంటే ఎప్పటికైనా న్యాయం జరుగుతుందని తనకు పీసీసీ పదవితో నిరూపితమైందని వెల్లడించారు.

## భట్టికి అపూర్వ ఆహ్వానం

**ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరుకావాలని పిలుపు**

సమావేశాలు జరగనున్నాయి. నోబెల్ గ్రహీతలు, ప్రపంచ శాంతి న్యాయవాదుల సామూహిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆహ్వానంలో పేర్కొన్నారు. ఒత్తిడితో కూడిన ప్రపంచ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ, వ్యూహాలను ఈ శిఖరాగ్ర సమావేశంలో రూపొందిస్తామని ఆహ్వాన పత్రికలో నిర్వాహకులు తెలిపారు.

## వందే భారత్ రైళ్లను మళ్లీ ప్రారంభించిన మోదీ

ఝార్ఖండ్‌లోని టాటానగర్‌లో 20,000 మంది ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ లబ్ధిదారులకు రూ.660 కోట్లను మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించారు.తాజాగా కొత్త రైళ్లు అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు డియోఘర్ (ఝార్ఖండ్)లోని బైద్యనాథ్ ధామ్, వారణాసి(ఉత్తరప్రదేశ్)లోని కాశీ విశ్వనాథ ఆలయం, కాళీఘాట్, కోల్‌కతా(పశ్చిమ బెంగాల్)లోని బేలూర్ మఠం పుణ్యక్షేత్రాలకు సులువుగా ప్రయాణించవచ్చని రైల్వేశాఖ మంత్రి తెలిపారు. అంతేకాకుండా ధన్‌బాద్‌లోని బొగ్గు, గనుల పరిశ్రమలు, కోల్‌కతాలోని జూట్ పరిశ్రమలు, దుర్గాపూర్‌లో ఇనుము, ఉక్కు అనుబంధ రంగాలకు ఇవి ప్రోత్సాహకరంగా ఉంటాయన్నారు.ఈ రైళ్లను ప్రారంభించడానికి మోదీ ఝార్ఖండ్‌కు వెళ్లాల్సి ఉంది. కానీ, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రయాణాన్ని రద్దు చేసుకోవడంతో.. ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారుతెలుగు రాష్ట్రాల ప్రజలకు కొత్తగా రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. వీటిని ఈనెల 16న అహ్మదాబాద్ నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రెండు రైళ్లలో ఒకటి తెలంగాణలోని హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు, మరొకటి ఏపీలోని విశాఖపట్నం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ మధ్య రాకపోకలు సాగించనున్నాయి.

# హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందుకు విపక్షాల కుట్రలు

వాటిని ఆ పార్టీయే పరిష్కరించుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీపై నెపం వేయడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని శ్రీధర్ బాబు తెలిపారు.ఎవరు తెలివిగలవారో ప్రజలే చెబుతారనీ, రాష్ట్రం ఏర్పడ్డాక ఇక్కడి ప్రజలందరూ తెలంగాణ వాసులేనని, వారందరినీ గౌరవిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచేందుకు అందరూ పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరు ఏం చేసినా నగర ఇమేజ్‌ను కాపాడుతామని స్పష్టం చేశారు.హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెద్ద ఎత్తున అంతర్జాతీయస్థాయిలో ముందుకు తీసుకువెళ్లాలనే కార్యచరణను తీసుకున్నాం. హైదరాబాద్ రాష్ట్రానికి, ప్రజానికానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అందరూ భాగస్వాములు కావాలని కోరుతున్నాను. బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నం ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. ఎవరు తెలివితేటలు చూపెడుతున్నారో ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్?లో ఉన్న అంతర్గత విభేధాలకు సంబంధించి మీరు పరిష్కారం చేసుకోవాలి. అది మా పార్టీపై రుద్దకూడదు"అని అన్నారు.10 ఏళ్లు అధికారంలో ఉన్నవాళ్లు(బీఆర్ఎస్) 10 నెలల్లోనే అసహనానికి గురై శాంతిభద్రతలకు భంగం కలిగిందని ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లేవిధంగా మాట్లాడితే పొరపాటు అవుతుందని మంత్రి పొన్నం అన్నారు. బీఆర్ఎస్ మాటలు చూస్తుంటే రాష్ట్రం అల్లకల్లోలం కావాలని చూస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. పార్టీ ఫిరాయింపుల అంశం న్యాయస్థానంలో ఉందని, వినాయక నిమజ్జనం అయ్యేంతవరకు రాజకీయ విమర్శలు మానుకోవాలని కోరారు.

## మహిళా న్యాయమూర్తులకు సైతం ఎన్నో ఇబ్బందులు

కేసుల వినడంతో న్యాయం నేరుగా సామా న్యులకి చేరుతుందని ఈ సందర్భంగా ఆమె ప్రశంసించారు. ఇక, జస్టిస్ హిమా కోహ్లీ దిల్లీ హైకోర్టులో తొలి మహిళా న్యాయ మూర్తిగా విధులు నిర్వర్తించగా.. సుప్రీం కోర్టులో తొమ్మిదో మహిళా న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించారు. ఈ నెల 1న ఆమె న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు.

## మద్య నిషేధాన్ని ఎత్తేస్తాం

"జన్ సురాజ్ ప్రభుత్వం ఏర్పడితే అధికారంలోకి వచ్చిన గంటలోపే బిహార్‌లో ఉన్న మద్యపాన నిషేధాన్ని ఎత్తేస్తాం. ఇందు కోసం రెండు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాం" అని తెలిపారు.రాష్ట్రీయ జనతాదళ్ నాయకుడు తేజస్వీ యాదవ్ రాష్ట్రంలో చేపట్టిన యాత్రపై మాట్లాడుతూ కనీసం అతడు ఇప్పటికైనా ఇంటి నుంచి బయటకువచ్చి ప్రజల మధ్యకు వెళ్లడం మంచి పరిణామమే అని అన్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏలో చేరినందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ తనకు చేతులు జోడించి క్షమాపణలు చెప్పారని ఇటీవల తేజస్వీ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. వారిద్దరి వల్ల రాష్ట్రానికి నష్టం తప్ప ప్రయోజనం ఏమీ లేదని వ్యాఖ్యానించారు. బిహార్ ప్రజలు 30ఏళ్లుగా వారిని భరిస్తున్నారన్నారు. ఇకనైనా వారు బిహార్‌ను విడిచి పెట్టాలని తాము కోరుకుంటున్నట్లు ఆయన అన్నారు.ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ బిహార్‌లో 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం ఉన్నప్పటికీ అభివృద్ధి సూచీల్లో వెనకబడి ఉందని తేజస్వీ చేసిన వ్యాఖ్యలను దుయ్యబట్టారు. ఆయన రాజకీయ నాయకుడు కావడానికి ఏకైక కారణం మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు కావడమే అని పేర్కొన్నారు. బిహార్ లో మద్యం వినియోగం, విక్రయాలపై 2016 ఏప్రిల్‌లోనే పూర్తిగా నిషేధం విధించిన విషయం తెలిసిందే. నాటి నుంచి కొన్ని ప్రాంతాల్లో కల్తీ మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో మద్యపాన నిషేధాన్ని ఎత్తేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టలేదు.

## మరోసారి తెరపైకి జమిలి

మూ డోసారి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న మోదీ ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తికాలం పాలన కొనసాగిస్తుందని తెలిపాయి.గత నెలలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై ప్రధాని మోదీ ప్రసంగిస్తూ జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా ఏవో ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయని, వీటి ప్రభావం దేశ పురోగతిపై పడుతుందోని ఆందోళన వ్యక్తం చేశారు. దీని నుంచి బయపడాలంటే ' జమిలి ఎన్నికలే' సరైన మార్గమని నొక్కి చెప్పారు. దీనికోసం అన్ని రాష్ట్రాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాజాగా మోదీ 3.0 ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న తరుణంలో.. జమిలి ఎన్నికల దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల భాజపా మేనిఫెస్టోలో 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' కూడా ఉంది.దీనిపై అధ్యయనం చేసేందుకు ఎన్నికలకు ముందే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్రం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించింది. జమిలి ఎన్నికలకు రెండంచెల విధానాన్ని సూచించింది. తొలుత, లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో పోలింగ్ నిర్వహించాలని పేర్కొంది. ఆ తర్వాత 100 రోజులకు మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలు జరపాలని నివేదికలో తెలిపింది. ఇందుకోసం రాజ్యాంగంలో కనీసం ఐదు ఆర్టికల్స్‌ను సవరించాలని కమిటీ సూచించింది. మూడు స్థాయిల ఎన్నికలకు ఉమ్మడిగా ఓటర్ల జాబితా ఉండాలని తెలిపింది.

## ప్రజలను కలుసుకునేందుకు నన్ను ఏశక్తీ ఆపలేదు

అక్కడి గోపాల్ మైదాన్‌లో భాజపా నిర్వహించిన ర్యాలీలో ప్రసంగించారు. "భారీ వర్షంతో పాటు ఏ అవరోధాలు మీ వద్దకు రాకుండా అడ్డుకోలేవు. మీ ఆప్యాయత నా హృదయాన్ని తాకింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విపక్షాలు కుట్రలు చేసినా.. ప్రజలు మాత్రం భాజపాకే పట్టం కట్టారు" అన్నారు. "ఝార్ఖండ్‌లో జేఎంఎం ప్రభుత్వం వనరులను దోచుకుంటోందన్నారు

# రెండురోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తా

మరొకరు సీఎం అవుతారని, కొత్త సీఎం ఎంపిక కోసం రెండు, మూడ్రోజుల్లో పార్టీ సమావేశం నిర్వహిస్తామని కేజ్రీవాల్ పేర్కొన్నారు. "ఆప్‌లో చీలికలు తెచ్చి దిల్లీలో అధికారంలోకి రావాలని భాజపా కుట్ర పన్నింది. మా పార్టీని ముక్కలు చేసేందుకే నన్ను జైలుకు పంపారు. కానీ ఎన్ని ఎత్తులు వేసినా పార్టీని విచ్ఛిన్నం చేయలేకపోయింది. నన్ను జైల్లో పెట్టి ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా రాజ్యాంగాన్ని రక్షించాలనే ఇన్నాళ్లు రాజీనామా చేయలేదు. జైలు నుంచి ప్రభుత్వాన్ని ఎందుకు నడపకూడదని సుప్రీం కోర్టే ప్రశ్నించింది. ప్రభుత్వాన్ని నడపవచ్చని వెల్లడించింది" అని కేజ్రీవాల్ అన్నారు.ఫిబ్రవరిలో జరగనున్న దిల్లీ ఎన్నికలను నవంబర్‌లో మహారాష్ట్రతో పాటు నిర్వహించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లు అడుగుతానన్నారు. తాను నిర్దోషినని నమ్మితే ప్రజలు ఓట్లు వేయాలని కోరారు. వారే అంతిమ న్యాయ నిర్ణేతలని అన్నారు."వాళ్లు భాజపాయేతర ముఖ్యమంత్రులను గద్దె దింపడానికి కొత్త గేమ్స్ ఆడుతున్నారు. ఇందులో భాగంగానే సిద్ధరామయ్య(కర్ణాటక సీఎం) , విజయన్ (కేరళ), మమతా బెనర్జీ(బెంగాల్) పై కేసులు నమోదు చేశారు. ముఖ్యమంత్రులు అందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. వాళ్లు మీపై కేసులు నమోదు చేస్తే రాజీనామా చేయవద్దు" అని ఆప్ నేత సూచించారు .మద్యం విధానానికి సంబంధించిన సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. దీంతో దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. కుట్రపై సత్యం విజయం సాధించిందని అన్నారు. దేశాన్ని బలహీన పరుస్తున్న, విభజిస్తున్న శక్తులపై తన పోరాటం ఆగదని పేర్కొన్నారు.

**దిల్లీ రాజకీయాల్లో కీలక పరిణామం**

దిల్లీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆప్ అధినేత, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరో రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు.ఎన్నికలు జరిగేంత వరకు వేరొకరు సీఎంగా బాధ్యతలు చేపడతారని, ప్రజా కోర్టులో గెలిచిన తర్వాతే మళ్లీ సీఎం పీఠంపై కూర్చుంటానని ఆయన ప్రతినబూనారు. కేజ్రీవాల్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనక కారణమేంటి? దిల్లీ రాజకీయాలపై దీని ప్రభావం ఉంటుందా? కేజ్రీవాల్ వ్యూహాలు ఫలిస్తాయా?ఇప్పుడు యావత్ భారతదేశం దృష్టి దిల్లీ రాజకీయాలపైనే పడింది. మద్యం విధానం కేసులో అరెస్టయి, బెయిల్‌పై విడుదలైన కేజ్రీవాల్.. బయటకు వచ్చిన రెండు రోజుల్లోనే రాజీనామా చేయబోతున్నట్లు ప్రకటించారు. దీని వెనక పెద్ద వ్యూహమే ఉంది. దిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ, ఇప్పుడు కేజ్రీవాల్ రాజీనామా చేస్తే ఆయన స్థానంలో ఆప్‌కు చెందిన మరొకరు సీఎంగా బాధ్యతలు చేపడుతారు. అయితే ఒక వేళ ముందస్తు ఎన్నికలకు వెళితే నవంబరులో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతోపాటు ఇక్కడా ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. ఆప్ కూడా ఇదే డిమాండ్‌తో ముందుకెళ్లనుంది.పార్టీని, దిల్లీ ప్రభుత్వాన్ని చీల్చాలనే ఉద్దేశంతోనే కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా.. ఆప్ నేతలను వివిధ కేసుల్లో ఇరికించి అక్రమంగా జైల్లో పెట్టిందన్న వాదనను ఆ పార్టీ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆప్ యోచిస్తోంది. తద్వారా ప్రజల సానుభూతిని పొందవచ్చని ఆలోచన. భాజపా వ్యతిరేక ఓట్లను రాబట్టుకోవచ్చన్నది ఆప్ వ్యూహం. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తే.. ఆప్ నేతలను జైల్లో పెట్టిన వ్యవహారం పెద్దగా ప్రభావం చూపదని గ్రహించే.. కేజ్రీవాల్ రాజీనామా చేసి.. ముందస్తు ఎన్నికలను తెరమీదకి తీసుకొస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒక వేళ ఇది ఫలిస్తే.. మరోసారి ఆమ్‌ఆద్మీ పార్టీకి అధికారం చేజిక్కించుకునే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఆమ్‌ఆద్మీ పార్టీలో కేజ్రీవాల్ తర్వాతి స్థానంలో ఉన్న మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా కూడా ఇప్పటికే భీష్మప్రతిజ్ఞ చేశారు. ప్రజా కోర్టులో విజయం సాధించేంత వరకు సెక్రటేరియెట్ మెట్లు ఎక్కబోనని అన్నారు. దీంతో తాత్కాలిక ప్రభుత్వ సారథులుగా కేజ్రీవాల్, సిసోదియా వైదొలగినట్లే.

## అవినీతి ఆరోపణలున్న అధికారులపై చట్టప్రకారం దర్యాప్తు చేయాలి

వారి వివరణ, ఆధారాలను తీసుకొని వాటితో పాటు అభియోగ పత్రం దాఖలు చేయాలని ఆదేశించింది. చెరువుల ఆక్రమణలకు సహకరించారంటూ హైడ్రా కమిషనర్? రంగనాథ్? ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఉద్యోగులపై నమోదైన కేసుల్లో చట్ట ప్రకారం నోటీసులు జారీ చేసి దర్యాప్తు కొనసాగించాలంటూ సైబరాబాద్? పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నిందితులకు నోటీసులు జారీ చేసి వారి వివరణ, ఆధారాలను తీసుకొని వాటితో పాటు అభియోగ పత్రం దాఖలు చేయాలని ఆదేశించింది. రంగనాథ్? ఫిర్యాదు మేరకు సైబరాబాద్? ఆర్థిక నేర విభాగం పోలీసులు ఆగస్టు 30న నమోదు చేసిన క్రిమినల్ కేసును కొట్టి వేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి సర్వే డిపార్టుమెంట్?కు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ కె. శ్రీనివాసులు, మరో ప్రభుత్వ ఉద్యోగి పూల్? సింగ్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.వీటిపై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది టి.శ్రీకాంత్రెడ్డి వాదనలు వినిపిస్తూ పిటిషనర్లు నిబంధనల ప్రకారమే వ్యవహరించా రన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి నిందితులపై నమోదైన అభియోగాలన్నీ 7 ఏళ్లలోపు శిక్ష పడేవనని, చట్ట ప్రకారం నోటీసులు జారీ చేసి దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించారు. నిందితులు దర్యాప్తు అధికారులకు సహకరించాలని, అవసరమైనప్పుడు నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలను సమర్పించి తమపై ఆరోపణలపై వివరణ ఇవ్వవచ్చన్నారు.

## హామీలు నెరవేరలేదు.. అందుకే రాజీనామా చేయలేదు

ఉంటాను. ఎక్కడుంటా.. నీ గుండెల్లో నిద్ర పోతుంటా.. అడుగడుగనా నిలదీస్తాను.. రాష్ట్రంలో 42 లక్షల మందికి రుణమాఫీ జరిగేదాకా నీ గుండెల్లో నిద్ర పోతా.. నిన్ను విడిచి పెట్టలేదు.. నీ వెంట పడుతా అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.ఒక వేలు మమ్మల్ని చూపిస్తే రెండు వేలు మిమ్మల్ని చూపిస్తాయి. రైతుల కళ్లల్లో ఆనందం చూశాడట రేవంత్ రెడ్డి.. కానీ రుణమాఫీ జరగక, రైతుభరోసా అందక రైతులు కళ్లల్లో కన్నీళ్లు వస్తున్నాయి. రైతు భరోసా ఇవ్వకుండా రైతుల ఉసురు పోసుకుంటున్నావు. దొడ్డు వడ్లకు బోనస్ ఇస్తానని చెప్పి ఇప్పుడేమో సన్నాలకే మాత్రమే బోనస్ అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నవ్. బోనస్‌ను బోగస్ చేసి రైతులను మోసం చేసిన సన్నాసి ఎవడు అని అడుగుతున్నా..? అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు.నీ దిగజారుడు మాటలతో నీ గౌరవం పోతే బాధలేదు.. కానీ సీఎం కుర్చీ గౌరవం కాపాడు అని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చురకలంటించారు. నీకు ఐదేండ్లే ఎక్కువ.. రెండోసారి అధికారంలోకి వచ్చే సీన్ లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఉచిత కరెంట్ ఇచ్చిండంట. ఈ రాష్ట్ర ప్రజలకు, రైతులకు తెలియదా.. ఉచిత కరెంట్ కాస్త ఉత్త కరెంట్ అయిందని ఎద్దేవా చేశారు.

## ఉత్తర్‌ప్రదేశ్‌లో విషాదం

మంది మృతి చెందారు. మరికొంతమంది శిథిలాల కింద చిక్కుకుని గాయపడ్డారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకుని ఘటనాస్థలికి చేరుకున్న రెస్క్యూ సిబ్బంది శిథిలాలను తొలగిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారు చనిపోవడం వల్ల ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం, లోహియానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాకీర్ కాలనీలో నఫో అనే వృద్ధురాలికి మూడంతస్తుల ఇల్లు ఉంది. 50 ఏళ్ల క్రితానికి చెందిన ఆ ఇంటికి సరైన రీతిలో మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కారణంగా శనివారం సాయంత్రం 5:15 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఒకే కుటుంబానికి చెందిన 15 మంది శిథిలాల కింద చిక్కుకున్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు ఘటనాస్థలి చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. ముమ్మర చర్యలు చేపట్టాయి. భారీ వర్షం కురుస్తున్న సహాయక చర్యలను నిరాటంకంగా నిర్వహించాయి. మొత్తం శిథిలాల కింద ఉన్న 15 మందిని బయటకు తీసుకొచ్చారు అధికారులు. అందులో 10మంది చనిపోయినట్లు గుర్తించారు.తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డ మిగతా ఐదుగురిని వెంటనే స్థానిక ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. సాజిద్ (40), సాజిద్ కుమార్తె సానియా (15), ఏడాదిన్నర బాలిక సిమ్రా సహా పలువురు మృతి చెందినట్లు గుర్తించారు. ఇంటి కింద భాగంలో ఉన్న పశువులు కూడా చనిపోయినట్లు తెలిపారు. బాధితులు, తమ ఇంట్లో పాల డెయిరీ నిర్వహించేవారని చెప్పారు.

## ఎవరు తెలివితేటలు చూపిస్తున్నారో ప్రత్యక్షంగా కనబడుతోంది!




- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పదింతలు పెంచుతాం
- కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్

**మంథని, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియా (ఎక్స్ వేదికగా) ద్వారా చేసిన వ్యాఖ్యలకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. తన సొంత నియోజకవర్గమైన మంథని పర్యటనలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఎవరు తెలివితేటలు చూపిస్తున్నారో ప్రత్యక్షంగా కనబడుతుంది.. బీఆర్ ఎస్ పార్టీ కి చెందిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తాను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేను అని చెప్పారు.. నేను అదే విషయాన్ని చెప్పాను తప్ప కొత్తగా ఏమి చెప్పలేదు అన్నారు. ఇతరుల విషయాల్లో మీరు తలదూర్చినట్లు మేం తలదూర్చం.. మీ పార్టీ అంతర్గత సమస్యల్ని మీరు పరిష్కరించుకోవాలని.. మా పార్టీపై నెపం వేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వారంతా తెలంగాణ వారే అని వారి ఆత్మ గౌరవాన్ని అందరు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. కొంతమంది ప్రతిపక్ష పార్టీ నాయకులు ఈర్ష్య తోటి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తమ కాంగ్రెస్ ప్రభుత్వంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని పదింతలు చేసి చూపిస్తామన్నారు. ఈ సమావేశంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, కాంగ్రెస్ నాయకులు శశి భూషణ్ కాచే, ఓడ్నాల శ్రీనివాస్, చొప్పరి సదానందం తదితరులు పాల్గొన్నారు.

## నత్తనడకన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

- దరఖాస్తుల పరిశీలనలో మూడు శాఖల అధికారుల సమన్వయం కొరవడి
- కామారెడ్డి మున్సిపాలిటీలో 17,583 దరఖాస్తులకు 5,643 పరిష్కారం
- బాన్సువాడ లో 1872 దరఖాస్తులకు 200 లే పరిశీలన
- ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో 907కు 50 పరిశీలన



**కామారెడ్డిబ్యూరో,సెప్టెంబర్15(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎల్ఆర్ఎస్ ధరఖాస్తుల పరిశీలన ఒక అడుగు ముందుకు,రెండు అడుగులు వెనుకకు అన్నట్లు కొనసాగుతుంది.కామారెడ్డి జల్లాలోనే మూడు మున్సిపాలిటీలైన కామారెడ్డి,బాన్సువాడ,ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ ధరఖాస్తుల పరిశీలన మూడుశాఖల అధికారుల సమన్వయంతో చేపట్టాల్సి ఉండగా నత్తనడకన కొనసాగుతుంది.కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో 17,583 ధరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 5,643 మాత్రమే పరిశీలించారు. బాన్సువాడ మున్సిపాలిటిలో 1872 ధరఖాస్తులు రాగా కేవలం 200 మాత్రమే పరిశీలించారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో 907 ధరఖాస్తులు రాగా కేవలం 50 మాత్రమే పరిశీలించారు.ప్రభుత్వం నిర్దారించిన సమయంలో పూర్తి అయ్యే అవకాశలు లేవు. ప్రభుత్వం చేపట్టిన ఎల్ఆర్ఎస్ పథకం,రెవెన్యూ,నీటిపారుదల శాఖ,పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉంది.స్థిరాస్తీ పట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యూరైలైజేషన్)స్కీంమ్‌కు ఆమోదం తెలిపింది.ఎల్ఆర్ఎస్ ధరఖాస్తుల స్థలాలను పరిశీలించేందుకు మూడు శాఖలు(రెవెన్యూ,నీటిపారుదల,పట్టణ ప్రణాళిక ) విభాగం అధికారులకు ప్రభుత్వం భాగస్వామ్యం కల్పించింది.మూడు శాఖల యంత్రాంగం ప్రలోబాలకు లోను కాకుండా పనిచేస్తే అన్యాక్రాంత్యం అయిన ప్రజాపయోగ స్థలాలు,ప్రభుత్వ,శిఖం,వక్కు భూముల వివరాలు బహిర్గతం కానున్నాయి.

### పరిశీలన ఇలా చేయాలి

ఎల్ఆర్ఎస్ ధరఖాస్తులను మూడు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.తొలుత ఎల్ 1 స్థాయిలో రెవెన్యూ పరిశీలకులు,నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్,పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కూడిన కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్దేశిత యాప్ (ఎల్ఆర్ఎం 24) లో నమోదు చేయాల్సి ఉంటుంది.ఈ సందర్భంగా రెవెన్యూ, నీటిపారుదల, పురపాలకశాఖ రికార్డుల ఆధారంగా ప్రభుత్వ శిఖం, అసైన్డ్, వక్ఫ్ భూములను గుర్తించి ఆయా ధరఖాస్తులను తిరస్కరించడంతో పాటు వాటి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాలి. 2వ దశ,(ఎల్ఆర్ఎస్ 2)లో పట్టణ ప్రణాళిక విభాగం ముఖ్య అధికారి నిర్దేశించిన రుసుము విధిస్తూ అర్జిలకు ఆమోదం తెలుపాలి.మూడవ దశ(ఎల్ఆర్ఎస్ 3)లో పురపాలక మున్సిపల్ కమిషనర్ ఆమోదం తెలుపుతూ క్రమబద్ధీకరించినట్లు ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది.వెంచర్లు,పెద్ద లే అవుట్ల క్రమబద్ధీకరణ రికార్డులను ఎల్ 4 ధశలో భాగంగా కలెక్టర్ పరిశీలనతో పంపాల్సి ఉంటుంది.

### పరిశీలన ఇలా కొనసాగుతున్నది!

ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ 24 పేరిట తెచ్చిన యాప్ ప్రారంభానికి ముందే కామారెడ్డి మున్సిపల్‌లో 5 వేలకు పైగా ఎల్ఆర్ఎస్ ధరఖాస్తులకు సంబంధించిన ప్లాట్ల పరిశీలన పూర్తి అయింది.ఆ సమయంలో కేవలం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మాత్రమే ఎల్ వన్ స్థాయిలో పరిశీలన చేసి ఎల్ టు అధికారికి నివేదించారు.ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఆయా ధరఖాస్తులను సైతం యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది.దీంతో స్థిరాస్తి వ్యాపారులు ఇతరత్రా నేతలు తిరిగి మరోసారి పరిశీలన లేకుండానే యాప్‌లో నమోదు చేసేలా అధికార యంత్రాంగం ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తుంది.దీంతో పాటు రెవెన్యూ,నీటిపారుదల శాఖలకు చెందిన అధికారులు పురతన రికార్డులను పరిశీలించకుండానే ధరఖాస్తులను ఆమోదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శాకాలకు అనుగుణంగానే ఎల్ఆర్ఎస్ ధరఖాస్తులను పరిశీలన చేస్తున్నాం.నిర్దేశిత యాప్‌లో అవసరమైన రికార్డులను అప్‌లోడ్ చేయడంతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన చిత్రలను నమోదు చేయాల్సి ఉంటుందని కామారెడ్డి టౌన్‌ప్లానింగ్ అధికారి గిరిధర్ అన్నారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ,మున్సిపల్‌లో ఎల్ఆర్ఎస్ ధరఖాస్తుల పరిశీలనను ప్రారంభించమని కమిషనర్లు తెలిపారు.మూడు శాఖలకు చెందిన అధికారులు ధరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ ప్రజోపయోగ,నీటిపారుదల శాఖలకు చెందినవి ఉంటే వాటిని తిరస్కరిస్తామన్నారు.

### కామారెడ్డి, బాన్సువాడలో అన్యాక్రాంతం

బాన్సువాడ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్‌గా మారిన సమయంలో 10 శాతం స్థలాలకు సంబంధించి రికార్డులను మాయం చేసినట్లు విమర్శలు ఉన్నాయి.గత అసెంబ్లీ ఎన్నికల ముందు బాన్సువాడలో వక్ భూములతో పాటు నీటిపారుదల శాఖకు చెందిన శిఖం భూములు అన్యాక్రాతంపై స్థానికుల పిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు.కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ,అసెన్డ్ భూములను బై నెంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.ఈ భూములపై కూడా విజిలెన్స్ అధికారులకు పలువురు పిర్యాదు చేశారు.

## తలసేమియా చిన్నారికి రక్తదాత రవి అండ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా బెజ్జోరా కు చెందిన భార్గవ్ తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారికి అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు ను సంప్రదించడంతో తెలంగాణ యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న ఐవి ఎఫ్ సేవాదళ్ నిజామాబాద్ జిల్లా ఇన్ ఛార్జ్ సాయి కృష్ణ కు తెలియజేయడంతో వెంటనే స్పందించి యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్న రవి సహకారంతో రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో అందజేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ బాలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒకసారి చొప్పున జీవితాంతం రక్తం అవసరం ఉంటుందని అలాంటి చిన్నారులు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 200 లకు పైగా, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10 వేలకు పైగా ఉన్నారని వారికి రక్తాన్ని అందజేయాల్సిన బాధ్యత త సమాజంలోని ప్రతి ఒక్కరి పైన ఉన్నది అన్నారు.తలసేమియా చిన్నారికి రక్తం అవసరం ఉందని తెలియజేయగానే వెంటనే స్పందించిన సాయి కృష్ణ రక్తదాత రవికి ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా,రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ రాజన్న తరఫున అభినందనలు తెలియజేశారు,వీరిని స్ఫూర్తిగా తీసుకొని రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రక్తదానం చేయాలనుకున్న వారు వారి వివరాలను 9492874006 నెంబర్ కు తెలియజేయాలని అన్నారు.



## హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ ప్రొటెక్షన్ కమిటీ కార్యాలయం ప్రారంభం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ ప్రొటెక్షన్ కమిటీ కామారెడ్డి జిల్లా కార్యాలయం ఆదివారం ప్రారంభించారు. రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ఉమెన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ ప్రొటెక్షన్ కమిటీ తెలంగాణ అనుబంధ కార్యాలయంను,కామారెడ్డి జిల్లా కేంద్రంలో సాందీపని జూనియర్ కళాశాల శ్రీకృష్ణ ధ్యాన మందిర్ అశోక్ నగర్ లో హ్యూమన్ రైట్స్ కామారెడ్డి జిల్లా మహిళా కోఆర్డినేటర్ దొమ్మాటి లలిత తల్లిదండ్రులు యాదమ్మ-నర్సయ్యచేతుల మీదుగా జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా దొమ్మాటి లలిత మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న సామాన్యులపై అక్రమాలు, మహిళలు వృద్ధులు చిన్నారులు, అభాగ్యులపై అన్యాయలను ఎదిరించడానికి రైట్ ఇన్ఫర్మేషన్ ఉమెన్ రైట్స్ సెల్ఫ్ అసోసియేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉమెన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ ఖలీల్ హుల్ల, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ముధాంశంకర్ ,జిల్లా జనరల్ సెక్రెటరీ సుభాష్,తెలంగాణ మాదిగ హక్కుల పోరాట సమితి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బలరాం. బంజారా సంగము జిల్లా అధ్యక్షులు రూప్ సింగ్, బట్టు శ్రీనివాస్ , నందకుమార్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పూర్తి సమాచారం కొరకు 7671984970 ను సంప్రదించాలని దొమ్మాటి లలిత జిల్లా ప్రజలను కోరారు.



## అలసత్వమా!.. నిర్లక్ష్యమా!

- రోడ్డు నిర్మాణ సంస్థపై ప్రజలు గుర్రు
- రోడ్డు నిర్మాణ పనుల్లో అలసత్వం
- వందల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు
- గాల్లో కలుస్తున్న అమాయకుల ప్రాణాలు
- పట్టించుకునే వారే లేరా అంటూ వాహనదారుల అసహనం



**శంకరపట్నం సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** కరీంనగర్ నుంచీ వరంగల్ వరకు చేపట్టిన నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఇటీవల రోడ్డు విస్తరణ పనులు ఊపందుకున్నాయి. దాదాపు 80 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే సదరు రహదారి నిర్మాణ సంస్థ విస్తరణ పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తుందని ప్రజలు వాపోతున్నారు. దాదాపు 40 కిలోమీటర్ల మీద పాత రోడ్డు పక్కనుండే ఈ నాలుగులో లైన్ల రహదారి వెళుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అనేకచోట్ల రోడ్డు పక్కనే గోతులు తీయడం కందకాలు తీసి పూడ్చడం లేదని వాహనదారులు వాపోతున్నారు. పాత రోడ్డును తీసేసి కొత్త రోడ్డు వేస్తున్న తరుణంలో పాత రోడ్డు పై భాగం తీసేయడంతో ఆ ప్రాంతంలో మట్టి ఏర్పడి దాని గుండా వెళ్తున్న వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, వందల సంఖ్యలో లారీలు, వేల సంఖ్యలో ఇతర వాహనాలు ఈ దారి గుండానే నిత్యం ప్రయాణం సాగిస్తుంటాయి. మట్టి రోడ్డు ఉన్న ప్రాంతంలో దుమ్ము ధూళి వాహనదారుల కళ్ళలో పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొంటున్నారు. సదరు కంపెనీ ఆ మట్టి ఏర్పడిన ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొట్టించే ప్రయత్నం కూడ చేయడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో మూలమలుపుల వద్ద కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండానే పనులు చేపట్టడంతో ఈ దారిలో కొత్తగా ప్రయాణిస్తున్న వాహనదారులకు ఎటు వెళ్లాలో అర్థం కాక తప్పుడు మార్గంలో ప్రయాణం చేస్తుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. దీనిపై అధికారులు దృష్టి కేంద్రీకరించకపోవడం శోషనీయాంశమని పలువురు సామాజికవెత్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణ సంస్థ కేంద్ర మంత్రి అనుచరుడి అయినందున ఇలా ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ జిల్లా అధికారులు కానీ, ఆపై అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం గానీ కేంద్ర ప్రభుత్వం గానీ నయా పైసా వెచ్చించకుండానే సదరు కంపెనీకి కేవలం భూసేకరణ జరిపి పూర్తి బాధ్యతలు అప్పజెప్పి వందల కోట్ల ఖర్చుని తగ్గించుకోవడంతో, ఈ కంపెనీ టోల్ గేట్ల ద్వారా వారు పెట్టిన వందల కోట్ల రూపాయలకు పదింతలు ఎక్కువ వచ్చేంతవరకు చాల సంవత్సరాల వరకు టోల్ ప్లాజాలా రూపంలో ప్రజల పైనే ఈ రుణభారం మోపనున్నదని విశ్లేషకుల వాదనలు కూడా ఉన్నాయి. ఇలా సదరు రోడ్డు నిర్మాణ కంపెనీకి ప్రభుత్వాలు పూర్తి హక్కులు కల్పించడంతో ఈ నిర్మాణ సంస్థ ఇష్టానురాజ్యంగా వ్యవహరిస్తోంది అన్న అనుమానాలు లేకపోలేదు. ఏదేమైనాప్పటికీ గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న ఈ విస్తరణ పనుల్లో జాప్యం వల్లనో, ఈ కంపెనీ వాహనాల అతివేగం వల్లనో, ఇతర కారణాల వల్లనో రోడ్డు ప్రమాదాలు పెరిగి అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయా. ఈ రోడ్డు ప్రమాదాల వల్ల వందల మందికి గాయాలైన సందర్భాలు కూడా ఉన్నట్లు పోలిసు శాఖ వారు అనేక సందర్బాల్లో పేర్కొన్నారు. ఈ బడా నిర్మాణ సంస్థకు భయపడి ఎవరు నోరు మెదపడం లేదన్న అపోహలు కూడా ఉన్నాయి. కనీసం మీడియా సంస్థలు కూడా వేలెత్తి చూపే ప్రయత్నం చేయటం లేదని, మరి దీనికి పరిష్కార మార్గమే లేదా అని స్థానికులు వాపోతున్నారు. ఇలాగే ఉంటే రోడ్డు నిర్మాణం పూర్తయ్యే సరికి ఇంకా అనేక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని అధికారుల ద్వారా రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతను, అలసత్వం, బాధ్యతారాహిత్యం వహిస్తున్న కంపెనీ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఎర్రజెండాలు ఏకం కావాలి

- యంసిపిఐ (యు) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి



**పాలకుర్తి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఎర్రజెండాలన్నీ ఐక్యం కావాలని ఎం సి పి ఐ (యు) కేంద్ర కమిటీ సభ్యులు గోనే కుమారస్వామి పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో గల తెలంగాణ రైతు సంఘం పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎంసిపిఐ యు పాలకుర్తి నియోజకవర్గ కార్యదర్శి గుగులోతు అరుణ్ నాయక్ తో కలిసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాదానికి ఎర్రజెండాల ఐక్యతే ఏకైక మార్గమన్నారు. భూమికోసం గుత్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం విష్ణ ఆగడాలను బెదిరిస్తూ నిజాం నవాబులకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పై భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థ ఎంత నిర్బంధం సాగించారో వీరికి అండ దండలు గా ఉన్న రజాకార్లు, పటేల్ యూనియన్ సైన్యం తో తెలంగాణ సాయుధ పోరాటం పై విచక్షణ రహితంగా సాగించిన నరమేధం లో 4000 మంది తెలంగాణ బిడ్డలు వీరమరణం చెందారని, మూడు వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలను ఏర్పాటు చేసి, పది లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర సాయుధ తెలంగాణ పోరాట చరిత్ర ది అని అన్నారు. పోరాటం లో బీంరెడ్డి నరసింహారెడ్డి, దేవుల పల్లి వెంకటేశ్వరరావు, రావి నారాయణరెడ్డి, మద్దికాయల ఓంకార్, నల్ల నరసింహులు,దర్మ బిక్షం, ముగ్దుం మైనోద్దీన్, మద్దికాయల లక్ష్మీక్క , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, రామచంద్ర రెడ్డి లాంటి యోధులు ఎందరో కలిసి సాగించిన పోరాట స్ఫూర్తితో చీలిన ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీ లు అన్ని కూడా వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఏకం కావడమే మనువాదానికి నిజమైన ప్రత్యామ్నాయం అని అన్నారు.కమ్యూనిస్టు పార్టీ లు చీలిక వలన తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధం లేని బిజెపి మహత్తర తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లీం కొట్లాట గా చిత్రీకరణ చేస్తున్న తీరు కమ్యూనిస్టు ఉద్యమం చీలిక యే కారణం అని వీళ్ళకి సరైన బుద్ధి చెప్పాలంటే ఎర్రజెండా లు అన్ని సాయుధ పోరాట వార్షికోత్సవ స్ఫూర్తితో ఏకం కావాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డివిజన్ కార్యదర్శి మంద రవి , కనకం సంధ్య, బత్తిని కుమారస్వామి, ఉడుత గణేష్, ఉడుత బిక్షపతి, నల్లమల్ల కిరణ్, బత్తిని ప్రశాంత్, అశోక్, రాజు, ఎండి ఖాజర్ బాషా, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

# చదవును మించిన ఆస్తి లేదు..!

- సగర (ఉప్పర) సేవా సమితి సేవకార్యక్రమాలు అభినందనీయం
- మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

సగర ఉప్పర సేవా సమితి సేవా కార్యక్రమాలు అభినందనీయమని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు . ఆదివారం మహబూబ్ నగర్ లోని ఎనుగొండ కమ్యూనిటీ హాల్‌లో సగర (ఉప్పర) సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ లోకంలో చదువును మించిన ఆస్థి లేదనీ, ఇది దొంగలు దోచుకునే సత్తు కాదన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఆమె కోరారు. ఇలాంటి ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనీ, స్వతహాగా తమ కాళ్ల మీద తాము నిలబడేలా విద్యార్థులు చదవాలి, ఎదగాలి, తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించాలనీ ఆమె సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలు విద్యార్థులు , ప్రజలకు అందేలా తమ వంతు కృషి చేస్తానన్నారు. కులసంఘాలు అంటే రాజకీయాలు చేసే ఈరోజుల్లో ఇలాంటి సగర (ఉప్పర) సేవా సమితి ఇలాంటి సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నన్ను ఓడించాలని ఇక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేసి, కోట్లు ఖర్చు పెట్టారని, కానీ పాలమూరు పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రజలు నన్ను గెలిపించుకున్నారని, వారి రుణాన్ని ఈ జన్మలో తీర్చుకోలేను నేను అన్నారు. పాలమూరు ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని బొమ్మ చేయకుండా నిలబెట్టుకుంటానని , పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని డీకే అరుణ అన్నారు. సగర సంఘం సేవ కార్యక్రమాల్లో తమ వంతు సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

### ప్రతిభ పురస్కారాలు అందుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

ఈ ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదివిన వారికి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్, జిల్లా అధ్యక్షులు ప్రనీల్ చంద్, సగర సంఘం నాయకులు సత్యం, పర్వతాలు, నారాయణ, గోపాల్, సవారి సత్యం, బీసీ సమాజ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డిలు సగర (ఉప్పర) సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు.



## నూతన పిసిసి అధ్యక్షుడికి నార్సింగి నుంచి భారీ ర్యాలీ

**రాజేంద్రనగర్, సెప్టెంబర్15 (జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్ర పీసీసీ నూతన అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. నార్సింగ్‌లోని ఆయన ఇంటి నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతల నడుము కొనసాగింది. ఆదివారం ఉదయం గండిపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన ఇంటి నుంచి డప్పు వాయిద్యాల మధ్య ఆయనకు పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. నార్సింగి చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహం, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి కార్యకర్తలు అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరి గాంధీ భవన్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ సీనియర్ నేత తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం సంతోషధాయ కమని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా గుర్తింపు ఇస్తుందని దీనికి నిదర్శనమే పిసిసి అధ్యక్షుడిగా మహేష్ గౌడ్ ఎన్నిక కావడమే అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్ ఎం. నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ గోపాల విజయబాబు, రాజేంద్రనగర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కస్తూరి నరేందర్ ముదిరాజ్, కౌన్సిలర్ దుర్గేష్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు వినోద్ కుమార్, మాజీ ఎంపిటిసి రాము, నాయకులు, కొల్లూరు కిరణ్, దీపక్, దొడ్డు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్**

**జోగిపేట, సెప్టెంబర్15(జనం సాక్షి):**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రారంభించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అందోల్ జోగిపేట మున్సిపల్ పట్టణంలో పాటు నియోజకవర్గంలో వేగవంతం చేసి సభ్యత్వ నమోదును పూర్తిచేయాలని జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకులు బీబీ పాటిల్ అన్నారు. ఆదివారం జోగిపేట మున్సిపల్ పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బీబీ పాటిల్ సభ్యత్వ నమోదును ప్రారంభించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ పార్టీని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. సభ్యత్వ నమోదులో ప్రతి పార్టీ నాయకులు ఉత్సాహంగా పాల్గొని టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. ప్రభాకర్ గౌడ్, నియోజకవర్గ ఇన్ చార్జి చేర్యాల రాములు, వెంకట నరసింహారెడ్డి, పల్వట్ల జగదీశ్వర్, మాజీ కౌన్సిలర్లు పులుగు గోపాల్ రావు, గాజుల నవీన్, పార్టీ నాయకులు ఉలువల వెంకటేశం, గడిల్లా రవీందర్ గౌడ్, గాజుల అనిల్, ప్రభాత్ కుమార్, శివశంకర్, నవాబు గారి భూమయ్య, కురుమ నవీన్, జగన్ గౌడ్, నరసింహారెడ్డి, కడల రాములు తదితరులు పాల్గొన్నారు.

## టోయమ్' సొంతమైన లెజెండ్స్ లీగ్ క్రికెట్ హైదరాబాద్

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :**

సురేష్ రైనా నేతృత్వంలోని లెజెండ్స్ లీగ్ క్రికెట్ హైదరా బాద్ ఫ్రాంచైజీని టోయమ్ స్పోర్ట్స్ లిమిటెడ్ కొను గోలు చేసింది. ఈ ఫ్రాంచైజీని గతంలో అర్బన్‌రై జర్స్ హైదరాబాద్ అని పిలిచేవారు. గతంలో అర్బన్‌రైజ్ గ్రూప్ యాజమాన్యంలోని ఫ్రాంచైజీని ఇప్పుడు టోయమ్ హైదరాబాద్ అని పిలుస్తారు. సెప్టెంబరు 20న ప్రారంభమయ్యే లెజెండ్స్ లీగ్ క్రికెట్ రాబోయే సీజన్‌లో ఈ ఫ్రాంచైజీ కనిపిస్తుంది. టోయమ్ స్పోర్ట్స్ లిమిటెడ్ అనేది వివిధ క్రీడల ఉత్పత్తి, ప్రచారం, నిర్వహణలో నిమగ్నమై ఉన్న పబ్లిక్ లిస్టెడ్ కంపెనీ. ఈ సందర్భంగా టోయమ్ స్పోర్ట్స్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ మొహమ్మదలీ ఆర్ బుద్వానీ మాట్లాడుతూ రాబోయే లెజెండ్స్ లీగ్ క్రికెట్ సీజన్‌లో భాగమైనందుకు సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ గొప్ప క్రికెట్ వారసత్వా న్ని స్వీకరించడం ముఖ్యమైన ఘట్టాన్ని సూచిస్తుం దన్నారు. రాష్ట్రం, దేశంలోని భవిష్యత్ తరాల క్రీడాభిమానులకు స్ఫూర్తినిస్తూ ఫ్రాంచైజీ వారస త్వాన్ని గౌరవించడం మా లక్ష్యమన్నారు. ఇటీవలి సంవత్సరాలలో టోయ మ్ స్పోర్ట్స్ లిమిటెడ్ 'కుమైట్ 1 లీగ్' మైక్ టైసన్ బ్రాండ్ అంబాసి డర్‌గా అంతర్జాతీయ ఎంఎంఏ ఫైట్ నైట్, 'కుమైట్ 1 వారియర్ హంట్' భారత దేశం మొట్ట మొదటి స్పోర్ట్స్ రియాలిటీ వెబ్ సిరీస్‌తో పాటు అనేక టీ10 ప్రధాన ఈవెంట్‌లను నిర్వహిం చిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌లు, టీఎస్ఎల్ ప్రపంచ టెన్నిస్ లీగ్‌లో ఒక జట్టును కలిగి ఉందన్నారు. ఇతర కార్యక్ర మాలతో పాటు భారతదేశం వర్సెస్ బంగ్లాదేశ్ ఓడీఐ సిరీస్‌కు టైటిల్ స్పాన్సర్ చేసిందన్నారు. ఈ సందర్భంగా లెజెండ్స్ లీగ్ క్రికెట్ సహ వ్యవస్థాపకుడు రామన్ రహేజా మాట్లాడుతూ ఈ సీజన్‌లో తీసుకోబడిన రెండో ఫ్రాంచైజీ అన్నారు. పరిశ్రమలోని విభిన్న టైటాన్స్ క్రీడా రంగంలోకి ప్రవేశించడం ప్రోత్సాహకరంగా ఉందన్నారు. లెజెండ్స్ లీగ్ క్రికెట్‌లోని మా ఫ్రాంచైజీలలో ఒకటి ఐపీఎల్‌లో జరిగిన ఇతర సారూప్యమైన కానీ పెద్ద డీల్‌ల మాది రిగానే సమానమైన విలువను పొందగలిగినందుకు సంతోషిస్తు న్నామన్నారు. 2018 ఐపీఎల్‌లో ఇదే విధమైన ఒప్పందంలో జేఎస్డబ్ల్యు స్పోర్ట్స్ ఢిల్లీ డేర్‌డెవిల్స్‌లో 50 శాతం వాటాను కొనుగోలు చేసిందన్నారు.

## వక్ఫ్ సవరణలపై తప్పుడు ప్రచారలొద్దు

- ఎంపి డికే అరుణ
- నిరుపేద ముస్లింలకు న్యాయం చేసేందుకే వక్ఫ్ బోర్డులో సవరణలు
- త్వరలో తెలంగాణాకు జేపిసి రాక

**ఎల్ బి నగర్ ఆగష్టు 15 (జనం సాక్షి)**

వక్ఫ్ బోర్డు భూ భాధితులు, అన్నివర్గాల అభిప్రాయాలూ తెలుసుకునేందుకే జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటయిందని ఎంపి డీకే అరుణ పేరుకొన్నారు. దేశంలోని అన్ని వర్గాల జేపిసి అన్ని వర్గాల వాదనలు వింటోంది. ఇక్కడి నుంచి కూడా మీ అభిప్రాయాలి జేపిసికి తెలపవచ్చు అన్నారు. అలాంటి వారికోసం జేపిసి కోసం ప్రతగ్యేకంగా ఈమెయిల్ క్రియేట్ చేసింది. ఈ నెలాఖరున తెలంగాణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ మీరు పంపే రిప్రెసెంటేషన్ లోని సమస్య తీవ్రతను బట్టి జేపిసి మీ అభిప్రాయాలూ తెలుసుకుంటుంది. వక్ఫ్ బోర్డు సవరణలపై కొందరు ముస్లింల భూములు లాక్కుంటారు, కబ్రస్థాన్ లు లాక్కుంటారు అని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు ఇలాంటి ప్రచారం లో ఇలాంటి వాస్తవం లేదు వక్ఫ్ బోర్డు ఏర్పాటు ఉద్దేశం క్షేత్ర స్థాయిలో నేరవేరడం లేదు బిజెపిని మతతత్వ పార్టీ గా ముద్ర వేసి కొందరు లబ్ది పొందాలని చూస్తున్నారు వక్ఫ్ భూ బాధితుల్లో ముస్లింలు, హిందువులు, అన్ని వర్గాల ప్రజలు ఉన్నారు. ఇప్పుడున్న వక్ఫ్ చట్టం ద్వారా ఏ ఒక్క నిరుపేద ముస్లింలకు లాభం జరగడం లేదు అని డీకే అరుణ పేరుకొన్నారు.



## నేషనల్ ,రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయం

**మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్**

**తాండూరు సెప్టెంబర్ 15(జనంసాక్షి)**

నేషనల్, రాష్ట్రస్థాయి త్వైకాండో పోటీలో పట్టణానికి చెందిన ఇద్దరు చిన్నారులు గోల్డ్ మెడల్ సాదించడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ పేర్కొన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలో ని మున్సిపల్ చైర్ పర్సన్ నివాసంలో నేషనల్ తోపాటు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరచి గోల్డ్ మెడల్ సాధించిన ఇద్దరు చిన్నారులకు గోల్డ్ మెడల్‌తో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ గుప్త మాట్లాడుతూ చదువుతోపాటు త్వైకాండో క్రీడలలో రాణించడం శుభసూచిక మన్నారు. నేటి సమాజంలో మహిళలకు త్వైకాండో క్రీడలు రక్షణగా ఉపయోగపడు తాయన్నారు. మహిళలు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అదేవిధంగా త్వైకాండో మాస్టర్ రవిని అబినందించారు.

## ఖైరతాబాద్ బడా గణేష్‌ను దర్శించుకున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :**



మహాగణపతిని ఆదివారం ఉదయం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ శ్రీ సప్తముఖి మహాశక్తి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ.. దేవాది దేవతల్లో అగ్ర గనుడైన గణేశుని పూజించ డం మన సనాతన ధర్మం అని అన్నారు. అగ్ర గనుడైన గణేశుని పూజించడంతో అనేక విఘ్నాలు తొలుగుతాయని తెలిపారు. దేశంలోని ఎంతో పేరుగాంచిన ఖైరతాబాద్ గణనాథుడు దర్శనానికి తాను ఎక్కడున్నా ఇచ్చేస్తానని చెప్పారు. ప్రతి ఏట గణేష్ ఉత్సవాలని ఎంతో భక్తిశ్రద్ధలతో కమిటీ వాళ్లు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దత్తాత్రేయకు శాల్వా కప్పి సన్మానించారు.

# నిజాం ప్రభుత్వాన్ని తరిమింది కమ్యూనిస్టులు

- కమ్యూనిస్టుల పోరాట ఫలితం తెలంగాణ
- సిద్దిపేట సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్




**హుస్నాబాద్ (జనంసాక్షి):**

భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అని,ఆ పోరాటాన్ని హిందూ ముస్లింల మధ్య జరిగిన గొడవగా బిజెపి పార్టీ వక్రీకరిస్తుందని, 4500 మంది కమ్యూనిస్ట్ అమరుల రక్తతర్పణంతో నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కలిగిందని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. ఆదివారం రోజున తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాలలో భాగంగా హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అనబేరి ప్రభాకర్ రావు విగ్రహం వద్ద పూలమాల వేసి సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి నివాళులు అర్పించారు. అనంతరం అనబేరి ప్రభాకర్ రావు విగ్రహం నుండి హుస్నాబాద్ ప్రధాన రహదారి నుండి మందాపూర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి మందాపూర్ అమరవీరుల స్థూపానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు పోనగంటి కేదారి, సీపీఐ కార్యవర్గ సభ్యులు జాగిరి సత్యనారాయణ, కొయ్యడ సృజన్ కుమార్, యెడల వనేష్,దయానంద రెడ్డి, అందే అశోక్, బత్తుల బాబు, సీపీఐ జిల్లా నాయకులు కొమ్ముల భాస్కర్, ముంజ గోపి,కొయ్యడ కొమురయ్య, సుదర్శన చారి,బోనగిరి రూపేష్, బోనగిరి మహేందర్, మంద శ్రీను, శివలింగు కృష్ణ, బొజ్జపురి రాజు, మిట్టపల్లి సుధాకర్, మహిళా సమాఖ్య నాయకులు యాద పద్మ, కిన్నెర మల్లవ్వ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్దన్, అధ్యక్షులు సంగెం మధు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రామగాళ్ల నరేశ్,వేల్పుల ప్రసన్న కుమార్, లంకదాసరి కళ్యాణ్, సుమారు 400 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిమర్జన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



- ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు
- గజ ఈతగాళ్లు ఏర్పాటు తదితర వాటిపై అధికారులకు సూచన

**హుస్నాబాద్ (జనంసాక్షి):**

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద వినాయక నిమజ్జనం ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్ మున్సిపల్ చైర్మన్ అధికారులు ,కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జనం కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చెరువు వద్ద లైటింగ్ సిస్టమ్ ,భారీ కేడ్లు ,నిమజ్జనం రోజు గజ ఈతగాళ్లు ఏర్పాటు తదితర వాటిపై అధికారులకు సూచనలు చేశారు. ప్రశాంతంగా ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమం జరగాలని, ఎక్కడ నిర్లక్ష్యం జరగకుండా చెరువు వద్ద కూడా ఈతగల్లను పెట్టాలని.. ప్రాణ నష్టం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి అధికారులకు సూచించారు. నిమజ్జనం అయినా వెంటనే తీసేయేడానికి ప్రత్యేక సిబ్బంది ఏర్పాటు..లైటింగ్ సిస్టమ్ ,విద్యుత్ తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. హుస్నాబాద్ ప్రజలపైన ఆదేవుడి ఆశీస్సులు ఉండలని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలనీ ఆకాంక్షించారు.

## సెప్టెంబర్ 17 ముమ్మాటికి తెలంగాణకు విద్రోహామే

**మక్తల్ సెప్టెంబర్ 15 (జనంసాక్షి)**

మక్తల్ పట్టణ కేంద్రంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ అధ్యర్యంలో సెప్టెంబర్ 17 తెలంగాణకు విద్రోహ దినంగా పాటించాలని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ పార్టీ డివిజన్ నాయకులు అధ్యక్షత వహించారు. అనంతరం సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం సలీం, సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు యస్ కిరణ్ మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలకు విద్రోహం జరిగింది. అనేక సంవత్సరాలుగా తెలంగాణ ప్రజలు రైతులు కుల మతాలకతీతంగా భూమి భుక్తి వేట్టి చకిరికి భుస్వాములలు, రజాకర్ నిజం పోలిస్ దొవుర్ జన్నలకి వ్యతిరేకంగా కామ్యునిస్టుల అద్యర్యలో వందలాది గ్రామాల ప్రజలను చైతన్య పరిచి అనేక పోరాటలు చేశారు. నిజం భుస్వాములకు విమొచన జరిగిందని సెప్టెంబర్ 17ను విమోచన కాదు, విలీనంకాదు ముమ్మాటికి సెప్టెంబర్ 17 విద్రోహ దినంగా జరుపాలని ప్రజలను కొరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎజి భుట్టో, నాయకులు మహిముద్, రాజు, ఆంజనేయులు, పంచదేవ్ పాదు రాజు, వెంకటేష్, మల్లేష్, మారెప్ప, లోకేష్ పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి అజయ్ తదితరులు పాల్గొన్నారు.






## ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

**మొయినాబాద్ (జనం సాక్షి)**

ఈనెల 23, 24న తుక్కుగూడలో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర సెమినార్ ను, కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని మొయినాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గోడపత్రిక విడుదలకు ముఖ్య అతిథిగా ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి హాజరై కార్మికులతో కలిసి రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. 23వ తేదీన తుక్కుగూడలో జరిగే సెమినార్ కు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి కే శ్రీనివాస్, జిల్లా భవన నిర్మాణ రంగ ఉపాధ్యక్షులు బి ప్రభాకర్, దర్శన్, యాదయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు అందని భరోసా..!

## పెట్టుబడికి డబ్బుల్లేక రైతుల ఇక్కట్లు



**రాజోలి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :**
పంటల సాగుకు రైతులకు గత ప్రభుత్వం రైతుబంధు పేరిట పెట్టుబడి సాయం అందించింది. రెండు విడతలుగా ఎకరాకు రూ.10వేలు బ్యాంకు ఖాతాలో జమయ్యేవి. అయితే ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని రైతు భరోసాగా మార్చి ఒక ఎకరా సంవత్సరానికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామి ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక గత యాసంగి సీజన్లో ఎకరాకు రూ.5 వేలు సాయం అందించింది. ప్రస్తుతం వానకాలం సీజన్లో అందాల్సిన రైతు భరోసా నిధులు మాత్రం ఇంతవరకూ జమచేయలేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడు నెలలు దాటిన భరోసా దక్కకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గతంలో ప్రతి జూన్, డిసెంబర్ నెలల్లో పెట్టుబడి సాయం అందేది. ఈ ఏడాది జూన్లో జమ కావాల్సిన పెట్టుబడి సాయం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా పూర్తి కావడం లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

### నిధుల సమస్యే కారణమా ?

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసే ప్రక్రియ చేపట్టింది. ఈ క్రమంలోనే రైతు భరోసా పంపిణీ ప్రక్రియ ఆలస్యమవుతుందని చర్చ సాగుతోంది. రుణమాఫీకి భారీగా నిధులు అవసరం అవుతుండడంతో రైతు భరోసాకు నిధులు సమస్య ఏర్పడింది. అయితే రుణమాఫీ ప్రక్రియ కూడా గందరగోళంగా మారడంతో ఇటు రైతు భరోసా అందక, అటు రుణమాఫీ కాగా చాలామంది రైతులు పెట్టుబడి ఖర్చులకు నానా ఇబ్బందులు పడుతున్నారు.

### సాగు భూములకే సాయం...!

గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకంలో అనేక తప్పిదాలు ఉన్నాయని, అర్హులకు కూడా పెట్టుబడి సాయం అందుతుందని ప్రస్తుత ప్రభుత్వం భావించింది. గుట్టలు, కొండలు సాగుకు యోగ్యం కానీ భూములకు రైతుబంధు అందిస్తున్నట్లు గుర్తించింది. అలాకాకుండా సాగు చేస్తున్న భూములకే పెట్టుబడి సాయం అందించే దిశగా చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో రైతుల అభిప్రాయాలు సేకరించింది. జిల్లా కేంద్రాలు మంత్రులు కూడా వర్క్ షాప్లు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతు భరోసా అమలపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని సైతం ఏర్పాటు చేసింది. పెట్టుబడి సాయాన్ని 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు అందించాల, 5 ఎకరాలకు కుదించాల అనే అంశంపైన చర్చ జరిగింది. అయితే ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన ఇప్పటివరకు రైతు భరోసాపై విధివిధానాలు ప్రకటించలేదు. దీంతో రైతులకు అందించే పెట్టుబడి మరింత జాప్యం జరిగేలా కనిపిస్తుంది.

### పెట్టుబడి సాయం అందించాలి

వ్యవసాయ సీజన్ ప్రారంభమే నాలుగు నెలలైనా పెట్టుబడి సాయం అందలేదు. చాలామంది రైతులకు రుణమాఫీ కూడా కాలేదు. పెట్టుబడులకు ప్రైవేటుగా వడ్డీలకు అప్పు చేయాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలి.
**– జి. అరుణమ్మ, మానుదొడ్డి**

### పెట్టుబడులకు కటకటే

రైతు భరోసా అందక పెట్టుబడులకు కటకటగా ఉంది. ఇప్పట్లో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తే ఉపయోగముంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే రైతు భరోసా అందించి ఆదుకోవాలి. **– కే. పెద్దయ్య, పచ్చర్ల**



## దేవరకద్ర ఎమ్మెల్యే కుటుంబాన్ని పరామర్శించిన ముఖ్యమంత్రి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా, చిన్న చింతకుంట మండలం, దమగ్నాపూర్ లో దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి తండ్రి స్వర్గీయ జీ .కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా ఆయన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి .చిన్నారెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్స్ సురభి, జిల్లా ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్. మోహన్ రావు, అడిషనల్ ఎస్పీ రాములు, శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మెఘా రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, చిట్టెం ఫర్ణికా రెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, కూచకుళ్ల రాజేష్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, గద్వాల జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ సరిత, మహబూబ్ నగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షులు మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, టీపిసిసి అధికార ప్రతినిధి గాలి రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, మహబూబ్ నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, మహబూబ్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాడుకలో లేని ఖిల్లా డంప్ యార్డ్

- పక్కనే ఉన్న కస్తూరిబా పాఠశాల
- అనారోగ్యాలతో విద్యార్థులు
- పట్టించుకొని సంబంధిత అధికారులు





**ఖిల్లా ఘనాపురం సెప్టెంబర్ 15( జనం సాక్షి)**
ఖిల్లా ఘనపూరం మండల కేంద్రం లోని స్థానిక కస్తూరిభ పాఠశాల ,సకల వర్గాల సామూహిక భవనం వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న డంప్ యార్డు వాడుకోలేక తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది గ్రామాల్లో నుంచి తీసుకొచ్చిన చెత్తను రోడ్డు ప్రక్కన వేయడంతో అధిక దోమలు ఈగల తో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు, తీవ్ర దుర్గంధం రావడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నారు. బాట సారులు, రైతులు పలుమార్లు ప్రజా ప్రతి నిధులకు చెత్తను రోడ్డు పై వెయ్యవద్దు అని విన్నవించిన పట్టించుకోలేదు. గత ప్రభుత్వం అయంలోనే ఈ డంపింగ్ యార్డ్ నిర్మించడం జరిగింది నిర్మాణ దశలో ఉన్నప్పుడే ఈ రోడ్డు ప్రక్కన వొద్దు అని కస్తూరిభ పాఠశాల ఉన్నది విద్యర్థుల కు అనారోగ్యాలు వచ్చే అవకాశం ఉంటుంది అని చెప్పిన వినకుండా నిర్మించారు అని బాటసారులు వాపోయారు. గత పది రోజుల క్రితం గణపురం గ్రామానికి వచ్చిన కలెక్టర్ ఆదర్శ సురభి ఈ దంప్ యార్డ్ను పరిశీలించారు అనంతరం పక్కన ఉన్న రైతుల అభ్యర్థన మేరకు వారితో మాట్లాడుతూ ఈ రోడ్డు పక్కన ఉన్న ఈ దంపు యార్డును త్వరలో వేరే ప్లేస్ కు మారుస్తామని తెలపడం జరిగింది. అక్కడే ఉన్న సంబంధిత సిబ్బందికి సూచించడం జరిగింది అయినా అధికారులు ఇప్పటివరకు డంప్ యార్డ్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు, కాగా పక్కనే ఉన్న సకల వర్గల సామూహిక భవనం అరుగుపై శునకం చనిపోయి దాదాపు వారం గడుస్తున్నా అక్కడి నుండి తొలగించ లేదు. ఈ శునకం చనిపోవడం వల్ల తీవ్ర దుర్గంధం వస్తుంది ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకల వర్గల సామూహిక భవనంలో చనిపోయిన శునకాన్ని అక్కడనుండి తొలగించాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు. అదేవిధంగా దంపు యార్డు పై త్వరగా చర్యలు తీసుకొని ఇక్కడి పాఠశాలకు దూరంగా మార్చాలని బాటసారులు తదితరులు కోరుతున్నారు.

## ప్రజలను మోసం చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియా

- ఇంటి స్థలం కానీ వ్యవసాయ స్థలం కొనుక్కోవాలనుకునే ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):**
ప్రజలను మోసం చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇంటి స్థలం కానీ వ్యవసాయ భూమి కానీ కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీడీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న భూములకు భారీగా డిమాండ్ ఏర్పడింది. శివారులో భూమి కొనుగోలు చేయాలని చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారని ఇంటి స్థలం కానీ వ్యవసాయ స్థలం కొనుక్కోవాలనుకునే సామాన్యుల అమాయకత్వమే వ్యాపారస్తుల ఆదాయవనరుగా మారుతోందన్నారు. ఎవరైనా ఇంటి స్థలం కానీ వ్యవసాయ స్థలం కొనుక్కోవాలనుకునే ప్రజలు తగు జాగ్రత్తలు, స్థలానికి సంబందించిన సరియైన ధృవ పత్రాలు ఉన్నాయా లేవా అని సారి చూసుకోవాలన్నారు. అట్టి స్థలం సరియైనదేనా లేక రియల్ ఎస్టేట్ చేసే మోసగాళ్ల పనా అని ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసుకోవాలని డబ్బులు ఎవరికి ఊరికే రావని తాము ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బులను తమ పిల్లల భవిష్యత్తు కోసం స్థిరాస్తుల పై పెట్టుబడిగా పెడతారని అలాంటి వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు రియల్ ఎస్టేట్ పేరిట మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పేద మధ్యతరగతి వర్గాలు కొనుగోలు చేసి ఇబ్బందుల పాలు అవుతున్నారని మరియు ఆర్థికంగా నష్టపోతున్నారని ప్రజలను మోసం చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మా దృష్టికి వచ్చిందన్నారు. వాటిని అరికట్టేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం అని ఆదేవిదంగా రియల్ ఎస్టేట్ ఆగడాల వలన ఎంతోమంది బాధితులు అయిన కేసుల్లో భరోసా కల్పించడానికి పెద్ద శంకరంపేట పోలీసులు రియల్ ఎస్టేట్ మాఫియా నిందితులను అరెస్ట్ చేసి మెదక్ జిల్లా కోర్టు ముందు హాజరుపరచడం జరిగినదని, హైదరాబాదు నుండి పెద్ద శంకరంపేట మండల పరిధిలో భూములు కొనడానికని వచ్చిన వాళ్లను ఇక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారులు మధ్యవర్తులుగా ఉండి రోడ్డు సైడు మెయిన్ బిట్ అమ్మడానికి ఉందని ఫేస్బుక్లో ఫోటోతో ఫోన్ నెంబర్తో పోస్ట్ చేసి వాటిని చూసి నిజమని నమ్మిన వారు సంప్రదించగా వారికి మెయిన్ రోడ్డు బిట్టు చూయించి ఎక్కువ డబ్బులు తీసుకొని మోసం చేసి రోడ్డు నుంచి దూరంగా ఉన్న వ్యవసాయానికి పనికి రాని నిజాంసాగర్ బ్యాక్ వాటర్లోని భూమిని రిజిస్ట్రేషన్ చేసి మోసం చేస్తున్నారు. హైదరాబాద్ లోని కూకట్పల్లి కి చెందిన ఆడం జ్యోతి గారు ఫేస్బుక్లో వారు చేసిన పోస్టుకు స్పందించి పెద్ద శంకరంపేటలోని పుతులూరు గ్రామ శివారులోని రోడ్డు సైడు బిట్టు అమ్మడానికి ఉన్నదని దాన్ని 31 లక్షల 40 వేల రూపాయలకు మాట్లాడుకుని పెద్ద శంకరంపేట తాసిల్దార్ ఆఫీస్ లో డబ్బులు ఇచ్చి రిజిస్ట్రేషన్ అయిన తర్వాత భూమి దగ్గరికి వెళ్లి చూసే సరికి మోసపోయిన విషయం తెలిసినది అందులో పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్లో ఏడుగురిపై ఫిర్యాదు ఇవ్వగా ఇట్టి ఫిర్యాదును పరిశీలించిన సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం ముకుంద నాయక్ తండా చెందిన చవాన్ సాగర్, పెద్ద శంకరంపేటఇట్టి చెందిన జంగం శ్రీనివాస్ పట్టుబడగా, మిగతావారు ఫరారిలో ఉన్నారన్నారు. పట్టుబడ్డ నిందితులను మెదక్ జిల్లా కోర్టు ముందు హాజరుపరచగా గౌరవ న్యాయస్థానం వారికి 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విదించినట్లు తెలిపినారు.



## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

### బిఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులను అందజేసిన పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 15( జనం సాక్షి):**
కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..కార్యకర్తలకు కష్టకాలంలో అండగా ఉండేది బిఆర్ఎస్ పార్టీ అని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. మెదక్ మండలం రాజ్ పల్లి గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ అన్న మార్గం సిద్ధిరాములు, హవెలిఘనపూర్ మండలం షమ్నాపూర్ గ్రామానికి చెందిన సిద్దిరాములు ఇటీవల ప్రమాదవశాస్తూ పిడుగు పడి చనిపోయారు.ఈ ఇద్దరు బిఆర్ ఎస్ పార్టీ మెంబర్షిప్ ఇన్సూరెన్స్ చేశారు. నామిని అయిన సిద్దిరాములు భార్య మార్గం రాధమ్మ,చెట్ల బోయిన సిద్దిరాములు భార్య బాలమణి ఈ ఇద్దరికీ 2 లక్షల చొప్పున రూ. 4,00,000/- బిఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును వారి ఇంటికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యకర్త కుటుంబానికి పార్టీ ఇన్సూరెన్స్ చెక్కు కొండత భరోసా నిస్తుందని అన్నారు. పార్టీ కార్యకర్త చనిపోతే రెండు లక్షల రూపాయల బీమా అందిస్తున్న ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎం లావణ్య రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, మెదక్ పిఎసిఎస్ చైర్మన్ హన్మంత్ రెడ్డి, హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, షమ్నాపూర్ మాజీ సర్పంచ్ లింగం, నాయకులు కిషన్ గౌడ్, ఎలక్షన్ రెడ్డి, నవీన్, రాములు, జహంగీర్, రాంరెడ్డి, రవీందర్ రెడ్డి, రవి, దుర్గయ్య, కిష్టయ్య గౌడ్, సిద్దయ్య, వినయ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కూలిన సీసీ కల్వర్టుతో..'పొంచున్న పెను ప్రమాదం'..!

### రాఘవపూర్, రాయికోడ్ ఆర్ అండ్బి రోడ్డుపై జరభద్రం..!




**న్యాల్ కల్, సెప్టెంబర్ 15, (జనం సాక్షి)**
వాహనం చోదకులు, ప్రయాణికులారా ఐతే మీరు జరభద్రం. ఏ మాత్రం నిర్లక్ష్యం, అలసత్వం వహించిన భారీ మూల్యం తప్పని పరిస్థితి. అనునిత్యం వందల సంఖ్యలో రేయింబవళ్లు వివిధ రకాల వాహనాలు రాకపోకలు సాగించె రాఘవపూర్–రాయికోడ్ ఆర్ అండ్బి రోడ్డు అత్యంత పెను ప్రమాదకరంగా మారింది.

### కూలిన సీసీ కల్వర్టు

సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, రాఘవపూర్, కుసునూరు రాయికోడ్ ఆర్ అండ్ బి రోడ్డుపై ఉన్న సీసీ కల్వర్టు కూలిపోయింది. శనివారం రాత్రి రాఘవపూర్ గ్రామ సమీపానగల పీత్రీ వాగు సీసీ కల్వర్టు ఉన్నపలంగా అధిక మొత్తంలో నేల వారింది. ఇటీవల కురిసిన భారీ, అతి భారీ వర్షాలతో మండలంలోని ఇబ్రహీంపూర్, హుమునాపూర్, రాఘవపూర్,చాల్కి, తదితర గ్రామాల శివారు నుండి వచ్చిన వరద ఉధృతితో ప్రీతి వాగు సీసీ కల్వర్టుకు పలుచోట్ల బీటలు వారి చిత్రమయ్యాయి. తాజాగా శనివారం రాత్రి ఉన్నఫళంగా కూలిపోవడంతో పెను ప్రమాదకరంగా మారింది.

### అటుగా ప్రయాణం సాగిస్తే అధోగతే



వాహనం చోధకులు, ప్రయాణికులు ఏమాత్రం అలసత్వం వహించి శిథిలమైన కల్వర్టు మీదుగా రాకపోకలు సాగిస్తే పెను ప్రమాదం కొని తెచ్చుకున్నట్లే..? కర్ణాటకలోని బీదర్, న్యాల్ కల్ మండలం, నారాయణఖేడ్, ఆందోల్, తదితర ప్రాంతాలకు చెందిన వాహన చోదకులు, ప్రయాణికులు ఈ మధ్య మార్గం ద్వారానే అధిక మొత్తంలో రాకపోకలు సాగిస్తుంటారు. సమీపంలోని పలు పట్టణాలు, ఆధ్యాత్మిక నిలయాలకు వెళ్లేందుకు ఈ దారి కొంత సానుకూలంగా ఉండడంతో ప్రయాణికులు, వాహన చోదకులు అమితంగా ఆసక్తి చూపుతుంటారు. ప్రభుత్వ ఆర్టీసీ బస్సులు మినహా ఇతరత్రా వాహనాలు వందల సంఖ్యలో రేయింబవళు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై సీసీ కల్వర్టు కూలిపోవడంతో ద్విచక్ర వాహనాలు మినహా ఇతర భారీ, అతి భారీ వాహనాలు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించి రాకపోకలు సాగించిన పెను ప్రమాదం కొని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది.

### నిధుల కొరతే ప్రధాన సమస్య
### ఆర్ అండ్బి ఈఈ రాంబాబు

భారీ వర్షాలతో శిథిలమైన సీసీ కల్వర్టులు, రోడ్ల మరమ్మత్తులను చేపట్టేందుకు నిధుల కొరత తీవ్ర ఇబ్బందిగా మారింది. మరమ్మత్తుల కోసం అతి తక్కువ నిధులు మంజూరు కావడంతో ఇబ్బందిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే నివేదికలను పంపి అవసరం మేర నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తాం. ప్రమాదకరంగా మారిన రోడ్లపై వాహన చోదకులు, ప్రయాణికులు అటుగా వెళ్లకుండా మరో మార్గం ద్వారా ప్రయాణం సాగించాలి. వెంటనే శిథిలమైన సీసీ కల్వర్టును పరిశీలించి ప్రమాదాలు జరక్కుండా చర్యలు తీసుకుంటాం.

## ఎట్టకేలకు సదాశివుడుకే పట్టం..!





వైస్ చైర్మన్గా కొనంగేరి హన్మంతు

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపి ఆర్.సదాశివరెడ్డినీ వరించింది. చైర్మెన్ పదవి కోసం పలువురు ముమ్మర ప్రయత్నాలు చేశారు. చివరకు సదాశివరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు కోట్ల రవీందర్ రెడ్డి మధ్య పోటీ నెలకొన్నా ఆఖరికి పదవి సదాశివ రెడ్డినీ వరించింది. ఆయన మొదటి నుంచి మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి, చిట్టెం వేంకటేశ్వర రెడ్డికి అత్యంత సన్నిహితంగా మెలుగుతూ పార్టీని విడకుండా కాంగ్రెస్ పార్టీకి విదేయునగా పనిచేస్తూ వచ్చారు. దాంతో ఎమ్మెల్యే పర్నికా రెడ్డి,డిసిసి మాజీ అధ్యక్షుడు కె.శివకుమార్ రెడ్డి సదాశివ రెడ్డి నీ నియమించేందుకు మొగ్గు చూపారు. కాగా వైస్ చైర్మన్ పదవి బిసి వర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కొనంగెరి హన్మంతు నియమితుడయ్యాడు. అలాగే డైరెక్టర్లుగా డామరిగిద్ద వెంకటప్ప, పాత తాండా రాగ్యానాయక్, ఎన్.రామచంద్రయ్య, లక్ష్మయ్య గౌడ్, బోయ శరణప్ప,చిన్న నర్సప్ప, బోయిన్ పల్లి వెంకటయ్య, తహెర్హుస్సేన్, రాజారెడ్డి, పి.శివకుమార్ నియమితులయ్యారు. కాగా మార్కెట్ పాలక వర్గం సోమవారం ప్రమాణ స్వీకారానికి సిద్ధం అయినట్లు తెలుస్తోంది.





## గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు

### డిఎస్పి ఎన్ లింగయ్య

**మఖ్తల్ సెప్టెంబర్ 15 (జనంసాక్షి)**
గణేష్ నిమజ్జనం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డియస్పి ఎన్ లింగయ్య తెలిపారు. ఉట్కూరు మండల కేంద్రంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా బందోబస్తుకొచ్చిన పోలీసు అధికారులు సిబ్బందికి డీఎస్పీ భద్రతాపరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సజావుగా జరిగేలా చూడాలని ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. గణేష్ నిమజ్జన సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం పూర్తి అయ్యేవరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. విధుల్లో ఉండే పోలీస్ లు అలసత్వం వహించరాదని గణేష్ ఊరేగింపు సమయంలో వీడియో రికార్డింగ్ చేయాలని సూచించారు. విధుల్లో ఉండే పోలీసులు తమ కేటాయించిన ప్రదేశంలో ఉంటూ సంయమనం పాటించాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలని డీఎస్పీ గారు తెలిపారు. ఉట్కూర్ గణేష్ నిమజ్జనంలో 180 మంది పోలీస్ అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు చంద్ర శేఖర్, శివ శంకర్, ఆర్ ఐ నరసింహ, ఉట్కూరు యస్ ఐ లు కృష్ణంరాజు, అశోక్ బాబు, నవీద్, కుర్మయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బిబిజి) అనే సంస్థ బాలికాభ్యున్నతి కోసం నడుం బిగించింది. ఆడపిల్లల వికాసాన్ని కాంక్షించి ఒక నిర్దిష్ట ప్రణాళికను రూపొందించింది. మహిళలను జాగ్రత్త పరచడం కోసం బాలికా విద్యను ప్రోత్సహించడం గీటురాయిగా ఎంచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో బాలికా విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో ఆ సంస్థ చైర్మన్ ఎంవి మల్లికార్జున రెడ్డి 2019లో బిబిజి సౌజన్యంతో బంగారుతల్లి పేరుతో కార్యాచరణను ప్రారంభించారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా త్రికరణ శుద్ధితో ఈ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఆడపిల్లల చదువుకు అగ్రతాంబూలం వేశారు. ఎన్నో విశేషాల సమాహారం ఈ బంగారు తల్లి..

విద్య మనిషికి స్వావలంబన నేర్పుతుంది. బాలికా విద్య భవిష్యత్తులో సామాజిక అభివృద్ధికి దారితీస్తుంది. మహిళల భాగస్వామ్యం లేకుండా సమాజ వికాసం సాధ్యం కాదు. అందువల్ల ఆడపిల్లల సంక్షేమం గురించి ఆలోచిస్తున్నాం. బాలికా విద్యను ప్రోత్సహిస్తూ, స్వావలంబన, సాధికారత కోసం తమవంతు కృషి చేస్తున్నాం. ఆడపిల్ల అంటే బరువు కాదు, బంగారం అని చెప్పడానికే మా ఈ ప్రయత్నం.

**ఎంవి మల్లికార్జున రెడ్డి**
- సీఎండి, బిల్డింగ్ బాక్స్ గ్రూప్



# చదువుల కల్పవల్లి
# బిబిజి బంగారుతల్లి



ఆడపిల్లలు చదువుకుంటే ప్రపంచాన్ని జయించగలరు. జాతి నిర్మాణంలో భాగస్వాము లవుతారు. సంపద సృష్టించడంలోనే గొప్పదనం ఉంది. బిబిజి చేపట్టిన బంగారు తల్లి అద్భుతమైన సేవా కార్యక్రమం. 20 లక్షల మంది ఆడపిల్లలకు చేయూత ఇవ్వడమంటే అంతకుమించిన జీవనసాఫల్యం ఇంకేముంటుంది. ఆడపిల్లలకు సాధికారతలో బిబిజి సామాజిక స్పృహకు హ్యాట్సాఫ్..!!

**- బాలలత మేడమ్**
సిఎస్‌బి ఐఏఎస్ అకాడమీ

విద్య ద్వారా విశ్వాసం పెరుగుతుందని, ప్రతి ఆడపిల్ల విద్యావంతురాలైతే ఈ లక్ష్యాలు నెరవేరుతాయని బి.బి.జి నమ్మిక. స్త్రీ విద్య, వితంతు వివాహాల కోసం కందుకూరి వీరేశలింగం కృషి చేశారు. బాల్య వివాహాలు, సతీసహగమనం లాంటి దురాచారాలను రూపుమాపడానికి రాజారామ్ మోహనరాయలు ఉద్యమించి నవభారతికి నాంది పలికారు. బ్రహ్మ సమాజ సభ్యులు ద్వారకానాథ్ గంగూలీ, శివనాథ్ శాస్త్రి బాలికల పాఠశాలలు స్థాపించి విద్యావ్యాప్తికి కృషి చేశారు. అలాగే ఎవరో ఏదో ఒకటి చేస్తేనే మార్పు సాధ్యమని తలచి మల్లికార్జున రెడ్డి బాలికా సాధికారతకు తనవంతు కృషి మొదలుపెట్టారు. బంగారుతల్లి ద్వారా 2040 వరకు 20 లక్షల విద్యార్థినులకు సాధికారత కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షా 80వేల బాలికలకు విద్య ద్వారా సాధికారత కల్పించారు. వీరిని అనేకాంశాలతో జాగృతం చేశారు. చదువుతో ఒనగూరే ప్రయోజనాలను విశదీకరించారు. చదువుకుంటే భవిత ఉజ్వలంగా ఉంటుందని ఆడపిల్లలు గ్రహిస్తున్నారు. ఈ స్ఫూర్తితో వీరికోసం వేసవి శిబిరాలు నిర్వహించి పలు పోటీల్లో రాణించిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించారు. ప్రైమరీ స్కూల్ పిల్లలకు ఆరోగ్యం, క్రీడలు, మానసిక ఉల్లాసం ఇత్యాది అంశాలను బోధించారు. విద్యార్థినుల కోసం గూగుల్ లింకు పంపడం ద్వారా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. ప్రపంచం మెచ్చిన బంగారుతల్లుల విజయగాథలను విద్యార్థినులకు చేరవేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇంటర్నేషనల్ మెమొరీ ఛాంపియన్‌షిప్ నిర్వహించే పోటీల్లో బంగారుతల్లి మెమొరీ అవార్డులను అందజేస్తున్నారు.




## బంగారుతల్లి ఇతివృత్తం

ఆహ్లాద, స్వశక్తి, సురక్ష, భరోసా, ప్రేరణ అనే ఐదు ప్రణాళికలు బంగారుతల్లి ఇతివృత్తం. ఇది పేదింటి బంగారుతల్లులకు బంగారుబాటలు వేసేవి. ఆహ్లాద ద్వారా పాఠశాలలో మంచి వాతావరణం ఉండేలా చూస్తున్నారు. విద్యాభ్యాసానికి మంచి పరిసరాలు తోడ్పడతాయి. చదువుకునే పరిసరాలు శుభ్రంగా, అందంగా ఉండేలా పాఠశాల గోడలకు సృజనాత్మక ఆలోచనలు రేకెత్తించే పెయింటింగ్స్ వేస్తున్నారు. పిల్లలకు ఆటవస్తువులు అందించి, క్రీడా మైదానాలు నిర్మించి ఆహ్లాదం కలిగిస్తూ మానసిక పరిపక్వత పెంపొందిస్తున్నారు. పరిశుభ్రత కోసం మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. స్వశక్తిలో భాగంగా పేద విద్యార్థినుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి దిశానిర్దేశం చేస్తున్నారు. ఉపకార వేతనాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థినులు తమ శక్తిని తెలుసుకొని జీవితంలో ఎత్తుకు ఎదిగేలా వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. స్వశక్తి పేద బంగారుతల్లులకు ఓవరం. సురక్ష ద్వారా పేదింటి బంగారుతల్లుల నైపుణ్యాలను వెలికితీస్తూ వారి ప్రతిభకు పట్టం కడుతున్నారు. టాలెంట్ ఉన్న చిన్నారులకు చదువులో సాయం అందిస్తున్నారు. వారు నైపుణ్యాలను అందిపుచ్చుకోవడంలో తోడ్పాటునందిస్తున్నారు. ఉత్తమమైన కెరియర్‌ను ఎంచుకునే అంశాల్లో సూచనలిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. విద్యార్థినులకు సురక్ష దారిదీపమని చెప్పవచ్చు. దగాపడిన బాధిత ఆడపిల్లల చీకటి జీవితాల్లో వెలుగులు నింపుతుంది భరోసా. మేమున్నామనే భరోసా వారికి మరో కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది. విధివంచితులైన ఆడపిల్లలకు ప్రత్యేకమైన సెషన్స్ ద్వారా కోల్పోయిన ఆత్మవిశ్వాసాన్ని పునరుజ్జీవింపజేస్తున్నారు. తమ కాళ్లమీద తాము నిలబడగలమనే ధైర్యం ఇస్తున్నారు. భరోసాను వెలకట్టలేని సమాజసేవగా పేర్కొనవచ్చు. నిర్భాగ్యులకు ఆసరాగా నిలిచే భరోసా కేంద్రాల నిర్మాణం శంషాబాద్, భువనగిరిలో పూర్తి కావొచ్చింది. బిబిజి బంగారుతల్లి ఇతివృత్తంలో మరో ముఖ్య ప్రణాళిక ప్రేరణ. ఇది సమున్నతాశయాల భావన. సమాజం బాగుండాలంటే అందరూ బాగుండాలి. వ్యక్తిగతంగా ఉన్నత భావాలు ఏర్పరుచుకోవాలి. ఆడపిల్లల స్వేచ్ఛకు, విద్యకు భంగం కలగకుండా ప్రవర్తించాలి. అప్పుడు సమాజ వికాసం కళ్లకు కడుతుంది. పిల్లల్లో మాత్రమే కాదు ఉపాధ్యాయుల్లో, పిల్లల తల్లిదండ్రుల్లోనూ మానసిక పరిణతి రావాలి. పిల్లలు చదుకోవాలి. లింగ వివక్ష ఉండకూడదు అనే భావాలను విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలిగించి వారి పిల్లలకు మంచి భవిష్యత్తు ఉండేలా స్ఫూర్తి రగిలించేదే ఈ ప్రేరణ. బాలురకు కూడా ఈ ప్రేరణ ద్వారా మంచి నడత, వ్యక్తిత్వం పెంపొందించుకునేలా దిశానిర్దేశం చేస్తున్నారు. తోటి విద్యార్థినులతో ఎలా నడుచుకోవాలో, మహిళలను ఎలా గౌరవించాలో అవగాహన కల్పిస్తున్నారు. ఆడపిల్లల విద్యా విషయమై అవగాహన కార్యక్రమాలు రూపొందిస్తూ, వారి భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## బాలికా విద్యతో ప్రయోజనాలు

విద్య ప్రాథమిక మానవ హక్కు. మన జనాభాలో సగం మహిళలే. వీరు గొప్ప ప్రపంచ వనరుగా ఉన్నారు. అందువల్ల సమాజాభివృద్ధికి బాలికా విద్య చాలా ముఖ్యం. బాలికలు చదువుకుంటే తమ జీవితాలే కాకుండా కుటుంబాలు, సంఘాలు, దేశాలను సైతం మెరుగుపరుస్తారు. తద్వారా సాధికారత సాధ్యమవుతుంది. ఈ లక్ష్యంపైనే బిబిజి గురి సారించింది. బాలికా విద్య వల్ల సాధికారతతో పాటు సామాజిక అవగాహన పెరుగుతుంది. ప్రభుత్వ పథకాలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, లింగ వివక్ష, భ్రూణహత్యలు, బాలికల పట్ల పక్షపాత వైఖరి, చట్టాలు, హక్కులు, స్వయం పోషకత్వం, పురుషాధిక్యత, ఇత్యాది అంశాల పట్ల అవగాహన ఏర్పడుతుంది. కుటుంబంలో ఒక పురుషుడు చదువుకుంటే ఒక్కడే విద్యావంతుడవుతాడు. అదే ఒక ఆడపిల్ల చదువుకుంటే కుటుంబంలోని అందరూ విద్యావంతులవుతారు. అందువల్ల సమాజంలో స్త్రీ స్థితి మారాలి. ఆమెకు న్యాయమైన స్థానం దక్కాలి. ఆమెలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభ బయటకు రావాలి. ఈ ఆలోచనతోనే బిబిజి బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నది.


'జాబిల్లి లేని ఆకాశం – ఆడపిల్ల లేని ఇల్లు' ఒకటే అంటుంటే ఆ మాట వింటుంటే ఎంత ముచ్చటేస్తుందో! కానీ వర్తమాన పరిస్థితులు అందుకు పూర్తిభిన్నంగా ఉన్నాయి. సమాజంలో ఆడపిల్ల స్థాయిని దిగజార్చి పురుషాధిక్యతకే పెద్దపీట వేస్తున్నారు. ఈనాడు మహిళలు రైలింజన్ మొదలు రాకెట్ నడుపుతూ స్త్రీ శక్తి ఏపాటిదో నిరూపిస్తున్నారు. వ్యవసాయం, వ్యాపారం, బ్యాకింగ్, శాస్త్ర సాంకేతిక రంగాల్లో నెంబర్ వన్‌గా రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళలకు 'మేనేజ్‌మెంట్ గురు' అనే గుర్తింపు వచ్చింది. ఆడపిల్లల విద్యాభ్యాసం వల్లనే ఇది సాధ్యమయింది. ప్రాథమిక స్థాయిల్లో చదువును కొనసాగించడం వల్లనే ఇలాంటి విజయాలు సాధించగలిగారు. బాలికల్లో ప్రతిభా పాటవాలు అంతరంగంలో నమోదై ఉంటాయి. అవి ఉపయోగించుకుంటే ఎంతో ప్రయోజనం. దీనికి 'బంగారుతల్లి' ఒక సాధనంగా నిలిచింది. ఇంతటి మేధాసంపత్తి ఉన్నప్పటికీ ఆడపిల్ల ఆడపిల్లే అనే సంకుచిత భావన తొలగడం లేదు. నేటి సమాజంలో ఆడపిల్లలకు సముచిత స్థానం ప్రశ్నార్థకమే. వాళ్లను తక్కువగా అంచనా వేస్తున్నారు. అబ్బాయిని బాగా చదివిద్దాం, ఆడపిల్లకు ఉన్నత చదువు అవసరమా? అనే భావన పల్లె ప్రాంతాల్లోని తల్లిదండ్రుల మెదళ్లలో నాటుకుపోయింది. ఆడపిల్లలను ఆక్షేపించడం, అవమానించడం మామూలే. ఇలాంటి పరిస్థితుల్లో మార్పు రావాలంటే బాలికా విద్య ఎంతో అవసరమని బిబిజి భావించింది. చదువు కొనసాగింపులో డ్రాప్‌ఔట్లను తగ్గించే ప్రయత్నంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు చేయూత అందిస్తున్నారు. మేమున్నామనే భరోసా ఇస్తున్నది బంగారుతల్లి. 20 లక్షల మంది బాలికలు విద్యావంతులైతే 20 లక్షల కుటుంబాలు బాగుపడినట్లే. అన్ని కుటుంబాలు సాధికారత సాధించినట్టే. భవిష్యత్తుకు గ్యారంటీ దొరికినట్టే. ఇలాంటి సంతోషాన్ని బిబిజి కోరుకుంటోంది. అందుకే మేమున్నామనే భరోసా ఇచ్చే బంగారుతల్లిని మరింత విస్తృతం చేస్తున్నారు. నేటి బాలలు రేపటి పౌరులుగా ఎదగడానికి త్రికరణ శుద్ధితో పనిచేస్తున్నారు. ఇందుకుగానూ 'బంగారుతల్లి'కి 2023 తెలంగాణ బిజినెస్ అవార్డు లభించింది. ఉత్తమ బాలికా సాధికారత కేటగిరీలోనూ గుర్తించారు. అదే సంవత్సరం రాష్ట్రీయ గౌరవ పురస్కార్ కూడా రావడం విశేషం. ఆడపిల్లల కళ్లల్లో కొత్త కాంతులు విరజిమ్మాలనే సదాశయంతో చేస్తున్న కృషికిగానూ 'బంగారుతల్లి'ని అభినందించాల్సిందే.



- గంగాధర్.కె
జర్నలిస్టు, 9291622677

స్త్రీకి మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి. ఆమె నీకు బానిస కాదు. జీవం లేని వస్తువు అసలే కాదు. పురుషుల కంటే స్త్రీలల్లో మెదడు చాలా చురుగ్గా ఉంటుంది. కాని మన సమాజం ఈ మాటలను ఏనాడో మరిచిపోయినట్టుంది.

**- చలం**





## అక్షరం

అక్షరం అంటే అమ్మ
అక్షరమంటే జ్ఞాన ఉషస్సు
అక్షరం మనిషికి మూడో నేత్రం
దొంగలకు దొరకనిది పరులకు పంచితే తరగనిది
అంతకంతకూ పెరిగే నిధి
ఈ గని విద్యాప్రదాతల పెన్నిధి
అక్షరం కళ్లు తెరిపిస్తుంది
అజ్ఞాన తిమిరంపై సమరశంఖం పూరిస్తుంది
అక్షరమంటే తోడూ నీడ
విజయాల జాడ తెలిపే చిరునామా
అక్షరమంటే ఆలోచన
ఆకాశమే హద్దుగా ఎదగాలని ఉంటే అందివచ్చే నిచ్చెన
అక్షరం జీవిత సౌధానికి మూలస్తంభం
అక్షరమంటే పరువు, ప్రతిష్టల అక్షయం
భద్రతకు భరోసా–బతుకుకు ఆసరా
అక్షరమంటే ఆర్థిక వికాసం – స్వావలంబన!!

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 సెప్టెంబర్ 2024
తెలంగాణ

# కాల్వ మరమ్మత్తు పనులను వేగవంతం చేయండి : మంత్రి పొంగులేటి

**కాల్వ పునరుద్ధరణ పనులలో వేగం పెంచాలి**

**24 గంటల పాటు పనులు జరగాలి**

**కూసుమంచి మండలం హట్యాతండా వద్ద పాలేరు ఎడమ కాల్వ**

**గండి పూడిక పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి**



**కూసుమంచి సెప్టెంబరు 15 (జనంసాక్షి):**
పాలేరు ఎడమ కాల్వ గండి పూడిక పునరుద్ధరణ పనులలో వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం మంత్రి పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం హట్యాతండా వద్ద పాలేరు ఎడమ కాల్వ గండి ప్రదేశంలో జరుగుతున్న పునరుద్ధరణ పనుల తీరును పరిశీలించారు. పాలేరు ఎడమ కాల్వ గండి పూడిక వివరాలు, తాత్కాలికంగా చేపడుతున్న పనులు, శాశ్వత పునరుద్ధరణ పనులు, మొదలగు పనుల వాటిపై అధికారులతో మాట్లాడి, ప్రస్తుతం రైతులకు సాగునీరు అందించడానికి చేపట్టిన పనులలో వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి సూచించారు. గండి పూడిక పనులు 24 గంటల పాటు జరగాలని, అవసరమైన మేర అదనపు యంత్రాలు, షిఫ్టులవారీగా కార్మికులు పనిచేసేందుకు ఏర్పాట్లు చేయాలని, కాల్వ తవ్వకం, లైనింగ్ పనులు సమాంతరంగా జరగాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటన సందర్భంగా ఇర్రిగేషన్ సిఇ విద్యాసాగర్, ఎస్ఇ నర్సింగ రావు, సంబంధిత అధికారులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# వినాయక నిమజ్జన సమయంలో యువత అప్రమత్తంగా ఉండాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**గణేష్ శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలి - గణనాథులను దర్శించుకున్న మంత్రి**



**ఖమ్మం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):**
వినాయక నిమజ్జనం సమయంలో యువత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో ప్రతిష్టించిన గణనాధులను రాష్ట్ర రెవెన్యూ , హౌజింగ్, సమాచార పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. మంత్రి ఖమ్మం నగరపాలక సంస్థ పరిధి గొల్లగూడెం రోడ్ లోని శ్రీ సత్యసాయి నగర్, శ్రీనివాస్ నగర్, ముస్తఫా నగర్, విద్యా నగర్, టి.డి.పి. కార్యాలయం రోడ్, వి.డి.ఓస్ కాలని, ఎఫ్.సి. ఐ. గోడౌన్, ఖమ్మం రూరల్ లోని పెద్ద తండ, శ్రీరామ్ నగర్ కాలని -2 లోని గణేష్ మండపాల్లో ప్రతిష్టించిన గణానాథులను దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా లిమంత్రి మాట్లాడుతూ,లి దేశ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు నవరాత్రులుగా వినాయకున్ని భక్తిశ్రద్ధలతో పూజించారని, ఆ వినాయకుడు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు అనేక ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల కోరికలు, ఆశలు నెరవేర్చేలా ఆ వినాయకుడు ప్రభుత్వానికి అవసరమైన శక్తి సామర్థ్యాలు అందించాలని, భగవంతుడైన వినాయకుని ఆశీస్సులు మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వినాయక నిమజ్జనాన్ని అందరు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా యువత అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలను నివారించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల నరేందర్, రాపర్తి శరత్, దొడ్డా నగేష్, నాయకులు తుళ్ళూరు బ్రహ్మయ్య, కొప్పుల చంద్ర శేఖర్, షేక్ మియా భాయ్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

**• మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హుజూర్ నగర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):**
ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హుజూర్ నగర్ పట్టణంలో ఆదివారం వేంచేసి ఉన్న పెద్ద ముత్యాలమ్మ తల్లి జాతర సందర్భంగా ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అమ్మవారి దర్శనం, ఆశీర్వాదం తీసుకుంటాను. ఈ సంవత్సరం ముత్యాలమ్మ తల్లి దయవల్ల నాకు అదృష్టం కలిగింది. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, పట్టణ పుర ప్రముఖులు అందరికీ కూడా జాతర మంచిగా జరుపుకోవడం ఏర్పాటు చేసుకోవడంతో వారికి అభినందనలు తెలిపారు. ఈ ఆలయం, ఆలయం కు వెళ్లు రోడ్డు, ఆలయ ప్రాంగణం అభివృద్ధిలో నా భాగ్యస్వామ్యం ఉంది. మునుముందు కూడా ఈ ఆలయం ఉత్సవం ప్రసిద్ధిగాంచాలని అందుకు నా వంతు కృషి చేస్తానని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ సంవత్సరం మంచి పంటలు పండాలని, పండిన పంటలకు మంచి రేట్లు రావాలని కోరుకున్నారు. రైతులు, రైతు కూలీలు వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత మొత్తం తెలంగాణ రాష్ట్రంలో అన్ని రిజర్వాయర్లో నీళ్లు నిండుగా ఉన్నాయన్నారు. వర్షాల వల్ల కాలువల గళ్ళుపడి కొన్ని ఇబ్బందులు పడ్డ, చెరువులు గండ్లు పూడ్చివేత ,కాలువల మరమ్మత్తులు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మరమ్మత్తులు పూర్తయిన వెంటనే వ్యవసాయ పంటలకు నీరు విడుదల చేస్తామన్నారు. హుజూర్నగర్ ప్రజలు, అన్ని వర్గాల ప్రజలందరూ కూడా సుఖ సంతోషాలతో జాతర నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ వారు మంత్రి ఉత్తమ్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముత్యాలమ్మ జాతర కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

# ముస్లీం సోదరులకు మిలాద్ఉన్-నబీ శుభాకాంక్షలు

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**నల్గొండటౌన్, సెప్టెంబర్ 15(జనంసాక్షి)**
మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముస్లిం సోదరులు, సోదరీమణులందరికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన సబ్ర్ (సహనం), సిద్క్ (సత్యనిష్ఠ) తహారత్ (పవిత్రత) జకాత్ (సహాయం) రహ్మా (దయ) అనే పంచ సూత్రాలు మానవీయ జీవితానికి బాటలు వేస్తాయని ఆయన అన్నారు. ప్రతీ ముస్లీం సోదరుడు ఆ ప్రవక్త ప్రవచించిన సన్మార్గాలను పాటిస్తూ.. పవిత్ర మిలాద్-ఉన్-నబీ పండగను జరుపుకోవాలని ఆయన సూచించారు.

# కష్టపడ్డ వారికి సముచిత స్థానం

**పిసిసి చీఫ్ గా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతల స్వీకారోత్సవంలో**

**ఘనంగా సన్మానించిన భువనగిరి నాయకులు**

**పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్**



**భువనగిరి ప్రతినిధి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):**
పీసీసీ చీఫ్ గా బాధ్యతలు చేపట్టి మహేష్ కుమార్ గౌడ్ ను పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ ఘనంగా సన్మానించారు. భువనగిరి పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పడిగెల ప్రదీప్ ఆధ్వర్యంలోహైదరాబాద్ గాంధీ భవన్ లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. సందర్భంగా మాట్లాడుతూ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు సరైన గుర్తింపు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. భువనగిరి కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ ,బడుగు ,బలహీన వర్గాలు , మైనార్టీ వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ కడుపులో పెట్టుకుని చూసుకుంటుందని వాళ్ల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 500 కే వంట గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం, 10 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేసుకోవడం కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ ఎంపిటిసి, జెడ్పిటిసి ,కార్పొరేషన్, మున్సిపాలిటలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగర వెయ్యడం కోసం ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికులుగా పనిచేసే కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు .భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీని చేసేంతవరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ కోసం పని చేస్తూ నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారం కోసం కృషి చేయాలని అలాగే కాంగ్రెస్ పార్టీ పై బిజెపి పార్టీ అబద్దాల సోషల్ మీడియా ద్వారా చేస్తున్న ప్రచారాలను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కోరారు. బిజెపి పార్టీకి సరైన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, వడిచర్ల శరత్ యాదవ్ ,దాసరి మధు, ప్రభాకర్ ,సాయి తదితరులు పాల్గొనడం జరిగింది.

# నేడు (నిమజ్జనం సందర్భంగా) మద్యం అమ్మకాలు బంద్

**నేడే గణేష్ విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం**

**మద్యం దుకాణాలు తెరిస్తే చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు**

**ఎస్. శ్రీనివాస్ ఎక్సైజ్ శాఖ సీఐ..**



**దేవరకొండ,సెప్టెంబర్15 (జనంసాక్షి):**
నేడు గణేష్ విగ్రహాల శోభయాత్ర, నిమజ్జన కార్యక్రమం వున్న నేపథ్యంలో మద్యం విక్రయాలను నిలిపివేయాలి అని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్. శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేసారు. 16 నాడు ఉదయం 6:00 గంటల నుండి మరుసటి రోజు 17 ఉదయం 6:00 గంటల వరకు వైన్ షాపులు, మద్యం సరఫరా చేసే బార్ & రెస్టారెంట్లు, క్లబ్‌లు, హొటళ్ళు మూసివేయాలని,గణేష్ విగ్రహాల నిమజ్జనాన్ని పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించేందుకు మద్యం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు తెరిస్తే చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# సీతారాములకు జాతీయ అవార్డు



**ఖమ్మం, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):**
విజయవాడ బాలోత్సవ భవన్లో తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక ఆధ్వర్యంలో, ఆదివారం ఖమ్మం రూరల్ టీఎన్జీవో కాలనీకి చెందిన, కోమాకుల సీతారాములు కు జ్ఞాన బుద్ధ పౌర్ణమ జాతీయ పురస్కారాన్ని పూర్వ నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు, గుర్రం జాషువా వారసురాలు అమృత పూరి రేవతి, ఝాన్సీ లక్ష్మీబాయి వారసురాలు శాంతాబాయి, చేతుల మీదుగా "జాతీయ పురస్కారాన్ని అందజేశారు, తెలుగు సాహిత్యం కళలు సాంస్కృతిక రంగాలలో, విశిష్టమైన కృషి చేస్తున్నందుకు ఈ అవార్డు అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు జాతీయ చైర్మన్ తెలుగు వెలుగు సాహితీ వేదిక బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమార్ తెలిపారు.

# సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

**కమ్యూనిస్టులు పోరాటంతోనే నైజాం చెర నుండి విముక్తి**

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి**

**ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు**



**చందంపేట సెప్టెంబర్ 16(జనం సాక్షి)**
నైజాంను తరిమికొట్టి ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అందించినది కమ్యూనిస్టులు చేసిన తెలంగాణ సాయుధ పోరాటము వలనేనని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు..ఈ నెల 11 నుండి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా 3వ రోజు సిపిఐ చందంపేట మండల సమితి ఆధ్వర్యంలో మూడుదండ్ల గ్రామంలో ర్యాలీ,సభ నిర్వహించి ప్రారంభమై మండల వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయుధ పోరాట యోధుల విగ్రహాలకు, ప్రజా పోరాటంలో భాగస్వాములైన అమరుల స్మారక స్తూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సాయుధ పోరాట వారోత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొని దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నాటి నైజాం వ్యతిరేక పోరాటంలో బిజెపి పాత్రే లేదని అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవంపై కేంద్రం, ప్రభుత్వం కపట నాటకము ఆడుతున్నదని విమర్శించారు. ఈ నెల 17న విమోచన దినోత్సవం పేరిట బీజేపీ చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్యపెట్టెందుకేనని అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని, ట్యాంక్ బండ్ పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన ప్రభుత్వం ఎందుకు ఆ హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న అన్ని జిల్లా కేంద్రాలలో జాతీయ జెండాలు ఎగురవేయాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ నైజాం పై పోరాటాన్ని హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తున్నదని అన్నారు. నాటి పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏ మాత్రం లేదని, సాయుధ పోరాటానికి వారసులు ఒక్క కమ్యూనిస్టులేనని అన్నారు. భూస్వాములకు, దోపిడీ దారులకు నైజాం సర్కారు అండగా ఉండడం వల్లనే నైజాం సర్కారు పై సాయుధ పోరాటానికి సిపిఐ పిలుపునిచ్చిందన్నారు. ఆ పోరాటంలో తెలంగాణలో పది లక్షల ఎకరాల భూమి పంచబడిందని, వేల గ్రామాలను విముక్తి చేయడం జరిగిందని చెప్పారు. నాటి పోరాటంలో దొడ్డి కొమరయ్య మొదలుకొని నాలుగున్నర వేల మంది వీరులు అమరులయ్యారని, నేడు తెలంగాణలో గ్రామ గ్రామాన నాటి నెత్తుటి ఆనవాళ్ళు ఉన్నాయని అన్నారు. బీజేపీ కు తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా , గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ ,మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య,జిల్లా కౌన్సిల్ సభ్యులు దేపా సుదర్శన్ రెడ్డి,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి మైనుద్దీన్, శ్రీరామదాసు కనకాచారి,రామస్వామి, %గూ×గాఖీ% జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, %ఎ%.పాండు పాండురంగారెడ్డి, బొమ్ము అచ్చయ్య, పల్లా రంగారెడ్డి,నాగవరం వెంకటేశ్వర్ రావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు కన్నం లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య, రవి,సిపిఐ మండల సహాయ కార్యదర్శి, మొగిల్ల వెంగళయ్య,పీ జనార్దన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, హనుమంతు,జూలూరి మహేష్,కృష్ణయ్య, రామాంజనేయులు,కౌన్సిల్ సభ్యులు,శాఖా కార్యదర్శులు,వివిధ ప్రజా సంఘల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కనిగిరి గుట్టల్లో కలియ తిరిగిన కలెక్టర్

**• కాలినడకన వీరభద్రుడి దర్శనం**

**• ఆకర్షించిన అడవి అందాలు, టూరిజం హబ్ వైపు ఆలోచనలు**

**• బాంబో క్లస్టర్ సందర్శన**



**చంద్రుగొండ,సెప్టెంబర్15 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చంద్రుగొండ మండల పరిధిలోని కనిగిరి గుట్టలలో ఆదివారం కలియ తిరిగారు. ఆసక్తికర అడవి అందాలను ఆస్వాదించారు. తొలుత హస్తాల వీరన్న ఆలయాన్ని దర్శించుకున్న కలెక్టర్ కాలినడకన గుట్టపైకెక్కి ప్రాచీన వీరభద్రుని ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రాముఖ్యత, పురాతన కట్టడాలు, వాటి విశిష్టతను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఏనుగుల మోటబావి, పల్లేరు బావి, ఫారెస్ట్ వాచ్ టవర్, గుట్టలకు ఆనుకొని ఉన్న గ్రామాలు వాటి వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు. ఆహ్లాదాన్ని పంచే ప్రకృతి అందాలను తిలకించి టూరిజం హబ్ వైపు ఆలోచన చేశారు. అడవి సంపద, పురాతన చరిత్రను ముందు తరాల వారికి తెలిసేలా చేస్తున్న గిరిజనుల కృషిని అభినందించారు. బెండలపాడు అడవి ప్రాంతాన్ని దేశంలోనే సుందరమైన ప్రదేశంగా అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం బాంబో క్లస్టర్ ను సందర్శించి, గిరిజనులు తయారుచేసిన ఆకర్షణీయమైన వస్తువులను తిలకించారు. మరింత అద్భుతమైన వస్తువులు తయారుచేసి ఇతర దేశాలకు పంపించే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆదివాసీల ఎదుగుదలకు, వారి కలలను బయట ప్రపంచానికి తెలియజేసేలా ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. ఆయన వెంట మండల అధికారులు ఎంపీడీవో అశోక్, ఎస్సై స్వప్న, బాంబో క్లస్టర్ చైర్మన్ మీసం నాగభూషణం, వైస్ చైర్మన్ మల్లం కృష్ణయ్య, వీరభద్రుడి ఆలయ కమిటీ సభ్యులు బొర్రా సురేష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 75వేలకు చేరువలో పసిడి



హైదరాబాద్, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) : బంగారం ధరలు మరింత ప్రియమయ్యాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం ధర రూ.440 అధికమై రూ.74,890కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.74,450గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.400 ఎగబాకి రూ.68,250 నుంచి రూ.68,650కి చేరుకున్నది. వెండి లక్ష రూపాయల దిశగా పయనిస్తున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.2,000 అధికమై రూ.97 వేలకు చేరుకున్నది. గడిచిన నాలుగు రోజుల్లో బంగారం రూ.2,500 వరకు, వెండి రూ.8 వేల వరకు పెరిగింది.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 472 | ₹ 56 |
| వరంగల్ | ₹ 472 | ₹56 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

| | |
|---|---|
| ₹72,870 (24 క్యారెట్లు) | ₹66,800 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹66,800 (22 క్యారెట్లు) | ₹72,870 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 89,500

# కొత్త ఐపీవోల జాతర




**ముంబై, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** ఐపీఓల సీజన్ మళ్లీ వచ్చింది. ఈసారి సెప్టెంబర్ 16 నుంచి ప్రారంభమయ్యే వారంలో 7 కొత్త ఐపీవోలు మొదలుకానున్నాయి. మెయిన్‌బోర్డ్ విభాగం నుంచి రెండు వస్తుండగా, కొత్త వారంలో ఇప్పటికే ప్రారంభించిన 5 ఐపీవోలలో డబ్బును పెట్టుబడి పెట్టడానికి అవకాశం ఉంది.

దేశీయ స్టాక్ మార్కెట్లో మళ్లీ ఐపీఓల వారం రానే వచ్చింది. ఈసారి సెప్టెంబర్ 16 నుంచి ప్రారంభమయ్యే వారంలో 7 కొత్త ఐపీవోలు మొదలుకానున్నాయి. మెయిన్‌బోర్డ్ విభాగం నుంచి రెండు వస్తుండగా, కొత్త వారంలో ఇప్పటికే ప్రారంభించిన 5 ఐపీవోల్లో డబ్బును పెట్టుబడి పెట్టడానికి అవకాశం ఉంది. మెయిన్‌బోర్డ్ విభాగంలో, ఆర్కేడ్ డెవలపర్లు, నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్ ఐపీవోలు సెప్టెంబర్ 16న ప్రారంభమవుతాయి. రాబోయే వారంలో 13 కంపెనీల షేర్లు లిస్ట్ కానున్నాయి. వీటిలో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తో సహా 4 కంపెనీలు మెయిన్‌బోర్డ్ విభాగానికి చెందినవి. ఈ నేపథ్యంలో కొత్త వారంలో ఏయే కంపెనీలు ఐపీవోను ప్రారంభిస్తున్నాయో తెలుసుకుందాం.

**పెలాట్రో ఐపీవో:** ఈ ఇష్యూని ఒక్కో షేరుకు రూ. 190-200 ధరలో నిర్ణయించారు. 600 షేర్ల లాట్ సైజు అందుబాటులో ఉంటుంది. ఈ ఐపీవో సెప్టెంబర్ 16న ప్రారంభమై, సెప్టెంబర్ 19న ముగుస్తుంది. రూ. 55.98 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. సెప్టెంబర్ 24న ఎన్ ఎస్ఈ, ఎస్ ఎంఈలో షేర్ల లిస్టింగ్ జరగవచ్చు.

**నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్ ఐపీవో:** ఇది సెప్టెంబర్ 16 నుంచి మొదలు కానుండగా, సెప్టెంబర్ 19న ముగియనుంది. రూ.777 కోట్ల పబ్లిక్ ఇష్యూకు వేలం జరగనుంది. బీఎస్ఈ, ఎన్ ఎస్ఈలో షేర్ల లిస్టింగ్ సెప్టెంబర్ 24న ఉంటుంది. ఒక్కో షేరు ధర రూ. 249-263. లాట్ పరిమాణం 57 షేర్లు.

**ఓసెల్ డివైజెస్ ఐపీవో:** ఈ కంపెనీ రూ.70.66 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ ఇష్యూ కూడా సెప్టెంబర్ 16న తెరవబడి, సెప్టెంబర్ 19న ముగుస్తుంది. ఈ షేర్లు సెప్టెంబర్ 24న ఎన్ ఎస్ఈ, ఎస్ ఎంఈలో లిస్ట్ కావచ్చు. బిడ్డింగ్ కోసం ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 155-160. లాట్ పరిమాణం 800 షేర్లు.

**ఆర్కేడ్ డెవలపర్స్ ఐపీవో:** ఇష్యూ పరిమాణం రూ. 410 కోట్లు. ఈ ఐపీవో సెప్టెంబర్ 16న ప్రారంభమై, సెప్టెంబర్ 19న ముగుస్తుంది. దీని బిడ్డింగ్ కోసం ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 121-128. లాట్ పరిమాణం 110 షేర్లు. షేర్లు సెప్టెంబర్ 24న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ కానున్నాయి.

**పారామౌంట్ స్పెషాలిటీ ఫోర్జింగ్స్ ఐపీవో:** ఇది సెప్టెంబర్ 17న తెరవబడి, సెప్టెంబర్ 19న ముగుస్తుంది. రూ. 32.34 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఈ ఐపీవో కోసం ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 57-59. లాట్ పరిమాణం 2000 షేర్లు. ఇష్యూ ముగిసిన తర్వాత షేర్లు సెప్టెంబర్ 24న ఎన్ ఎస్ఈ, ఎస్ ఎంఈలో లిస్ట్ చేయబడతాయి.

**బైక్‌వో గ్రీన్‌టెక్ ఐపీవో :** రూ. 24.09 కోట్ల ఈ ఇష్యూకి ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 59-62. లాట్ పరిమాణం 2000 షేర్లు. ఈ ఐపీఓ సెప్టెంబర్ 18న ప్రారంభమై, సెప్టెంబర్ 20న ముగుస్తుంది. షేర్ల లిస్టింగ్ సెప్టెంబర్ 25న ఎన్ ఎస్ఈ, ఎస్ ఎంఈలో జరుగుతుంది.

**ఎస్‌డీ రిటైల్ లోగో ఐపీఓ :** ఇది సెప్టెంబర్ 20న తెరవబడి, సెప్టెంబర్ 24న ముగుస్తుంది. సెప్టెంబర్ 27న ఎన్ఎస్ఈ ఎస్ఎంఈలో ఈ షేర్లు లిస్ట్ చేయబడతాయి. ఈ ఐపీఓ నుంచి రూ.64.98 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 124-131. లాట్ పరిమాణం 1000 షేర్లు.

సోధాని అకాడమీ ఆఫ్ ఫిన్‌టెక్ ఎనేబుల్స్, పాపులర్ ఫౌండేషన్స్, డెక్కన్ ట్రాన్స్‌కాన్ లీజింగ్, వెస్టర్న్ క్యారియర్స్, పీఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్, ఎన్విరోటెక్ సిస్టమ్స్ ఐపీఓలు ఇప్పటికే మొదలుకాగా, వచ్చే వారం ముగియనున్నాయి. మరోవైపు బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్ల లిస్టింగ్ సెప్టెంబర్ 16న సోమవారం జరగనుంది.

విపణి

## ఇక అహ్మదాబాద్‌లోనూ
# లులూ మాల్




**అహ్మదాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల పలు రాజకీయ ఆరోపణలకు కారణమైన లులూ మాల్ పేరు మరోసారి తెరపైకి వచ్చింది. అయితే ఈసారి పొలిటికల్ రంగుతో కాదు. ఇప్పటికే హైదరాబాద్‌లో అతిపెద్ద మాల్ ద్వారా భాగ్యనగరవాసులకు సేవలందిస్తున్న సదరు సంస్థ.. దేశవ్యాప్తంగా మరింత విస్తరిస్తోంది. ఇండియాలో అతిపెద్ద మాల్‌ను ప్రారంభించింది. కేరళకు చెందిన వ్యాపారవేత్త, ఎమిరాటీ బేస్డ్ బహుళజాతి సమ్మేళనం లులూ గ్రూప్ ఇంటర్నేషనల్ ఛైర్మన్ ఎంఏ యూసఫ్ అలీ కీలక ప్రకటన చేశారు. అహ్మదాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద షాపింగ్ మాల్‌ను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముంబైలోని యూఏఈ-ఇండియా బిజినెస్ ఫోరమ్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. 'అబుదాబి యువరాజు చారిత్రాత్మక పర్యటన భారతదేశం యూఏఈ వ్యాపారవేత్తలు తమ బిజినెస్‌లు మెరుగుపరచుకోవడానికి మరియు సహకరించుకోవడానికి ఒక గొప్ప అవకాశం. క్రౌన్ ప్రిన్స్, పీఎం నరేంద్ర మోదీ సోదర భావంతో మెలుగుతున్నారు. మేము భారత్‌లో ఇప్పటికే గణనీయమైన పెట్టుబడులు పెట్టాము. ప్రస్తుత వాతావరణం కూడా చాలా అనుకూలంగా ఉంది. త్వరలోనే అహ్మదాబాద్‌లో ఇండియాలో అతిపెద్ద షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తాము' అని స్పష్టం చేశారు.

4 వేల కోట్లతో భారత్‌లో అతిపెద్ద లులూ మాల్ ఏర్పాటు చేయనున్నట్లు గతేడాది అలీ వెల్లడించారు. హైదరాబాద్‌లో 300 కోట్లతో నిర్మించిన మాల్ వల్ల దాదాపు 2 వేల మంది ఉపాధి పొందుతున్నారు. కాగా ఇప్పుడు అహ్మదాబాద్ మాల్ ద్వారా కనీసం 4 వేల మంది యువతకు జాబ్స్ వస్తాయని అంచనా. వీటితో పాటు రానున్న రోజుల్లో కాశ్మీర్ మరియు నోయిడాలో ఫుడ్ ప్రాసెసింగ్‌తో సహా ఇతర రంగాలలోకి సైతం విస్తరించాలని లులూ గ్రూప్ చూస్తోందని యూసఫ్ అలీ తెలిపారు.

జాతీయం అంతర్జాతీయం

# పెరిగిన కూరగాయల ధరలతో బెంబేలు

- వెల్లుల్లి కిలో రూ.500..! పచ్చిమిర్చి కిలో రూ120



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** ఇటీవల కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గడిచిన 24రోజుల్లో ధరలు రెండింతలు పెరిగాయి. వెల్లుల్లి కిలో రూ.500కి ఎగిసింది. మరో వైపు మిర్చి కిలో రూ.120కి చేరింది. కొత్తిమీర, క్యాబేజీ, ఉల్లి, బెండకాయలు, అల్లం, బంగాళాదుంప, టమాట, దోసకాయ కూరగాయలు ధరలు భారీగానే పెరిగాయి. ధరల పెరుగుదలతో సామాన్యుడి జేబుపై భారీగానే ప్రభావం పడుతున్నది. ఇటీవల దేశవ్యాప్తంగా పలుప్రాంతాల్లో భారీ దంచికొట్టాయి. వరదలకు పంట చేలన్నీ నీటమునిగాయి. దీంతో కూరగాయలన్నీ పాడైపోతున్నాయి. దీంతో మార్కెట్‌లకు కూరగాయలు రావడం భారీగా తగ్గింది. దిగుబడి తక్కువగా ఉండడం.. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ధరలు భారీగా ఉన్నాయని గ్రేటర్ నోయిడాలోని సెక్టార్‌కు చెందిన వ్యాపారి సంజయ్ ఖాన్ తెలిపారు. కూరగాయల ధరలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు తక్కువగా కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. క్యాలీఫ్లవర్ రూ.200, పచ్చిమిర్చి రూ.120, బంగాళదుంప రూ.40, టమాటా రూ.50, దోసకాయ రూ.50, పొట్లకాయ రూ.40 చొప్పున విక్రయిస్తున్నట్లు వ్యాపారి పేర్కొన్నారు. అదే సమయంలో ఉల్లి రూ.60, బెండకాయ రూ.80, అల్లం రూ.160, బెండకాయ కిలో రూ.50 నుంచి 60 వరకు విక్రయిస్తున్నట్లు తుగ్లక్‌పూర్ కూరగాయల మార్కెట్ విక్రయదారు రమేశ్ పేర్కొన్నారు. ఘజియాబాద్ నుంచి తుగ్లక్‌పూర్ మార్కెట్‌కు కూరగయాలు తీసుకువస్తుంటారు. ప్రస్తుతం రవాణా తగ్గడంతో ధరలపై ప్రభావం చూపుతున్నది. ఎంత దూరం నుంచి కూరగాయలు వస్తాయో.. రవాణా ఖర్చు కూడా అంత ఎక్కువగా ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మూడు రోజుల కిందట కిలో వెల్లుల్లి ధర రూ.400 ఉండగా, ఆదివారం కిలో వెల్లుల్లి ధర రూ.500కి చేరింది. ఒకేరోజు రూ.100 పెరిగింది. క్యాలీఫ్లవర్ మూడు రోజుల కిందట కిలో రూ.150 పలికింది. ఆదివారం కిలో రూ.200కి చేరింది. అలాగే మిగతా కూరగాయల మూడురోజుల్లోనే భారీగా పెరిగాయి. దీంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.

# హైతీలో భారీ అగ్ని ప్రమాదం..

- ఇంధన ట్యాంకర్ పేలి 25 మంది దుర్మరణం



**పోర్ట్ అయూ ప్రిన్స్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** హైతీ దేశంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇంధన ట్యాంకర్ పేలడంతో 25 మంది మృతి చెందారు. మరో 40 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పెట్రోల్ ట్యాంకర్ అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో.. స్థానికులు పెద్ద సంఖ్యలో ఆ పెట్రలో కోసం ఎగబడ్డారు. దాంతో ఒక్కసారిగా పెట్రోల్‌కు మంటలు అంటుకుని పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దాంతో కొన్ని నిమిషాల్లోనే ఘోరం జరిగింది. కాగా హైతీ తాత్కాలిక ప్రధాని గ్యారీ కొనిల్ ఘటనా ప్రాంతాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు.

# మరోసారి రష్యా డ్రోన్ల దాడి

**మాస్కో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** రష్యా మరోసారి భారీస్థాయిలో డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ దాడికి ప్రతిగా ఉక్రెయిన్ కూడా దీటుగా బదులిచ్చింది. తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో దాదాపు 72-76 డ్రోన్లను కూల్చివేసింది. ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. తమ దేశ పౌరులను లక్ష్యంగా చేసుకొని రష్యా దాడులకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత మంగళవారం కూడా రష్యా దాదాపు 140 డ్రోన్లతో దాడి చేసింది.

# దూసుకొస్తున్న భారీ గ్రహ శకలం..

- 17న భూమికి చేరువగా '2024 ఆన్'



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** మానవాళిని ఓ భారీ గ్రహ శకలం (ఆస్టరాయిడ్) భయపెడు తున్నది. ఆకాశ హర్మ్యం అంత పరిమాణంలో ఉన్న ఈ గ్రహశకలం ఈ నెల 17న భూగోళాన్ని దాటుకుని వెళ్తుందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ప్రకటించింది. 721 నుంచి 1,575 అడుగుల (220-480 మీటర్ల) చుట్టుకొలతతో ఉన్న ఈ గ్రహశకలానికి '2024 ఆన్' అని నామకరణం చేశారు. ప్రస్తుతం ఈ ఆస్టరా యిడ్ గంటకు 19,842 మైళ్ల (31,933 కి.మీ.) వేగంతో ప్రయాణిస్తున్నదని, ఇది ధ్వని వేగం కంటే 26 రెట్లు అధికమని 'లైవ్ సైన్స్' వెల్లడించింది.

ఈ గ్రహ శకలం భూగోళానికి దాదాపు 62 వేల మైళ్ల (లక్ష కిలోమీటర్ల) చేరువగా రానున్నది. ఇది భూమికి, చంద్రునికి మధ్య ఉన్న సగటు దూరం కంటే 2.6 రెట్లు ఎక్కువ. ఈ ఆస్టరాయిడ్ భూమిని ఢీ కొనబోదని, మానవాళి భద్రతకు ఎలాంటి ముప్పు కలిగించబోదని శాస్త్రవేత్తలు తెలిపారు. నాసా నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం భూగోళానికి 12 కోట్ల మైళ్ల (19.3 కోట్ల కిలోమీటర్ల) చేరువగా వచ్చిన ఖగోళ వస్తువులను భూమికి సమీపంగా వచ్చిన వస్తువులుగా, 46.5 లక్షల మైళ్ల (75 లక్షల కిలోమీటర్ల) చేరువగా వచ్చే పెద్ద వస్తువులను ప్రమాదకరమైనవిగా పరిగణిస్తారు.

# కుప్పకూలిన మూడంతస్తుల భవనం..

- 10 మంది సజీవసమాధి



**లక్నో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో తీవ్ర విషాదం నెలకొంది. మూడంతస్తుల భవనం కూలి ఆరుగురు చిన్నారులు సహా పదిమంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. స్థానిక జకీర్ కాలనీలో ఉన్న ఈ భవనం 50 ఏళ్లనాటిది. శిథిల పరిస్థితుల్లో ఉన్న భవనం గత సాయంత్రం ఒక్కసారిగా కుప్పకూ లింది. భవనం కింద ఓ డైరీ ఫామ్ నిర్వహి స్తున్నారు. ఈ ఘటనలో ఒక కుటుంబం మొత్తం సమాధి అయిపోయింది. కొన్ని పశువులు మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాలు, స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఒక పక్క వర్షం పడుతుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. స్థానిక వలంటీర్లు కూడా సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. అర్ధరాత్రి 2 గంటల వరకు శిథిలాలు తొలగించగా, ఈ ఉదయం మళ్లీ ప్రారంభమయ్యాయి. కూలిన భవనం ఇరుకు ప్రదేశంలో ఉండడంతో బుల్డోజర్లు అక్కడి వెళ్లలేకపోతున్నాయని పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించామని, వారి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతులను ఒకే కుటుంబానికి చెందిన నఫీసా (63), ఫర్హానా (20), అలీసా (18), సాజిద్ (40), సానియా (15), సాఖిబ్ (11), సిమ్రన్ (15 నెలలు), ఆలియా (6), రిజా (7), రిమ్సా (5 నెలలు) గా గుర్తించారు. భవనం కూలిన ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# చేతబడి అనుమానంతో ఐదుగురి హత్య

**రాయ్‌పూర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ఈ రోజుల్లోనూ చేతబడి వంటి మూఢనమ్మకాలు తొలగిపోలేదు. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్షుద్ర ఆచారాలకు ఎంతోమంది బలవుతున్నారు. తాజాగా, చేతబడి చేస్తున్నారనే అనుమానంతో ఐదుగురు హత్యకు గురయ్యారు. ఛత్తీస్ గఢ్ లోని సుక్మా జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. మృతులు అందరూ ఒకే కుటుంబానికి చెందినవారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. సుక్మా జిల్లాలోని కుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇట్కల్ గ్రామం వద్ద ఈ ఘటన జరిగింది. చేతబడి వల్ల ఓ కుటుంబంలోని వ్యక్తి అనారోగ్యానికి గురయ్యాడన్న అనుమానంతో ఈ హత్యలు జరిగినట్టు తెలుస్తోంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# హర్యానా సీఎం రేసులో అనిల్ విజ్



**ఛండీఘర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** తాను పార్టీలో సీనియర్‌నని, రానున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తే తాను సీఎం రేసులో ఉంటానని సీనియర్ బీజేపీ నేత, మాజీ మంత్రి అనిల్ విజ్ స్పష్టం చేశారు. హర్యానా ప్రస్తుత సీఎం నయబ్ సింగ్ సైనీ పార్టీ సీఎం అభ్యర్థిగా బీజేపీ ఇప్పటికే ప్రకటించిన క్రమంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అనిల్ విజ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అనిల్ విజ్ ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తానిప్పటి వరకూ పార్టీ నుంచి ఏమీ కోరలేదని, కానీ ఇప్పుడు తన సీనియరిటీ ప్రకారం సీఎం పదవిని తాను కోరుతున్నానని చెప్పారు. హరియాణ ప్రజలు తనను కలిసేందుకు వస్తున్నారని, తన నియోజకవర్గమైన అంబాలా ప్రజలు సైతం సీనియర్ నేత అయిన మీరు అత్యున్నత పదవి చేపట్టాలని కోరుతున్నారని తెలిపారు. ప్రజల కోరిక మేరకు, తన సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని సీఎం పదవికి తనను పరిశీలించాలని ఈసారి తాను కోరతానని చెప్పారు.

పార్టీ నాయకత్వం తనకు హరియాణ సీఎం పదవి అప్పగిస్తే హరియాణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేస్తానని తెలిపారు. కాగా మనోహర్ లాల్ ఖట్టర్ రాజీనామా అనంతరం నయాబ్ సింగ్ సైనీ ప్రభుత్వం ఇటీవల కొలువుతీరిన క్రమంలో అనిల్ విజ్‌కు సైనీ క్యాబినెట్‌లో స్థానం దక్కని సంగతి తెలిసిందే. ఇక అనిల్ విజ్‌ను అంబాలా కంటోన్మెంట్ నుంచి బీజేపీ బరిలో దింపగా పార్టీ సీనియర్ నేతల సమక్షంలో ఈనెల 11న ఆయన నామినేషన్ దాఖలు చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 సెప్టెంబర్ 2024
తెలంగాణ

# ఆర్జీ -2 ఏరియాలో ఇంజనీర్స్ దినోత్సవ వేడుకలు



**యైటింక్లయిన్ కాలనీ సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :**
సింగరేణి ఆర్జీ-2 ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంజనీర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి.సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాల సమర్పించి 164వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మన భారత దేశం గర్వించే సివిల్ ఇంజినీర్ మన తెలుగు వాడైన మోక్షగుండం విశ్వేశ్వరయ్య 15.09.1861లో జన్మించారని గుర్తు చేసారు. తన క్రమశిక్షణ, నిబద్ధత, మేదస్సుతో ఎన్నో ఇంజనీరింగ్ అధ్భుతాలు సృష్టించి చరిత్రలో నిలిచిపోయారని, ఆయన సేవలు ఎక్కువగా మైసూర్ రాష్ట్రానికి అందించినా తెలుగునాట కూడ ఎన్నోగొప్ప ప్రతిష్టాత్మకమైన ఇంజనీరింగ్ నిర్మాణాలకు తన సహాయాన్ని అందించారని, ప్రఖ్యాత నౌకాయాన కేంద్రం విశాఖపట్టణం నిర్మాణంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. నేటి ప్రతి యువ ఇంజనీర్లు శ్రీ విశ్వేశ్వరయ్య జీవన ప్రస్థానాన్ని స్ఫూర్తిని పొంది కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహిస్తూ, కొత్త ఆవిష్కరణలను సమాజానికి అందించాలని ప్రముఖ ఇంజనిర్ పండితుడు ఐనటువంటి మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనిర్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని 1955లో భారత దేశపు అత్యున్నత పురస్కారామైన భారత రత్న అవార్డ్ లభించినదని, ఆయన ప్రజలకు చేసిన సేవలకుగాను బ్రిటిష్ ప్రభుత్వము తరుపున 5వ కింగ్ జార్జ్ నైట్ కమాండర్ అఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్ బిరుదునిచ్చి సత్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం పర్సనెల్ ఎస్. అనిల్ కుమార్ ఇఇ సివిల్ వినయ్ సాగర్, ప్రతాపగిరి రాజు, ఏంవిటిసి మేనేజర్ మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి వేడుకలు

- ఓసిఎం-1లో ఘనంగా ఇంజనీర్స్-డే వేడుకలు



**యైటింక్లయిన్ కాలనీ సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :**
భారత రత్న గ్రహీత, ప్రఖ్యాత ఇంజనీర్, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని పురస్కరించుకుని, "ఇంజనీర్స్-డే" వేడుకలను ఓసిఎం-1 కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓసిఎం1 ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్. రాధా కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాల వేసి ఆయన విశిష్టతను, కార్యదక్షతను, భారత దేశానికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఆయన నిర్మించిన హైదరాబాద్ డ్రైనేజి వ్యవస్థ ఒక అద్భుతమని, ఆ రోజుల్లోనే సుందరమైన ఎన్నో నగర నిర్మాణాలకు ఆయన వేసిన పునాదియే కారణమని కొనియాడారు. శబ్దంతోనే యంత్రం యొక్క పనితనాన్నే కాకుండా, ప్రమాదాలని కూడా గుర్తించగల గొప్ప మేధావి అని కొనియాడారు. ఆయన స్ఫూర్తి తో సింగరేణిలో మనం చేసి ఇన్నోవేషన్స్ అండ్ అడ్వాన్స్ టెక్నాలజీతో ఎంతో పురోగతి సాధించామన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ... సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నిరాడంబరత, రాజనీతి, చిత్తశుద్ధి, దూరదృష్టి, సమయపాలన, అంకిత భావం ఎంతో మందికి సూర్తిదాయకమని తెలియజేశారు. స్వాతంత్ర్యా నంతరం, గత 75 సంవత్సరాలలో భారత దేశం శాస్త్ర, సాంకేతిక, నిర్మాణ, మౌలిక వసతుల కల్పనలో, రక్షణ, అంతరిక్ష రంగాలలో శరవేగంగా పురోగాభివృద్ధి సాధించి ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయంగా నిలిచింది. దీనిలో ఇంజనీర్ల పాత్ర అమోఘమని తెలియజేశారు. "ఇంజనీర్స్ డే" సందర్భంగా ఓసి 1 లో ఉత్తమ సేవలను అందిస్తున్నందుకుగాను అడిషనల్ మేనేజర్ కోటయ్యని, డివైఎస్ఈ ఐ. శ్రీనివాస్ ని శాలువా, ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్ హరిజన్, డిజిఎంలు కాశి విశ్వేశ్వర రావు, ఉదయ భాస్కర్, ఎస్ఈ జ్ఞానేశ్వర్, జివి సత్యనారాయణ, కాలరీ ఇంజనీర్ నజీర్ అహ్మాద్, సేఫ్టీ ఆఫీసర్ పి. శ్రీనివాసరావు, డివైపిఎం సునిల్ ప్రసాద్, సంక్షేమ అధికారి సాయికృష్ణ ఇతర మైనింగ్, ఈఅండ్ఎం అధికారులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటియుసి కృషి..

- స్ట్రక్చర్ సమావేశాల్లో సమస్యలను లేవనెత్తుతాం..
- ఎఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్అలీ..



**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అనుబంధంగా ఉన్న సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కృషి చేస్తుందని, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నామని కార్మికుల వద్దకు వచ్చే కొంత మంది నాయకుల పట్ల కాంట్రాక్టు కార్మికులు జాగ్రత్తగా ఉండాలని, ఎవరిని గుడ్డిగా నమ్మవద్దని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్అలీ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ-వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం పేర్కొన్నారు.ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్లో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం గా ఉన్న ఏఐటియుసి కాంట్రాక్టు కార్మికులకు చెందిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రికి, సింగరేణి సి అండ్ ఎం డికి సిపిఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ద్వారా వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, జీ.ఓ.22 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని, సి.ఎం.పి.ఎఫ్ చిట్టీలు ఇవ్వాలని, వారికి రక్షణ పరికరాలు అందించాలని తదితర హక్కుల కోసం యాజమాన్యంతో పోరాడుతున్నామని వారు తెలిపారు.యాజమాన్యం స్ట్రక్చర్ సమావేశం ఏర్పాటు చేయగానే అందులో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను లేవనెత్తుతామన్నారు.సింగరేణి లో పని చేస్తున్న మహిళా కార్మికులను మెడికల్ టెస్ట్ల గురించి ఏఐటియుసి యాజమాన్యంతో మాట్లాడి నిలిపి వేయడం జరిగిందని వారు తెలిపారు.గతంలో కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ పేరున అనుభవం లేని నాయకులు 18 రోజులు సమ్మె చేయించి ఎలాంటి ఒప్పందం లేకుండానే కార్మికులకు వేతన నష్టం కల్గించారని వారు తెలిపారు.సమ్మె విషయంలో సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రాతినిధ్యం వహించి కాంట్రాక్టు కార్మికులకు ఇంకా నష్టం జరుగకుండా అధికారులతో మాట్లాడి సమ్మె విరమింపచేశారని వారన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం తో మాట్లాడి సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి కృషి చేస్తుందని వారు తెలిపారు.ఈ సమావేశంలో సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్, నాయకులు ఇప్పకాయల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# తోటి మిత్రుడికి ఆర్థిక చేయూత..

**యైటింక్లయిన్ కాలనీ సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :**
పదవ తరగతి 1993-94 బ్యాచ్ సెక్టార్-3 సింగరేణి పాఠశాల పూర్వ విద్యార్థులు మరొకసారి తమ మిత్రుడి కొరకు ఆపన్న హస్తం అందించారు. 30 సంవత్సరాల క్రితం తమతో చదువుకున్న తమ మిత్రుడైన మెహబూబ్ అలీ డయాబెటిక్ వ్యాధి కారణంగా పూర్తి చూపు కోల్పోయి ఆర్థిక పరిస్థితులు క్షీణించి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొని తమ మిత్రుడి కంటిచూపు ప్రయత్నాలను మెరుగుపరచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తమ వంతు సహాయంగా ఒక లక్ష అరవై మూడు వేల రూపాయలుచ ఆదివారం కాలనిలో ఓ ఫంక్షన్ హాలులో చెక్కు ద్వారా అందజేసినట్లు తోటి మిత్రులు తెలిపారు. ఈ సెక్టార్-3, 1993-94 ఎస్ఎస్సి బ్యాచ్ వారు గడిచిన 6 సంవత్సరాలలో తమ మిత్రులు చనిపోయిన ,ప్రమాదానికి గురైన, వారి పిల్లల ఉన్నత చదువుల కొరకు వివిధ సందర్భాలలో సుమారు 12 లక్షల రూపాయలు అందజేశామన్నారు. భవిష్యత్తులో కూడా ఎవరైనా తమ మిత్రులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లయితే వారిని ముందుండి ఆదుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు మొగిలి మురళి, మేరుగు రాజమౌళి, పుల్లా ప్రభాకర్ చెర్రపల్లి జయకర్, తాళ్లూరి శ్రీధర్, దేవదాసుచ కొత్వాల్ సురేష్, ప్రతాప్ ,రమేష్ ఏలియా, కనకరాజు, కరీం, సదయ్య పాల్గొన్నారు.

# ప్రపంచ ఆర్థిక అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలక..



**గోదావరిఖని, జనంసాక్షి :**
రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని లయన్స్ భవన్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్స్-డేను ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులు పి.మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 జనరల్ మేనేజర్ డి లలిత్కుమార్, జైపూర్ పవర్ ప్లాంట్ జిఎం ఎన్కే రాజశేఖర్, ఏడిఈ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, మినేష్ నారాయణటండన్ను శాలువాతో ఘనంగా సన్మానించి.. జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశ సాంకేతిక నీటిపారుదల వివిధ ప్రణాళిక బద్ధమైన రోడ్లు, బ్రిడ్జిలు తదితర నిర్మాణాలలో ఇంజనీర్ల పాత్రను ప్రపంచానికి పరిచయం చేశారన్నారు.నేడు దేశ, ప్రపంచ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ ముద్దసాని ప్రమోద్కుమార్రెడ్డి, సెక్రెటరీ వి.ఎల్లప్ప, ట్రెజరర్ పి.గోవర్ధన్ రెడ్డి, జోనల్ చైర్మన్ కే.రాజేందర్, మీల్స్ ఆన్ వీల్స్ కో-ఆర్డినేషన్ బంక రామస్వామి, సీనియర్ సభ్యులు తిలక్చక్రవర్తి, శరత్బాబు, పోకల ఆంజనేయులు, మనోజ్కుమార్ అగర్వాల్, లక్ష్మారెడ్డి, ముడుతనపల్లి సారయ్య, సుధాకర్, సత్యనారాయణ, పబ్బ వెంకటేశం బేనిగోపాల్త్రివేది, లక్కం బిక్షపతి, కోలేటి శ్రీనివాస్, దొమ్మేటి తిరుపతి రంగమ్మ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# బంగ్లాస్ ఏరియాలో గణనాధునికి గణపతి హెూమం, అన్నదానం






**యైటింక్లయిన్ కాలనీ సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :**
గణపతి నవరాత్రుల సందర్భంగా 8 ఇంక్లైన్ కాలనీ బంగ్లాస్ ఏరియాలో ఏర్పాటు చేసిన గణనాధుని పూజా కార్యక్రమాలలో బాగంగా ఆదివారం గణపతి హెూమం, అన్నదాన కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ దంపతులు ఎల్.వి సూర్యనారాయణ- మాలతి సూర్యనారాయణ స్వామి వారికి గణపతి హెూమము నిర్వహించారు.
అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి రామగుండం ఏంఎల్ఏ సతీమణి మనాలీ ఠాకూర్ రాజ్ సింగ్ ముఖ్య అతిధిగా హాజరై అన్నదాన కార్యక్రమానికి పూజా కార్యక్రమలు నిర్వహించి స్వయంగా భక్తులకు వడ్డించారు. ముందుగా వారు గణనాధునికీ పూజా కార్యక్రమాలు నివహించారు. గోవర్దనగిరి జగన్నాథ ఆచార్యులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా గణపతి హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ దంపతులు, జీఎం రెస్క్యూ కాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి దంపతులు, జీఎం ఎక్స్ప్లోజివ్ డి.భైధ్య, ఏసిఏంఓ డా.కిరణ్ రాజ్ దంపతులు, జీఎం డీజీఎం వర్క్షాప్ ఎర్రన్న, డీజీఎం ఐఇడీ మురళీకృష్ణ, పర్యావరణ అధికారి సురేష్ బాబు వకీల్ పల్లి గ్రూప్ ఇంజనీర్ బీ. చంద్రశేఖర్, ఏరియా సెక్యూరిటీ అధికారులు షరీఫ్ మహమ్మద్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి..

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు..



**గోదావరిఖని, జనంసాక్షి :**
గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓ పార్లమెంట్ సభ్యుడు ఫోన్ చేస్తే ఎత్తలేదని చీఫ్ మెడికల్ ఆఫీసర్ను ట్రాన్స్ఫర్ చేయడంతో భయపడిన అధికారులు పాలనా నిబంధనలను గాలికొదిలేసి ప్రజాప్రతినిధులు అడుగులకు మడుగులు ఒత్తడంతోనే పాలన సాగిస్తున్నారన్నారు.దీని ప్రభావం ఉత్పత్తి.. ఉత్పాదకత మీద పడడంతో పనులన్నీ అవుట్సోర్సింగ్కు అప్పజెప్పడం మొదలు పెట్టారని నరసింహా రావు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం మీద కూడా పడి యాజమాన్యం గుర్తింపు సంఘం మాట కూడా ఖాతరు చేయకుండా, సింగరేణి యాజమాన్యం కేవలం ముఖ్యమంత్రి చెబితేనే సమస్యలు పరిష్కారం అయ్యే స్థితికి నెట్టబడ్డాయని ఆయన తెలిపారు.ఫలితంగా కార్మికులలో కార్మిక సంఘాల పట్ల..చివరికి టీఆర్ఎస్ పార్టీ మీద కూడా పడి అసెంబ్లీ ఎన్నికలలో కోల్బెల్ట్ ఏరియా లోని అన్ని స్థానాల్లో టిఆర్ఎస్ ఓడిపోయిందన్నారు.ఈ పరిణామాలను ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సరిగా అర్థం చేసుకున్నట్టు కనబడటం లేదని అన్నారు.ప్రజాప్రతినిధులతో పాటు గుర్తింపు సంఘంపై అసంతృప్తి చెందడం వల్లే డైరెక్టర్ (పా)ను బాధ్యతల నుండి తప్పించామని చైర్మన్ పత్రికల ద్వారా తెలిపారని గుర్తు చేశారు.సింగరేణిలో పోతరాజులు మళ్లీ వస్తున్నాయనే ఆందోళన కార్మికులలో వ్యక్తం అవుతున్నదన్నారు.పాలసీ విధానాల వరకే ప్రభుత్వం పరిమితమైతే అది సింగరేణి పరిశ్రమ అభివృద్ధికి ఆరోగ్యకరమైన కార్మికుల ఉద్యమానికి కూడా మంచిదన్నారు. అలా కాకుండా రోజువారి పాలనలో కాంట్రాక్టర్లు.. ప్రజాప్రతినిధులు..పైరవీకారుల జోక్యం పెరిగితే గతంలో ఉన్న పరిస్థితి ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉన్నదని సిఐటియుగా మేము అభిప్రాయపడుతున్నామని తెలిపారు. ఇది పారిశ్రామిక సంబంధాలకు..ఉత్పత్తికి ఆటంకం కలిగి పరిశ్రమ మునుగడకు..కార్మిక శ్రేయస్సుకు మంచిది కాదని, ఈ విషయంలో కార్మిక వర్గం చైతన్యం కావాలని మంద నరసింహారావు కోరారు.

# గణేష్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ చర్యలు..

- నిఘా నిఘాలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర..
- నిమజ్జనోత్సవం జరిగే ప్రదేశాలను పరిశీలించిన సీపీ శ్రీనివాస్..



**గోదావరిఖని, జనంసాక్షి :**
గణేశ్ నవరాత్రులు ముగించుకొని రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్ పెద్దపల్లి వివిధ ప్రాంతాల వద్ద నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, ఎలాంటి అవాంచనియా సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రత, బందోబస్త్ ఏర్పాట్లు చేయడం జరిగిందని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు.ఆదివారం పెద్దపల్లి పట్టణం మినీ ట్యాంక్బండ్, సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని చెరువు, మంథని పట్టణంలోని గోదావరి వద్ద, గోదావరిఖని గోదావరి బ్రిడ్జ్ వద్ద నిమజ్జనం జరిగే ప్రదేశాలను, నిమజ్జన శోభయాత్ర జరిగే రూట్ను పోలీస్ కమీషనర్, పెద్దపల్లి డీసీపీ చేతన, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిమజ్జన సమయంలో పోలీసువారి సూచనలకు అనుగుణంగా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు నడుచుకొని ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యేలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, పోలీసు పికెట్లు, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మత్తు, ఫ్లడ్ లైట్లు, క్రేన్లు,మంచినీటి వసతి ఏర్పాటు చేశామని, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో గజ ఈతగాళ్ల అందుబాటులో ఉంటారన్నారు.ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేయడం జరిగింది అన్నారు.అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో గణేష్ నిమజ్జన ఊరేగింపు ఉంటుందన్నారు. నిమజ్జన శోభాయాత్ర రూట్, ట్రాఫిక్ డైవర్షన్లకుకి సంబందించిన రూట్ మ్యాప్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొదటిసారిగా నిమజ్జన శోభాయాత్ర కు సంబంధించి డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించడం జరుగుతుందని ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య ఏర్పడిన లేదా శోభాయాత్రలో వాహనాల మూమెంట్ను పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. గణేష్ ఉత్సవ కమిటీలు త్వరిత గతిన పూజలు ముగించి వెలుతురు ఉండగానే తమ విగ్రహాలను జాగ్రత్తగా తరలించాలని ఊరేగింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చిన్న పిల్లలు మహిళలు శోభ యాత్ర లో పాల్గొంటే ప్రమాదాలు జరగకుండా చూడాలని అలాగే ట్రాక్టర్ల, లారీల పై, ఇతర వాహనాలపై వచ్చే చిన్నారులు జాగ్రత్తగా ప్రయాణించాలని కాళ్లు చేతులు క్రిందకు వేలాడస్తు ప్రయాణం సాగించవద్దని పొరపాటున కాలుజారి పడిపోతే ప్రమాదం సంభవిస్తుందని అన్నారు. నిమజ్జనం సమయంలో, క్రేన్ సహాయంతో నిమజ్జనం చేసే సమయంలో యువత చిన్నారులు మహిళలు అప్రమత్తంగా ఉండాలని సహాయకులు అందుబాటులో ఉండాలని అన్నారు .నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు సమయంలో డీజేలు, బాణాసంచా కాల్చడం వంటివి నిషేధమని సూచించారు.

# నేడు రామగుండంలో 'వందేభారత్' ప్రారంభం..

- వర్చువల్గా ప్రారంభించనున్న ప్రధాని మోడీ..
- ఏర్పాట్లలో నిమగ్నమైన రైల్వే అధికారులు..



**గోదావరిఖని, జనంసాక్షి :**
వందేభారత్ ట్రైన్ సోమవారం రామగుండం రైల్వేస్టేషన్కు రానుంది.నాగపూర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ రామగుండం రైల్వేస్టేషన్లో ఆగనుంది.ఉదయం భారత ప్రధాని నరేంద్రమోదీ ఈ రైలును పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు.అదే రోజు 8.20 గంటలకు రామగుండం రైల్వేస్టేషన్కు వందేభారత్ రానుంది.ఈ ట్రైన్ సెకండ్ ప్లాటుఫారంలో ఆగనుంది.స్థానిక రైల్వే అధికారులు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రధాని ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు.మరుసటి రోజు నుంచి వందేభారత్ ప్రతిరోజు రెగ్యూలర్గా నాగపూర్ నుంచి సికింద్రాబాద్ వరకు ప్రయాణీకులను చేరవయనుంది.నాగపూర్లో ఉదయం 5 గంటలకు బయలుదేరగా 9.8 గంటలకు రామగుండం రైల్వేస్టేషన్కు చేరుకుంటుంది.మధ్యాహ్నం 12.15 నిమిషాలకు సికింద్రాబాద్ వరకు ఈ రైలు సేవలు అందుబాటులో ఉంటాయి. ఇప్పటికి ఈ రైలు తెలంగాణాలో రెండు రూట్లలో ప్రయాణికులకు సేవలు అందిస్తుంది.విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్, కాచిగూడ నుంచి తిరుపతికి సర్వీసు నడువనుంది.తాజాగా ఇప్పుడు సెంట్రల్ రైల్వే నాగపూర్ డివిజన్కు కేటాయించగా..మరోసారి భారత ప్రధాని ఈ రైలును ప్రారంభోత్సవం చేస్తున్నారు.వందేభారత్ రైలు రామగుండం రైల్వేస్టేషన్ నుంచి సికింద్రాబాకు కేవలం మూడు గంటల సమయంలోనే ప్రయాణికులు గమ్య స్థానానికి చేరుకుంటారు.ఈ రైలు చార్జీలను ఎగ్జిక్యూటీవ్ క్యాటగిరిలో నిర్ణయించారు. రామగుండం నుంచి సికింద్రాబాద్కు ఒక్కరికి రూ.765, వీఐపీ ఎగ్జిక్యూటివ్ క్యాటగిరిలో 1,420 చొప్పున టికెట్ చార్జీలు నిర్ణయించబడ్డాయి.

# టీపీసీసీ అధ్యక్షులు మహేష్కుమార్ను కలిసిన..
## టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ వరలక్ష్మీ..



**గోదావరిఖని, జనంసాక్షి :**
నూతనంగా తెలంగాణ పీసీసీ అధ్యక్షులుగా ఎన్నికైన మహేష్కుమార్గౌడ్ను టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ గడమల్ల వరలక్ష్మి కలిశారు.ఆదివారం గాంధీభవన్లో టీపీసీసీ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న బొమ్మ మహేష్కుమార్గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్గౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మ మహేష్కుమార్గౌడ్ గత 38 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తున్నారని వరలక్ష్మీ పేర్కొన్నారు.విద్యార్థి దశలో ఎన్ఎస్యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 1986లో నిజామాబాదు జిల్లా అధ్యక్షుడిగా, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశారని గుర్తు చేశారు.2013-14లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్గా పని చేశారని పేర్కొన్నారు.అనంతరం పీసీసీ కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా,2018లో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో కన్వీనర్గా, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, 2023లో కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యునిగా, జనవరి 2024లో శాసనమండలి సభ్యునిగా ,సెప్టెంబర్ 6, 2024లో నూతన టీపీసీసీకి సారధిగా నియమితుల య్యారన్నారు.బొమ్మ మహేష్కుమార్గౌడ్ అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని..భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆమె ఆకాంక్షించారు.

# చెన్నైలో దిగిన బంగ్లా క్రికెటర్లు..!

### విజయంపై ధీమాగా కెప్టెన్



టెస్టు, టీ20ల సిరీస్ కోసం బంగ్లాదేశ్ జట్టు భారత్‌లో అడుగు పెట్టింది. పాకిస్థాన్‌పై చారిత్రక విజయంతో జోరు మీదున్న బంగ్లా బృందం ఆదివారం ఢాకా విమానాశ్రయం చేరుకుంది. ఎయిర్‌పోర్ట్‌లో కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో, లిటన్ దాస్, ప్రధాన కోచ్ చండిక హుతురుసింగేలతో పాటు జట్టు సభ్యులు అభిమానులతో ఫొటోలు దిగారు. ఆ తర్వాత అంతా భాతర విమానం ఎక్కారు. సాయంత్రం కల్లా బంగ్లా జట్టు చెన్నైలో దిగింది. అక్కడి నుంచి టీమ్ హోటల్ చేరిన బంగ్లా క్రికెటర్లకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. స్వదేశంలో అల్లర్ల నేపథ్యలోనూ పాకిస్థాన్ గడ్డపై టెస్టు సిరీస్ గెలుపొందిన బంగ్లాదేశ్ విజయోత్సాహంతో భారత్‌కు వస్తోంది. తమ జట్టు సభ్యులు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఉన్నారని కెప్టెన్ శాంటో అన్నాడు. 'ఇండియాతో సిరీస్ మాకు సవాలే. కానీ, పాకిస్థాన్‌పై విజయం సాధించాం. ఇప్పుడు మా జట్టు సభ్యులలో, బంగ్లా ప్రజల్లో విజయం సాధిస్తామనే నమ్మకం పెరిగింది' అని మీడియా సమావేశంలో శాంటో వెల్లడించాడు. భారత్, బంగ్లాల మధ్య తొలి టెస్టు సెప్టెంబర్ 19న, అనంతరం కాన్పూర్‌లో సెప్టెంబర్ 27న రెండో టెస్టు జరుగనుంది. ఆ తర్వాత టీ20 సిరీస్‌లో ఇరుజట్లు తలపడనున్నాయి. అక్టోబర్ 3న గ్వాలియర్‌లో తొలి మ్యాచ్, అక్టోబర్ 9న ఢిల్లీలో రెండో టీ20, అక్టోబర్ 12న హైదరాబాద్‌లో మూడో టీ20 జరుగనున్నాయి.

### చరిత్ర సృష్టించింది

ఈ మధ్యే పాకిస్థాన్ పర్యటనలో నజ్ముల్ హుసేన్ శాంటో సారథ్యంలోని బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. పాకిస్థాన్‌పై టెస్టుల్లో తొలి విజయం నమోదు చేసి క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఆద్యంతం ఉత్కంఠ రేపిన రావల్పిండి టెస్టులో బంగ్లా 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ముష్ఫికర్ రహీమ్(191) సూపర్ సెంచరీకి.. మెహిదీ హసన్ మిరాజ్(77, 4/21) ఆల్‌రౌండ్ షో తోడవ్వడంతో పాకిస్థాన్‌కు ఓటమి తప్పలేదు. ఇక రెండో టెస్టులోనూ బంగ్లా పేసర్ల ధాటికి పాక్ ఆటగాళ్లు చేతులెత్తేశారు. దాంతో పాక్ గడ్డపై తొలిసారి బంగ్లాదేశ్ టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది. మరోవైపు.. దాదాపు ఏడాది విరామ తర్వాత టీమిండియా సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడుతోంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో అగ్రస్థానంలో ఉన్న రోహిత్ సేనకు ఈ సిరీస్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనుంది.

# ఐసీసీ అంపైర్‌గా తొలి పాకిస్థానీ

### ఎవరీ సలీమా ఇంతియాజ్ ?



పాకిస్థాన్‌కు చెందిన మాజీ మహిళా క్రికెటర్ సలీమా ఇంతియాజ్ చరిత్ర సృష్టించింది. ఐసీసీ అంపైర్ల ప్యానెల్‌కు నామినేట్ అయింది. దాంతో, ఈ ఘనత సాధించిన తొలి పాకిస్థాన్ మహిళా క్రికెటర్‌గా సలీమా రికార్డు నెలకొల్పింది. ఇకపై ఆమె అంతర్జాతీయ వేదికలపై మహిళల క్రికెట్ మ్యాచ్‌లో అంపైర్‌గా వ్యవహరించనుంది. తనకు ఈ గొప్ప అవకాశం దక్కడం పట్ల సలీమ సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సలీమాను అభినందిస్తూ ఎక్స్ వేదికగా ఓ వీడియో పోస్ట్ చేసింది. 'అంతర్జాతీయ మ్యాచుల్లో పాకిస్థాన్ ప్రతినిధిగా ఉండాలనే నా కల నెరవేరింది. ఇది నా ఒక్కదాని విజయం మాత్రమే కాదు అంపైర్ అవ్వాలనుకుంటున్న పాకిస్థాన్‌లోని ప్రతి మహిళా క్రికెటర్ విజయం. నేను సాధించిన ఈ ఘనత దేశంలోని అమ్మాయిల్లో స్ఫూర్తిని నింపి, వాళ్లు ఆటల్లో రాణించే విధంగా ఉపయోగపడుతుందని నా నమ్మకం' అని సలీమా చెప్పింది. అంతేకాదు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మహిళా అథ్లెట్లను, అధికారులను ప్రోత్సహిస్తుందని ఆమె వెల్లడించింది. తనకు ఇంతకుముందు ఆసియా క్రికెట్ కౌన్సిల్ నుంచి కూడా అంపైర్‌గా అవకాశాలు వచ్చాయని సలీమా చెప్పింది. మాజీ క్రికెటర్ అయిన సలీమా 2008లో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అంపైర్స్ ప్యానెల్‌లో చేరింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకన్న కూతురు కైనత్ క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకుంది. 2010లో అరంగేట్రం చేసిన కైనత్ ఇప్పటివరకూ 40 మ్యాచులు ఆడింది. వాటిలో 19 వన్డేలు, 21 టీ20లు ఉన్నాయి.

# టీ20లకు శుభ్‌మన్ గిల్ దూరం



భారత యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ టీ20 సిరీస్‌కు దూరం కానున్నాడు. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగనున్న పొట్టి సిరీస్‌కు గిల్ విశ్రాంతి తీసుకోనున్నాడు. అడడిపై పని భారత తగ్గించాలనే ఉద్దేశంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. టీమిండియా భావి కెప్టెన్‌గా పిలవబడుతున్న గిల్‌కు బ్రేక్ ఇవ్వడానికి కారణం ఉంది. అది ఏంటంటే..? బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల అనంతరం ఇరుజట్ల మధ్య పొట్టి సిరీస్ జరుగనుంది. అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 12 మధ్య మూడు వేదికల్లో మూడు టీ20 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. అయితే.. అక్టోబర్ 16వ తేదనే న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ మొదలవ్వనుంది. అందువల్ల గిల్‌పై పని ఒత్తిడి లేకుండా చూడాలని బీసీసీఐ భావించింది. బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌కు అతడికి విశ్రాంతి ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది. 'అవును.. బంగ్లాతో టీ20 సిరీస్‌లకు శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతి ఇస్తున్నాం. ఎందుకంటే తొలి మ్యాచ్ అక్టోబర్ 6న గ్వాలియర్‌లో, రెండో మ్యాచ్ అక్టోబర్ 9న ఢిల్లీలో, ఆఖరి మ్యాచ్ అక్టోబర్ 12వ తేదీన హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరుగనున్నాయి. మూడో టీ 20 ముగిసిన మూడు రోజులకే న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్. అందుకని ప్రయాణ బడలిక వంటి సమస్యలు ఏర్పడకుండా ఉండాలనే గిల్‌కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించాం' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. టీ20 వరల్డ్ కప్ అనంతరం జింబాబ్వే పర్యటనలో గిల్ టీ20 జట్టుకు సారథిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకూ గిల్ దేశం తరఫున 21 టీ20 ఆడాడు. ఒక సెంచరీ, మూడు అర్ధ శతకాలు సాధించాడు.

# ములానీ ఆల్‌రౌండ్ షో..!

### 'ఇండియా బీ'ని పడగొట్టిన కంబోజ్



దులీప్ ట్రోఫీలో 'ఇండియా ఏ' ఘన విజయం సాధించింది. తొలి రోజు నుంచి అదరగొట్టిన మయాంక్ అగర్వాల్ సేన 'ఇండియా డీ'పై 186 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత తెలుగు కుర్రాడు తిలక్ వర్మ(111), ప్రథమ్ సింగ్(122)లు సెంచరీలతో ఇండియా డీ బౌలర్ల భరతం పట్టారు. ఆ తర్వాత బంతి అందుకున్న తనుష్ కొతియాని(4/73), శామ్స్ ములానీ(3/117)లు ఇండియా డీని కుప్పకూల్చారు. ఇండియా ఏ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న రికీ భూయి(113) సెంచరీ కొట్టినా జట్టుకు ఓటమి తప్పించలేకపోయాడు. బ్యాటుతో, బంతితో రాణించిన శామ్స్ ములానీ(89, 3/117) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఇండియా బీ, ఇండియా సీల మధ్య ఉత్కంఠ సాగిన మ్యాచ్ చివరికి డ్రాగా ముగిసింది.

### తిలక్, ప్రథమ్ శతకగర్జన

దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌లో 'ఇండియా ఏ' దుమ్మురేపింది. ఇప్పటివరకూ టీ20ల్లో దంచేసిన తిలక్ వర్మ(111) రెడ్ బాల్ క్రికెట్‌లోనూ వీర కొట్టుడు కొట్టాడు. మరో ఎండ్‌లో ప్రథమ్ సింగ్(122) కూడా రెచ్చిపోయి ఆడాడు. దాంతో రెండో ఇన్నింగ్స్‌ను ఇండియా ఏ 380 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా డీని యశ్ దూబే(37), రికీ భూయి (113)లు ఆదుకున్నారు. రెండో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యంతో గెలుపు దిశగా నడిపారు. అయితే.. కొతియాన్, ములానీల విజృంభణతో ఇండియా డీ మిడిలార్డర్ పెవిలియన్ చేరింది. సంజూ శాంసన్(40) చివర్లో పోరాడినా సరిపోలేదు.

### నడ్డి విరిచిన కంబోజ్

ఉత్కంఠగా సాగిన ఇండియా బీ, ఇండియా సీల మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలుత ఇషాన్ కిషన్(111) విధ్వంసక సెంచరీ, మానవ్ సుతార్ (82), బాబా ఇంద్రజిత్(78), రుతురాజ్ గైక్వాడ్(58)ల వీరబాదుతో ఇండియా సీ తొలి ఇన్నింగ్స్‌లో 525 రన్స్ కొట్టింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా బీని కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్(157 నాటౌట్) ఆదుకున్నాడు.

### అభిమన్యు ఈశ్వరన్(157 నాటౌట్)

తొలి వికెట్‌కు జగదీశన్(74)తో కలిసి 129 రన్స్ జోడించిన అభిమన్యు పటిష్ఠ స్థితిలో నిలిపాడు. అయితే.. ఆ తర్వాత అతడికి సహకరించేవాళ్లు కరువయ్యారు. పేసర్ అన్షుల్ కంబోజ్ 8 వికెట్లతో ఇండియా బీ నడ్డి విరిచాడు. అతడి దెబ్బకు అభిమన్యు బృందం 332 పరుగలకే ఆలౌటయ్యింది. ఆ తర్వాత ఇండియా సీ 128 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

# విరిగిన చేయితోనే బరిలోకి..!




### అందుకే ఆ సెంటీమీటర్ తగ్గింది..!

బ్రస్సెల్స్ వేదికగా జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్లో నీరజ్ చోప్రా రెండో స్థానంతో నిరాశపరిచాడు. ఒక్క సెంటీ మీటర్ తేడాతో టైటిల్ కోల్పోయాడు. అయితే.. ఫైనల్లో నీరజ్ విరిగిన చేయితోనే పోటీ పడ్డాడు. నొప్పిని భరిస్తూనే ఈటెను విసిరాడు. కొద్దిలో టైటిల్ కోల్పోయిన భారత బడిసె వీరుడు వచ్చే ఏడాది మరింత బలంతో వస్తానని చెప్పాడు. అయితే.. తన చేయి విరిగిందనే విషయాన్ని పోటీల అనంతరం నీరజ్ ఎక్స్ వేదికగా వెల్లడించాడు. విరిగిన చేయి ఎక్స్ రే ఫొటోను అతడు పోస్ట్ చేశాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో నీరజ్ మూడో ప్రయత్నంలో బడిసెను 87.86 మీటర్ల దూరం విసిరాడు. జులియన్ వెబర్ 87.97 మీటర్ల దూరంలో అగ్రస్థానంలో నిలిచి టైటిల్ ఎగరేసుకుపోయాడు. '2024 సీజన్ ముగిసింది. ఈ ఏడాదంతా నేను నేర్చుకున్న విషయాలు, మెరుగైన తీరు, ఎదుర్కొన్న కష్టాలు, మానసికంగా సిద్ధమైన తీరు వీటన్నిటినీ బేరీజు వేసుకుంటా. ఇక సోమవారం.. ప్రాక్టీస్ సమయంలో నాచేతికి గాయమైంది. ఎక్స్ రే తీయగా నా ఎడమ చేతి నాలుగో వేలి దగ్గర ఎముక విరిగింది. అది నాకు ఎంతో సవాల్ విసిరింది. అయినా సరే నా బృందం సహాయంతో బ్రస్సెల్స్‌లో నేను పోటీ పడగలిగాను' అని నీరజ్ తెలిపాడు. ఎక్స్ ఖాతాలో నీరజ్ పోస్ట్ చూసిన అభిమానులంతా అతడి పట్టుదలకు జై కొడుతూ.. త్వరగా కోలుకోవాలంటూ కామెంట్లు పెడుతున్నారు. పారిస్ ఒలింపిక్స్ ముందు గజ్జల్లోని కండరాల సమస్య(స్పోర్ట్స్ హెర్నియాలో ఒక రకం)తో చోప్రా బాధ పడ్డాడు. దాంతో, అతడి సన్నద్ధత కూడా సరిగ్గా జరగలేదు. అయినా సరే.. చోప్రా విశ్వ క్రీడల్ల అదరగొట్టాడు. ఫైనల్లో 89.45 మీటర్ల దూరం బడిసెను విసిరి సిల్వర్ మెడల్‌తో చరిత్ర సృష్టించాడు. దేశానికి పతకం అందించాలనే తన లక్ష్యం పూర్తి కావడంతో కొన్ని రోజుల బ్రేక్ తీసుకుంటానని నీరజ్ చెప్పాడు. సర్జరీ చేసుకోవాలని అనుకున్న అతడు గాయం తీవ్రత ఎక్కువ లేనందున మళ్లీ ఈటెను అందుకున్నాడు. సర్జరీ వాయిదా వేసుకొని.. లసానే డైమండ్ లీగ్‌లో పోటీ పడిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

# ఆరోజే క్రికెట్‌కు వీడ్కోలు..!

### హింట్ ఇచ్చేసిన అశ్విన్




భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మళ్లీ బంతితో మాయ చేసేందుకు సిద్ధమవుతున్నాడు. చెన్నైలో బంగ్లాదేశ్‌తో జరుగనున్న తొలి టెస్టు కోసం అశ్విన్ నెట్స్‌లో బౌలింగ్ సాధనలో మునిగిపోయాడు. సొంత మైదానంలో చెలరేగిపోవాలని భావిస్తున్న ఈ ఆఫ్ స్పిన్నర్ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఇంకెన్ని రోజులు క్రికెట్ ఆడుతారు? మీ భవిష్యత్ ప్రణాళికలు ఏంటీ?' అనే ప్రశ్నలకు అశ్విన్ నిజాయతీగా సమాధానం చెప్పాడు. చెపాక్‌లో బంగ్లాదేశ్‌తో టెస్టు సన్నద్ధతలో ఉన్న అశ్విన్ యూట్యూబ్ చానెల్‌లో మాట్లాడాడు. ఈ సందర్భంగా అతడు తన మనసులో ఉన్నది ఉన్నట్టు చెప్పేశాడు. 'ఇప్పటికైతే క్రికెట్ నుంచి వైదొలగాలనే ఆలోచన నాకు ఏమాత్రం లేదు. ప్రస్తుతానికి నేను ఏరోజు కారోజు మీదనే దృష్టి పెడుతున్నా. ఎందుకంటే వయసు పెరిగే కొద్దీ ప్రతిరోజు అదనంగా శ్రమించాల్సి ఉంటుంది. గత 3 నుంచి 4 ఏండ్లలో నేను ఎంతో కష్టపడ్డాను.

### వందో టెస్టు క్యాప్ అందుకుంటూ..

అందుకనే కాబోలు నాకు వీడ్కోలు పలకాలనే ఆలోచన అయితే రాలేదు. అయితే.. ఇంకా మెరుగవ్వకూడదను అని అనుకున్న రోజున క్రికెట్‌ను వదిలేస్తా. ఇంకేం ఆలోచించను. అదే రోజు క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతా' అని అశ్విన్ వెల్లడించాడు. అంతేకాదు 40 ఏండ్లు వచ్చేంత వరకూ ఆడుతారా? అనే ప్రశ్నకు అశ్విన్ ఏమో చెప్పలేను అంటూ సమాధానమిచ్చాడు. 'ఫలానా వయసు వచ్చేంత వరకూ ఆడాలని లక్ష్యం అంటూ ఏదీ పెట్టుకోలేదు. అయితే.. లెజెండరీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే తన రికార్డు(619 వికెట్లు)ను నేను బద్దలు కొట్టాలని భావిస్తున్నాడు. అయితే.. అది నా వల్ల అవుతుందా? లేదా? అనేది చెప్పలేను. ఏది ఏమైనా క్రికెట్‌ను ప్రేమిస్తూనే ఉంటాను' అని అశ్విన్ తెలిపాడు. ఈమధ్యే వందో టెస్టు క్యాప్ అందుకున్న అశ్విన్ భారత విజయాల్లో ముఖ్య భూమిక పోషిస్తూ వస్తున్నాడు. 2011 నవంబర్‌లో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన ఈ స్పిన్ మాంత్రికుడు ఇప్పటివరకూ 516 వికెట్లు పడగొట్టాడు.



## వీరశైవుల అభివృద్ధికి కృషి చేస్తా

### అధ్యక్షులు గందిగే రాజు

**సదాశివపేట సెప్టెంబర్ 15(జనం సాక్షి).**

పట్టణంలోని వీరశైవ లింగాయత్ సమాజం ఎడ్ల బజార్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్ హాజరై మాట్లాడుతూ లింగాయత్ సమాజం అభివృద్ధి కొరకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా గంధిగరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు అనిమిశెట్టి జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి సిద్దిర్ కేరి వినోద్ కుమార్, కోశాధికారి అమరాధి రాచన్న లు నుంతంగా ఎన్నికయ్యారు. నూతంగన ఎన్నికైన వారిని జిల్లా గౌరవ అధ్యక్షులు శివచంద్ర కుమార్ పాటిల్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు , అధ్యక్షులు ప్రసాది మధు శేఖర్, కోశాధికారి చంద్రకాంత్ జిల్లా సమాజ పెద్దలు సిహెచ్ బసవరాజు గారు, పట్లోళ్ల చంద్రశేఖర్, పృథ్వీరాజ్, రాష్ట్ర నాయకులు కోట గుండప్ప, వాసారం శ్రీనివాస్, చింది బద్రీనాథ్, ఘనంగా సన్మానించారు. అనంతరం సమాజం అధ్యక్షులు గందిగా రాజు మాట్లాడుతూ పెద్దలు చూపించిన మార్గంలో సమాజాభివృద్ధి కొరకు స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మరియు చైర్ పర్సన్ శివరాజ్ అపర్ణ పాటిల్ గారి సహకారంతో మరియు జిల్లా సమాజం పెద్దల సలహాలతో సమాజాభివృద్ధికి కృషి చేస్తాను అని అన్నారు.

# మన జీవితాలను తీర్చిదిద్దేవారే గురువులు



## లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా అధ్యక్షులు డివిచారి

**మక్తల్ సెప్టెంబర్ 15 (జనంసాక్షి)**

ఉపాధ్యాయ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆదివారం హైదరాబాద్ లో నాగోల్ లోని పి బి ఆర్ కన్వెన్షన్ హాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ 320 ఏ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆచార్యదేవోభవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కోటేశ్వరరావు, వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి, రీజియన్ చైర్ పర్సన్ శ్రీనివాస్, జోన్ చైర్పర్సన్ శివ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి వి చారి మాట్లాడుతూ మన తలరాత రాసేది బ్రహ్మదేవుడైతే మన జీవితాలను తీర్చిదిద్దేవారే ఉపాధ్యాయులు, గురువులు అటువంటి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం లయన్స్ క్లబ్ కు ఎంతో గర్వకారణం అన్నారు. మొత్తం ఏనాబై క్లబ్ ల నుంచి నూటఏనభై మంది ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా నరసింహరెడ్డి, కుమార్ విభీషణ్‌లను ఎంపిక చేసి, శాలువాతో సన్మానం చేసి మెమొంటోలు అందజేశారు. ఇట్టి కార్యక్రమాల్లో మక్తల్ భీమా క్లబ్ కార్యదర్శి బి శ్రవణ్ కుమార్ రెడ్డి, డిస్టిక్ కో ఆర్డినేటర్ బి అంబదాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



# తాండల రూపు రేఖలు మారుస్తా

### కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్ రెడ్డి

**కోహీర్ సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :**


కోహీర్ మండలంలోని పీచెర్యాగడి పాత, కొత్త తాండల అభివృద్ధికి కృషి చేస్తానని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సమాజ సేవకులు ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పలుపురు నాయకులతో కలసి ఆయా తాండలలో పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముక్యంగా మురికి కాలువల నిర్మాణాన్ని సొంత డబ్బులతో చెపడతా నన్నారు. దత్తత తీసుకొని దశల వారిగా తాండలను అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు వినోద్ రాథోడ్, తండా ప్రజలు పాల్గొన్నారు.

## వినాయకులను దర్శించుకున్న మంత్రి జూపల్లి

**వీపనగండ్ల, సెప్టెంబర్ 15 (జనం సాక్షి)**



వివిధ రూపాలలో ఉన్న గణనాధులను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ గణనాథుని ఆశీస్సులు కొల్లాపూర్ నియోజక వర్గ ప్రజలపై వివిధ మండలాల గ్రామాల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రైతులకు పంటలు మంచిగా పండాలని కోరుకున్నట్లుగా తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు వెంట 11 వ ఇంచార్జ్ బిజ్జ రమేష్ పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి ముఖ్య అనుచరులు. బోయ రమేష్ నాయుడు, బిజ్జ నిరంజన్, మోజెర్ల గోపాల్, మొట్ట శివకుమార్, బోయ లచ్చి నాయుడు, మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కాలనీవాసులు ఉన్నారు.



## ఎమ్మెల్యే జిఎంఆర్ తండ్రి జి. కృష్ణారెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన మంత్రి

**మహబూబ్ నగర్ రూరల్ సెప్టెంబర్15(జనంసాక్షి)**

దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తండ్రి జి. కృష్ణారెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి ఆదివారం విచ్చేసిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిరా బోయి, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి, మక్తల్ కాంగ్రెస్ నాయకులు జలంధర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి లు దివంగత జి.కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్‌ను వారి కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు.

# కాంగ్రెస్ దుర్మార్గాలకు పరాకాష్ట

- తెలంగాణ ప్రజా వంచన దినోత్సవం జరుపుకోండి
- పటేల్ కాంగ్రెసోడైతే... తెలంగాణ విమోచన దినోత్సవాలు ఎందుకు జరపడం లేదు?
- పరేడ్ మైదానంలో 'ఫోటో ఎగ్జిబిషన్' ను ప్రారంభించిన బండి సంజయ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి)** : కాంగ్రెస్ పాలన దుర్మార్గాలకు పరాకాష్ట అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సెప్టెంబర్ 17న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం ఎందుకు నిర్వహించడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం' పేరుతో ఆ పార్టీ తెలంగాణ ప్రజలను వంచిస్తోందన్నారు. 50 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస పార్టీ ప్రజలను వంచించినందున 'తెలంగాణ ప్రజా వంచన దినోత్సవాన్ని' నిర్వహించుకోవాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రాచిరంపాన పెట్టిన రజకార్ల పార్టీ వారసులకు కాంగ్రెస్ వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. అంతకుముందు మాట్లాడిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ తెలంగాణ విమోచన పోరాటాలను పాఠ్యంశంగా పొందుపర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ విమోచనం కోసం జరిగిన పోరాటాలను, త్యాగాలను గుర్తు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ విమోచన దినోత్సవం' నిర్వహిస్తోందని తెలిపారు. తెలంగాణ విమోచన దినోత్సవాల నేపథ్యంలో సికింద్రాబాద్ లోని పరేడ్ మైదానంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తోపాటు పలువురు నేతలతో కలిసి ఫోటో ఎగ్జిబిషన్ ను బండి సంజయ్ తిలకించారు. అనంతరం వారితో కలిసి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై నిప్పులు చెరిగారు.

తెలంగాణ విమోచన దినోత్సవాలు జరిపే అర్హత బీజేపీకి లేదన్న కాంగ్రెస్ వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. మరి కాంగ్రెస్ కు మాత్రమే ఆ అర్హత ఉంటే ఇప్పటి వరకు తెలంగాణ విమోచన దినోత్సవాలను ఎందుకు నిర్వహించడం లేదు? ప్రశ్నించారు. తెలంగాణ విమోచన దినోత్సవాలపై అధికారంలో లేనప్పుడు ఒకమాట... వచ్చాక మరోమాట... ఇదీ కాంగ్రెస్, బీఆర్ఎస్ ల తీరు. ఒక పార్టీ ఏమో 'సెప్టెంబర్ 17న సమైక్యత దినోత్సవం' అంటది.. ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ 'ప్రజాపాలనా దినోత్సవం' నిర్వహిస్తుందట. మరి దాదాపు 50 ఏళ్లు రాష్ట్రాన్ని ఏలారు కదా... ఇన్నాళ్లు మీరు చేసింది ప్రజా వంచనా? ప్రజా వంచన దినోత్సవంగా నిర్వహించుకోండి. నేనడుగుతున్నా.. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పేరు మార్చి 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం' అని మార్చడానికి కారణమేంటి? అని ప్రశ్నించారు. నిజాం పాలనలో రజకార్ల దళం తెలంగాణ ప్రజలను ఊచ కోత కోసిందని, మహిళలను బట్టలిప్పి బతుకమ్మ ఆడించింది. పరకాల, బైరాన్ పల్లి, గుండ్రాంపల్లిలో వందల మందిని బలి తీసుకుందని, అలాంటి రజకార్ల దళం పార్టీగా ఏర్పడితే... ఆ పార్టీ వారసుడైన ఒవైసీని సీఎం పొగడటం వెనుక ఉద్దేశమేంది? అని ప్రశ్నించారు.

# గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

- ప్రభుత్వం తరపున అన్ని వసతుల కల్పన
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** గణేష్ నిమజ్జనానికి ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనానికి మండపాల నిర్వహకులు, ప్రజలు సహకరించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మానకొండూరు చెరువు వద్ద జరిగే నిమజ్జన ఉత్సవాల ఏర్పాట్లను ఆదివారం మంత్రి పరిశీలించారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. అందరి సహకారంతో నిమజ్జన ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా, ఉత్సాహంగా నిమజ్జనంలో పాల్గొనాలని కోరారు. కరీంనగర్లో టవర్ సర్కిల్ వద్ద తొలి వినాయక ఊరేగింపు 6 గంటలకు మొదలవుతుందని, సకాలంలో ఊరేగింపు ప్రారంభించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా గణేష్ ఉత్సవాలకు అందరినీ ఆహ్వానించాలని, అందరూ ఈ ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు. రెవిన్యూ, మున్సిపాలిటీ అధికారుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నిమజ్జనం రోజున మానకొండూరు గ్రామపంచాయతీ ఆవరణలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వం పెల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... నిమజ్జనం పూర్తయ్యేంతవరకు అధికారులంతా అందుబాటులోనే ఉండాలని కోరారు. అవసరమైతే షిఫ్ట్ ల వారీగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ సిబ్బందికి సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పేయి, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

# శారీరకంగా, మానసికంగా దృఢంగా మారాలి

- వారే అనేక విజయాలు సాధిస్తారు
- 'అల్ఫోర్స్' నరేందర్ రెడ్డి
- తనకు ఓటేయాలని అంబేడ్కర్ స్టేడియంలో వాకర్‌కు అభ్యర్థన



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** శారీరంకంగా మానసినకంగా దృఢంగా ఉన్న వారు అనేక విజయాలను నమోదు చేయడమే కాకుండా ఖ్యాతి గడిస్తారని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టబద్రుల నియోజక వర్గ అభ్యర్థి డా. వి.నరేందర్ రెడ్డి ఆదివారం రోజు ఉదయం కరీంనగర్ జిల్లా కేద్రంలోని డా.బి.అర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనటువంటి మార్నింగ్ వాక్ కార్యాక్రమానికి విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యారంగం పటిష్ఠపర్చడానికి, విద్యార్థులకు నాణ్యతమైన విద్యనందించటానికై అహార్నిశలు కృషిచేస్తూన్నామని తెలిపారు. అదే విధంగా తెలంగాణలో పట్టభద్రుల పాత్ర చాలా ఎనలేనిదని తెలుపుతూ వారు చేసిన త్యాగాలు చాలా గొప్పనైనవని పట్టభద్రులకు అన్ని రంగాలలో ప్రాధాన్యం కల్పించటానికి తాను అన్ని రకాలుగా ప్రయత్నించడమే కాకుండా వాటిని అమలు పర్చేలా ఒత్తిడి తెస్తానని తెలిపారు. పలు సమస్యలను పరిష్కరించేదందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ప్రత్యేకంగా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తానని ముఖ్యంగా వారికి స్వయం ఉపాధి పథకాలను అమలుపరుస్తామని తెలిపారు. విద్యరంగం పట్ల పూర్తి అవగహాన కల్గినవాడిగా, సమాజంలో ఎదురవుతున్న సమస్యలు తెలిసినవాడిగా రాబోయే 2025 సం.లో నిర్వహింపబడే పట్టభద్రుల ఎం.ఎల్.సి. ఎన్నికలలో నాకు మొదటి ప్రాధాన్యత ఓటు తనకే వేయాలని అభ్యర్థించారు. విద్యరంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న నరేందర్ రెడ్డిని పలు వాకర్ల అసోసియేషన్ కార్యావర్గాలు ఘనంగా సన్మానించారు.

# 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** మండలంలోని వంగర గ్రామంలో ఆదివారం వేకువ జామున ముజ్జిక రజిత అనే నిండు గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. ఆమె సూచన మేరకు 108 సిబ్బంది 30 పడకల వంగర ఆసుపత్రిని వదిలి హుజురాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో రజిత కరీంనగర్ జిల్లా ఇప్పల్ నర్సింగాపూర్ వద్ద పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది రవి తెలిపారు.

# సెప్టెంబర్ 21 నుండి అక్టోబర్ 20 వరకు మావోయిస్టు పార్టీ సంస్థాపనా వారోత్సవాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** సెప్టెంబర్ 21 నుండి అక్టోబర్ 20 వరకు మావోయిస్టు పార్టీ సంస్థాపనా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు పార్టీ) కేంద్ర కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. దేశవ్యాప్తంగా సమరోత్సాహంతో, విప్లవ స్ఫూర్తితో నిర్వహించాలని కోరింది. విప్లవోద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లను స్వీకరించాలని, మూడు అద్భుత ఆయుధాలుగా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ఐక్యసంఘటనలను అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చింది. పార్టీని నిర్మూలించే లక్ష్యంతో కొనసాగుతున్న 'ఆపరేషన్ కగార్' ను తిప్పికొడుదాం! ప్రజాపునాదిని, స్వీయాత్మక శక్తులను పెంపొందించుకుంటూ పార్టీని, విప్లవోద్యమాన్ని కాపాడుకుంటూ శత్రువుకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడుతూ విజయపథంలో పురోగమింపచేద్దాం! అన్న నినాదాలతో పార్టీ శ్రేణులకు, పీ.ఎల్.జీ.ఏ. బలగాలకు, విప్లవ ప్రజా నిర్మాణాలకు, ప్రజానీకం వారోత్సవాలు నిర్వహించాలని కోరింది.

# మూఢనమ్మకాలు జన జీవనానికి ప్రమాదం

- ప్రొఫెసర్ కె.నాగేశ్వర్
- సైంటిఫిక్ టెంపర్ ను అలవాటు చేసుకోవాలి
- విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం..
- ఘనంగా ముగిసిన జెవివి రాష్ట్ర మహాసభలు
- రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా చెలిమెల రాజేశ్వర్, పి.రాజా లో ఏకగ్రీవ ఎన్నిక..



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) : సైన్స్, రీజియన్స్ వేర్వేరు మార్గాల్లో ప్రయాణిస్తావని, ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ శాస్త్రీయ విశ్వాసాలను కలిగించడం జెవివి పన్ని అన్ని ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏ.ఎస్.రావు నగర్ లోని అణుపురం కమ్యూనిటీ హాలులో జనవిజ్ఞాన వేదిక 5వ రాష్ట్ర మహా సభలు ఆదివారం రెండో రోజు నూతన కమిటీని ఏకంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ మాసభల్లో ప్రజెంట్ సమక్షంలో 8 తీర్మానాలను ఆమోదించారు. ముగింపు ఉపన్యాసం ప్రొఫెసర్ కె.నాగేశ్వరరావు, విద్యాశాఖ ప్రిన్సిపాల్ కమిషనర్ బుర్ర వెంకటేషం హాజరయ్యారు. మతం, సైన్స్ మధ్య యుద్ధం సృష్టించొద్దు, ప్రజా సైన్స్ కార్యకర్తలకు సహనం, ఓపిక ఉండాలి అన్నారు. సైన్స్ చెబితే అది ఆటోమేటిక్ గా మూఢత్వం అవుతుంది అన్నారు. సైన్స్ నిరంతరం రియల్టీని నేర్పుతుంది అన్నారు. కాలక్రమేణా కొన్ని నమ్మకాలు సన్నగిల్లుతున్నాయి అన్నారు. ఇతరుల నమ్మకాన్ని గౌరవించే సంస్కారం నేర్చుకోవాలి అన్నారు. మూఢనమ్మకాలు జన జీవనానికి ప్రమాదం అని, దీని పై పోరాడాలి అన్నారు. సైన్స్ పెరుగుతున్న కొద్దీ ప్రజలే మారతారు అన్నారు. సైన్స్ ఇనిస్టిట్యూషన్స్ ప్రజలకు దూరం అయ్యాయి అన్నాడు. సైన్స్ ను ప్రజలకు అందకుండా చేస్తున్న ధోరణులపై ఫైట్ చేయాలి అన్నారు. ఆధారం లేని ఆలోచనలు సమాజంలో తోరుగుతున్నాయి అన్నారు.

విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ.. ఎదువుతున్న భారత దేశంలో సైన్స్ టెంపర్ లేకపోతే మూఢ, అంధ విశ్వాసాలు ఉంటాయి అన్నారు. మనిషి తన విజ్ఞానాన్ని అర్థం చేసుకుని ముందుకు వెళ్ళాలి అని తెలిపారు. అనవసరపు ఖర్చులతో చేసే పండుగలపై ప్రశ్నించే పనులు చేయాలి అని, విద్యార్థుల మైండ్ లో ఇలాంటి పనుల గురించి ఆలోచన తీసుకురావాలి అన్నారు. ప్రపంచంలో ఉన్న అన్ని కంపెనీలకు వచ్చే లాభాల్లో 90 శాతం 1 శాతం వర్గాల జేబుల్లోకి వెళ్తుంది అన్నారు. ధనికుల చేతిలో సైన్స్ బందీ కాకుండా చూడాల్సిన అవసరం ఉంది అన్నారు. సైన్స్ పేరుతో ప్రజలకు లాభం చేసే పనులకు ఆటంకం కలిగించొద్దు అన్నారు. ప్రజల నమ్మకాన్ని హార్ట్ చేయొద్దు అన్నారు.

### జేవీవీది యాక్టివ్ రోల్

విద్యారంగం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చాలా యాక్టీవ్ గా పని చేస్తోంది అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోయ వెంకటేశ్వరరావు అన్నారు. అణుపురం కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పలువురు మాట్లాడారు. జిల్లాల్లో టీచర్స్ కు ట్రైనింగ్ కూడా ఇస్తున్నామని తెలిపారు. విద్యారంగం, విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాం అన్నారు. వివిధ రంగాల్లో కూడా పని చేస్తున్నామని తెలిపారు. జేవివి మాజీ అధ్యక్షులు అందే సత్యం మాట్లాడుతూ.. అక్షరాశ్యతకు కృషి చేస్తున్నామని, నేడు తెలంగాణ లో 70 శాతానికి పైగా పెరిగింది అన్నారు. నేడు చేతబడులు తగ్గాయని, హత్యలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నామని తెలిపారు. పోలీస్ శాఖ సహకారంతో కలిసి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. విద్యా శాస్త్రీయత పెరిగితే ప్రపంచం తో పోటీ పడవచ్చు అన్నారు. పబ్లిక్ హెల్త్ ను ఇంకా మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది అన్నారు. ఈ పబ్లిక్ హెల్త్ కోసం బడ్జెట్ లో కేటాయింపులు పెంచాలి అన్నారు. హైడ్రాను జేవివి అభినందిస్తుంది అని, పేదలకు ప్రత్యామ్నాయం చూపించాలి అన్నారు. ప్రొఫెసర్ బిఎన్ రెడ్డి మాట్లాడుతూ.. 36 ఏండ్లుగా జేవివి చేస్తున్న కార్యక్రమాలకు గుర్తింపు ఉంది అన్నారు. అగ్రికల్చర్, సైన్స్, ఎన్విరాన్మెంట్ లాంటి సమస్యలపై పని చేస్తున్నామని తెలిపారు. జేవివి ఉపాధ్యక్షులు రమాదేవి మాట్లాడుతూ.. ప్రజారోగ్యంపై జేవివి పెద్ద ఎత్తున ప్రోగ్రామ్స్ చేస్తుంది అన్నారు. చేప మందు తీసుకోవడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు అని నిరూపించినట్టు తెలిపారు. వైద్యం పేద ప్రజలకు అందుబాటులో లేదని, పటిష్ట పర్చాల్సిన అవసరం ఉంది అన్నారు. కార్పొరేట్ ను నియంత్రించి, ప్రజలకు పబ్లిక్ హెల్త్ అందేలా చూడాలి అన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్ ను అభివృద్ధి చేయాలి అన్నారు. ప్రజారోగ్యంపై భవిష్యత్ లో పని చేస్తామని తెలిపారు. చెక్ ముఖి ఎడిటర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల్లో సైంటిఫిక్ టెంపర్ ను కలిగించడం ప్రాథమిక కర్తవ్యం అన్నారు. చెక్ ముఖి బుక్ లో అన్ని రకాల వివరాలు ఉన్నాయని, ఇది లార్జెస్ట్ సర్కులర్ సైన్స్ మంత్లీ గా ఉంది అన్నారు. విద్యార్థుల్లోకి సైన్స్ ను తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.

### జేవీవీ నూతన కమిటీ అధ్యక్షులుగా చెలిమెల రాజేశ్వర్

జేవీవీ నూతన కమిటీ అధ్యక్షులుగా చెలిమెల రాజేశ్వర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ బి.ఎన్.రెడ్డి, ఎస్.జితేందర్, అలవాల నాగేశ్వరరావు, ఆర్.వేంకటేశ్వరరావు, రావుల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా రాజా, కార్యదర్శులుగా రవీందర్ రెడ్డి, గంగరాజు, వెంకటరమణారెడ్డి, మహేంద్రం, శ్రీనివాసరావు, వెంకటరమణ, కోశాధికారిగా నాగరాజు, మరో 11మంది కమిటీ సభ్యులతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది




## సామాజిక ఉద్యమకారుల చరిత్రను

# పాఠ్యాంశాల్లో చేర్చాలి

- సమసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర
- నవోదయ అధ్యాపకులు డాక్టర్ శంకరమంచి శ్యాం ప్రసాద్ అభినందన సభలో వక్తలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి)** : సామాజిక ఉద్యమకారుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, చాకలి ఐలమ్మ, షేక్ బంధగీ, ప్రొఫెసర్ జయశంకర్ తదితరులను తెలుగు ఉప వాచకాల్లో పొందుపరచాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నిర్మాణాత్మకమైన భవిష్యత్తు తరాన్ని రూపొందించడంలో ఉపాధ్యాయునిదే ప్రధాన బాధ్యత అని కొనియాడారు. ఆదివారం ఉదయం హోటల్ సుప్రభాత్ లో నవోదయ అధ్యాపకుడు డాక్టర్ శంకరమంచి శ్యాం ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా విద్యావేత్తలు శ్రీ కె చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ వినయబాబు మాట్లాడారు. శ్యాంప్రసాద్ సామాజిక స్పృహ కలిగిన ఉపాధ్యాయుడే కాకుండా బాధ్యత కలిగిన రచయిత అన్నారు. సంప్రదాయ సాహిత్యంలో ఆయనకు ఎంత పట్టు ఉన్నదో, ఆధునిక సాహిత్యంలోనూ అంతే పట్టు ఉందన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో శ్యాంప్రసాద్ నిర్వహించిన పాత్ర గొప్పదన్నారు. సీనియర్ తెలుగు పండితులు పాఠ్యపుస్తక రచయిత శ్రీ పల్లెర్ల రామ్మోహన్రావు సంపాదకత్వంలో శ్యాంప్రసాద్ జీవిత సాహిత్యాలపై వెలువడిన శంకరమంచీయం అభినందన సంచికను తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు జూలూరి గౌరీ శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తుల్ని వెలుగుదీసి వారిచే రచన వ్యాసంగాన్ని కొనసాగింపజేసిన ఆదర్శ అధ్యాపకుడు డాక్టర్ శంకరమంచి అన్నారు. విషయాన్ని శ్రోతలను ఆకట్టుకునేలా చెప్పడంలోనూ శ్యాంప్రసాద్ సిద్ధహస్తుడని అన్నారు. పాలకుర్తి మాజీ సర్పంచ్ గంగు కృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థుల సామాజిక నేపథ్యాన్ని అర్థం చేసుకుని విషయం ఎంత గంభీరమైనద్కెనా వాళ్లకు మనసుకు ఎక్కేలా చెప్పడం శ్యాంప్రసాద్ ప్రత్యేకత అన్నారు. తరగతి గదిలో సమాజ ప్రతిబింబాన్ని దర్శించిన మేధావి, దార్శనికుడు, విద్యార్థులలో తెలుగు భాష, సంస్కృతుల పట్ల అవగాహన పెంపొందించడంలో శ్యాంప్రసాద్ చేసిన కృషి అభినందనీయమని జనంసాక్షి ఎడిటర్ రహమాన్ అన్నారు. ఆదర్శ అధ్యాపకులు మోతు కూరి నరహరి, చుక్కా రామయ్య వంటి మేధావుల ప్రభావంతో తన బోధన, రచనా వ్యాసంగాన్ని కొనసాగించానని శ్యాం ప్రసాద్ అన్నారు. ఈ సభలో శ్యాం ప్రసాద్‌ను అతిథులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ నవీన్ డాక్టర్ సంజీవ్, పవన్, పద్మ, సందీప్ ప్రసంగించారు. పాలకుర్తి నుండి రమేష్ రాజా, సోమనాథ కళా పీఠం అధ్యక్షులు రాపోలు సత్యనారాయణ సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంప్రసాద్ స్నేహితులు మహేష్, పల్లె వెంకన్న, ఎన్.విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు. చిరంజీవి అక్షిత ఆలపించిన గేయాలు సభికులను ఎంతగానో అలరించాయి.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370